

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 201 పేజీలు: 10+4 వెల: 6.50


**ఐదుగురికి జీవిత ఖైదు** 2

28 మందికి 3 నుంచి పద్నాలుగేళ్ల జైలుశిక్ష

**ఎన్టీఎంలో ప్రక్షాళన.. 600 మంది తొలగింపు** 5

**ప్రభుత్వ ధనంతో 'ఉచిత' పథకాలా?** 2



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై హైకోర్టు వ్యాఖ్యలు

స్టే ఎత్తివేతపై నేడు నిర్ణయం?

**ప్రిన్సిపల్ రూపారెడ్డి హంతకులు విద్యార్థులే** 3



'బాబు!'.. అనే ఒకే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ

కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులు

రూ.1.54 లక్షల నగదు ,కత్తి, ఐఫోన్, సెల్‌ఫోన్లు స్వాధీనం: జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

# సురేఖకు నోటీసులు

## కుమార్తె సుస్మిత అనుచిత వ్యాఖ్యలపై పిసిసి ఆగ్రహం

## సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా సుస్మిత ఘాటు వ్యాఖ్యలు

## ఆమె తీరును తీవ్రంగా తప్పుపట్టిన క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

## తాజా వివాదంపై నివేదిక కోరిన మీనాక్షి నటరాజన్

## చిన్నారెడ్డికి కూడా నోటీసులు, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు19:** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై >>2



బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న డి.సిఎం భట్టి

# రైతుల వద్దకే బ్యాంకులు!

## సకాలంలో రుణాలివ్వాలి.. క్యూర్ అనుగుణంగా వ్యూహాలు

## 2047 విజన్‌తో అభివృద్ధి ఒప్పందం

## వ్యవసాయానికి రూ.52,337 కోట్ల రుణాలు పంపిణీ

## రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిసిఎం భట్టి

**హైదరాబాద్, అగస్టు 19, ప్రభాతవార్త:** రైతుల వద్దకు బ్యాంకులే వెళ్లి వారికి అవసరమైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రతి రైతుకూ సకాలంలో రుణం అందించాలన్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో బ్యాంకులు కీలక భాగస్వాములుగా మారాలని సూచించారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని >>2

# 800 ప్రాంతాల్లో 'ఛాత్రోంకి గూంజ్'

## సంస్థాగత సమీక్షకు ప్రత్యేక కమిటీలు

## ఉత్తరాఖండ్ శుద్ధి అంశంపైనా నిరసనలు

## సిడబ్ల్యుసి సమావేశంలో కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ సిడబ్ల్యుసిలో సిఎం రేవంత్, డికె తదితరులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** వందేమాతరం శతాబ్ది వేడుకలు, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఛాత్రోన్ కీ గూంజ్ ప్రచారం, రామ మందిరానికి సంబంధించిన 'చందా చోరీ' వివాదం, ఉత్తరాఖండ్‌లో శుద్ధీకరణ ఘటన తదితర అంశాలపై కాంగ్రెస్ బుధవారం తన రాజకీయ వ్యూహాన్ని ఖరారు చేసింది. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే >>2



**సినిమా టికెట్ ధరల పెంపు**

ఆదాయంలో 20% సంక్షేమ నిధికి జమ 2






భారీ వర్షాలు కురవడంతో బుధవారం గువాహతిలో చెరువును తలపిస్తున్న రహదారులు

# సినిమా టికెట్ ధరల పెంపు

## ఆదాయంలో 20% సంక్షేమ నిధికి జమ

**హైదరాబాద్, అగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సినిమా టికెట్ల ధరలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆదాయంలో 20 శాతం చిత్ర పరిశ్రమలోని కార్మికుల సంక్షేమ నిధికి కేటాయించాలని నిబంధన విధించింది. వీటికి సంబంధించి బుధవారం కొత్త మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం టికెట్ల ధరను రూ.30 నుండి రూ.70, ప్రీమియం రూ.50 నుండి రూ.100కు పెంచింది. అలాగే ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం రూ.50 నుండి రూ.150, ప్రీమియం టికెట్లకు రూ.100 నుండి రూ.200గా పెంపుదల చేసింది. ఇక మల్టీప్లెక్స్‌లో రెగ్యులర్‌కు రూ.100 నుండి రూ.250, రిక్లైనర్‌లో రూ.200 నుండి రూ.300గా ఖరారు చేసింది. ప్రతి థియేటర్‌లో 25 సీట్లు నాన్ ప్రీమియం కేటగిరీ కింద సాధారణ రేట్లకే ఉంచాలని స్పష్టం చేసింది. కాగా సినిమా టికెట్ల పెంపు అంశం పైన ఎంతో కాలంగా చర్చ సాగుతోంది. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో పలువురి అభిప్రాయాలు సేకరించింది. వీటన్నింటిని క్రోడీకరించి సినీ పరిశ్రమ కార్మికులకు ప్రాధాన్యత పైన నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఆదాయం, కేటాయింపు పైనా క్లారిటీ ఇస్తూ ఉత్తర్వుల్లో మార్గదర్శకాలు ప్రకటించింది. అందులో భాగంగా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయంలో సరిగ్గా 20 శాతాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించే ప్రత్యేక సంక్షేమ విరాళంగా తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నిబంధనను పకడ్బందీగా అమలు చేసే బాధ్యతను చిత్ర నిర్మాణ సంస్థలకే అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చింది. ఇక అదనపు ఆదాయంపై వర్తించే ఈ వాటాను ఎగ్జిబిటర్ల నుంచి నేరుగా నిర్మాతలే వసూలు చేయాలని నిర్దేశించింది. ఆ విధంగా వసూలు చేసిన మొత్తాన్ని చలనచిత్ర పరిశ్రమ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఖాతాకు లేదా తెలంగాణ ఫిల్మ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అధికారిక ఖాతాకు జమ చేయాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఇటీవల వచ్చిన అఖండ2, ది రాజాసాబ్, మన శంకర వర ప్రసాద్ గారు పండుగకు వస్తున్నారు, అలాగే పెద్ది సినిమాలకు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతినివ్వగా ఈ సినిమాలకు సంబంధించిన నిర్మాణ సంస్థలైన 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, షైన్ స్క్రీన్స్ ఇండియా ఎల్ఎల్‌పి, వృద్ధి సినిమాస్ ఎల్ఎల్‌పిలకు ప్రత్యేకంగా లేఖలు పంపింది. టికెట్ ధరల పెంపు ద్వారా సమకూరే అదనపు రాబడిలో 20 మొత్తాన్ని సంక్షేమ నిధికి మళ్లించే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని, తదనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా నిర్మాతలకు ప్రభుత్వం సూచించింది.

### బాలికల అక్రమ రవాణా, లైంగిక దాడుల కేసులు

# ఐదుగురికి జీవిత ఖైదు

## 28 మందికి 3 నుంచి పధ్నాలుగేళ్ల జైలుశిక్ష

### పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** బాలికల అక్రమ రవాణా, లైంగిక దాడులకు సంబంధించిన కేసుల్లో హాకా భవన్‌లో గల ఫోక్సో ప్రత్యేక కోర్టు ఐదుగురు నేరగాళ్లకు జీవిత ఖైదు శిక్ష, 28 మందికి మూడు నుంచి 14 ఏళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ బుధవారం సంచలన తీర్పు వె లువరించింది. రాష్ట్ర సిఐడి, మహిళా భద్రత విభాగం నమోదు చేసిన కేసుల్లో ఫోక్సో ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు ఇలా వు న్నాయి. సిఐడి విభాగంలో 2015 జూలై 17వ తేదీన మైనర్ బాలికను ఉద్యోగం పేరిట ముగ్గురు వ్యక్తులు మోసం చేయడంతో పాటు అత్యాచా రానికి పాల్పడ్డారు. అనంతరం ఆ బాలికను సెక్స్ వర్కర్‌గా మార్చి ఒక ముఠాకు విక్రయించారు. దీనిపై సిఐడిలో కేసు నమోదయ్యింది. నాలు గు నెలల తరువాత బాధిత బాలిక తప్పించుకుని పోలీసులను ఆశ్రయించగా నిందితులను పట్టుకున్నారు. ఇదే సమయంలో తొమ్మిది మంది బా లికలకు పోలీసులు విముక్తి కల్పించారు. ఈ కేసులో ముగ్గురు నేరగాళ్లకు జీవిత ఖైదు శిక్ష పడింది. ఇలాంటిదే సిఐడిలో నమోదైన మరో కేసు లో ఇద్దరు నేరగాళ్లకు జీవిత ఖైదు శిక్ష పడింది. దీని తరువాత బాలికల అక్రమ రవాణా, లైంగిక దాడులకు పాల్పడిన ముగ్గురికి 14 ఏళ్ల కారా గార శిక్ష. 14 మందికి పదేళ్ల కారాగార శిక్ష, 11 మందికి మూడేళ్ల కారాగార శిక్ష విధించారు. దీంతో పాటు పోలీసులు రక్షించిన తొమ్మిది మంది బాలికలకు నిందితులు తలా ఐదేసి లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని న్యాయ మూర్తి ఆదేశించారు. మైనర్ బాలికల అక్రమ రవా ణా, లైంగిక దాడులకు సంబంధించిన కేసుల్లో నేరగాళ్లకు శిక్షలు పడేలా చేసిన పోలీసు అధికారులను సిఐడి చీఫ్ చారు సిన్హా ఈ సందర్భంగా అభినందించారు.

# టిఎంసి ఎంపి మహువా మొయిత్రాకు కోర్టు అరెస్టు వారంట్

**కోల్‌కత్తా, ఆగస్టు 19:** టీఎంసీ పార్టీ ఎంపీ మహువా మొయిత్రాకు పశ్చిమ బెంగాల్‌లోని కోర్టు షాకిచ్చింది. విద్వేష ప్రసంగంపై దాఖలైన కేసులో అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. సమన్లు జారీ చేసినప్పటికీ హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు బుధవారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ జిల్లా కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. తులసి మాలలపై మత విశ్వాసాలు దెబ్బతీసేలా మహువా మొయిత్రా వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై కేసు నమోదైంది. ఇదే సమయంలో ఇండియన్ ఆర్మీపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై కేసు దాఖలైంది. ఈ కేసు విచారణ కోసం ఆమె కోర్టులో స్వయంగా విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఇందుకోసం పలుమార్లు ఆమెకు కోర్టు సమన్లు జారీ చేసింది. అనేకసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆమె కోర్టుకు రాలేదు. బుధవారం కూడా విచారణకు రావాల్సి ఉంది. అయినప్పటికీ ఈ రోజు కూడా ఆమె విచారణకు హాజరుకాలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కృష్ణానగర్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

### ప్రభుత్వ ధనంతో

# 'ఉచిత' పథకాలా?

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై హైకోర్టు వ్యాఖ్యలు

### స్టే ఎత్తివేతపై నేడు నిర్ణయం?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు19:** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ధనాన్ని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి ఉచిత పథకాలకు ఖర్చు చేస్తే ఎలా అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. బడ్జెట్లో కేటాయింపుల ప్రకారం పథకాలకు డబ్బులు ఇస్తున్నట్లు తెలిపింది. పేద యువతుల వివాహం కోసమే ఈ నిధులు కేటాయిస్తున్నట్లు వివరించింది. అయితే ప్రభుత్వ ధనాన్ని ఉచిత పథకాలకు ఖర్చు చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది.
భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

## వారం - వర్జ్యం

20-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.అష్టమి రా.9.20
న.విశాఖ ఉ.9.09
వ.మ.1.36-మ.3.23
దు1. ఉ.10.04-ఉ.10.54
దు2. మ.3.07-మ.3.57
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది.

**వృషభం :** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. మీకు అనుకూలాంశాలు ఎక్కువగా ఉంటాయి.

**మిథునం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** నూతన కాంట్రాక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. విహార యాత్రలు చేస్తారు.

**సింహం :** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. ప్రయాణాలు జాగ్రత్త.

**కన్య :** విద్యావకాశాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వస్త్ర లాభం.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పదవులలో, హోదాలు లభించటానికి సమయం పడుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం :** పాత బాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాహ యత్నాలు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు :** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించటానికి కాలంకలిసి రాదు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

**మకరం :** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం :** సంక్షేమ సంఘాల వలన లాభపడతారు. మీ మేధస్సుతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** చాలాకాలంగా పరిష్కారం కాని కుటుంబ సమస్యలు ఈ రోజు పరిష్కారమవుతాయి. వాహన సౌఖ్యం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సురేఖకు నోటీసులు

>> చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయటపెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖను దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు. మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని, అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వబోనని తెలిపారు.
కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన సీనియర్ శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డిపైన కుమార్తె కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రోజులలో వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు టిపిసిసి క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేసింది. ఎల్బీ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశాలు జారీ చేసింది. పలువురిని వ్యక్తిగత విషయాలపై దూషించడమే కాకుండా కులాల పేరుతో దూషించిన సంఘటనలపై సరైన ఆధారాలు ఉండడంతో జక్కిడి ప్రభాకర్ రెడ్డి ని సస్పెండ్ చేస్తూ బుధవారం ఆదేశాలు ఇచ్చింది. మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి ఇటీవల వనపర్తి నియోజక వర్గంలో ఒక సభలో చేసిన పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలపై, స్థానిక ఎమ్మెల్యే పై చేసిన అనుచిత ప్రసంగాల పై మూడు రోజులలో వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది.

# 800 ప్రాంతాల్లో 'ఛాత్రోంకి గూంజ్'

>> అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి 88 మంది నేతలు హాజరయ్యారు. మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు సీనియర్ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. పేపర్ లీకేజీలు, విద్యాపరీక్షా వ్యవస్థలోని సమస్యలపై కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని వర్కింగ్‌కమిటీ నిర్ణయించింది. ఈ ప్రచారంలో భాగంగా 800 నగరాల్లో సభలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. వీటిలో కొన్ని కార్యక్రమాలకు రాహుల్ గాంధీ నాయకత్వం వహించే అవకాశం ఉందన్నారు. పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలు, వాటిని ప్రభుత్వం ఎదుర్కొన్న తీరుపైనా సమావేశంలో చర్చించారు. విద్యా, పరీక్షా వ్యవస్థలో సమూల మార్పులకు సంబంధించి నిపుణులతో సంప్రదింపులు జరిపి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రులను ఖర్గే ఆదేశించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాలకు విజయవంతంగా సాగాయని, ప్రభుత్వం అనేక అంశాల్లో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొందని వేణుగోపాల్ పేర్కొన్నారు.
రామ మందిర విరాళాలకు సంబంధించిన వివాదాన్ని కూడా కాంగ్రెస్ ప్రధాన రాజకీయ అంశంగా తీసుకుంది. చందా చోరీ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. గ్రామాలు, పంచాయతీల స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఆదేశాలు ఇచ్చినట్లు వేణుగోపాల్ తెలిపారు. రామ మందిరం పేరుతో ప్రజలను ధ్రువీకరించేందుకు ప్రయత్నించిన వారు ఇప్పుడు ప్రజల ముందు బహిర్గతమయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే కార్యక్రమం అనంతరం జరిగిన శుద్ధీకరణ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వందేమాతరం శతాబ్ది వేడుకలపై చవ్వందేమాతరం శతాబ్ది వేడుకలను కూడా కాంగ్రెస్ తన రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో కీలకంగా చేర్చింది. జాతీయ భావనతో కూడిన ఈ అంశంపై పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిడబ్ల్యుసి చర్చించింది. భారత్‌చైనా సరిహద్దు పరిస్థితిపైనా సమావేశంలో చర్చ జరిగింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాటు జరిగిందన్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రస్తావించింది. చైనా విషయంలో కేంద్ర ప్రభుత్వం లొంగుబాటు విధానం అనుసరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. ఎన్నికల పనితీరు, పార్టీ సంస్థాగత వ్యవహారాలను సమీక్షించేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సీడబ్ల్యూసీ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.
ముఖ్యంగా బ్లాక్, జిల్లా స్థాయిల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలను పరిశీలించేందుకు ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మా గాంధీ బాధ్యతలు స్వీకరించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్‌లో బెలగావిలో శతాబ్ది వేడుకలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. జార్ఖండ్ ప్రజలకు సీడబ్ల్యూసీ కృతజ్ఞతలు తెలిపింది. జేఎంఎం, కాంగ్రెస్ (ఐఎన్‌సీ), ఇతర ఇండియా కూటమి పార్టీలకు ప్రజలు స్పష్టమైన, నిర్ణయాత్మక తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అంతకుముందు సీడబ్ల్యూసీ సమావేశం ప్రారంభంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత స్థాయిలో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని పరిస్థితుల్లోనూ పార్టీ నేతలు క్రమశిక్షణను పాటిస్తూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, అంబికా సోనీ, ముకుల్ వాస్నిక్, పి.చిదంబరం తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఏ. రేవంత్ రెడ్డి, వి.డి. సతీశన్, సుఖ్‌విందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ కూడా వర్కింగ్‌కమిటీ సమావేశానికి హాజరయ్యారు.



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన సిడబ్ల్యుసి భేటీలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే

# రైతుల వద్దకే బ్యాంక్‌లు!

>> సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదని, రాష్ట్ర ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందమని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకింగ్ రోడ్ మ్యాప్‌ను రూపొందించాలన్నారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ ఆదాయం పెరుగుదల, ప్రైవేట్ పెట్టుబడి సమీకరణ బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని వెల్లడించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయం పునాదని తెలిపారు. రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, బ్యాంకింగ్ వ్యవస్థే వారి వద్దకు వెళ్లాలని చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలన్నారు.
రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని పేర్కొన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని సూచించారు. జూన్ నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి రూ.52,337 కోట్లు రుణాలుగా అందించాయన్నారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన కాలపరిమితి ఉండాలని తెలిపారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందాయన్నారు. రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు. అలాగే తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని చెప్పారు. క్యూర్ లో ఎఐ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమన్నారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలని తెలిపారు.
రాష్ట్రంలో జనధన్‌కు సంబంధించి 19.13 లక్షల జీరో బ్యాలెన్స్ ఖాతాలు ఉండగా, వారిని పొదుపు, బీమా, రుణాల దిశగా ప్రోత్సహించడమే నిజమైన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అని వెల్లడించారు. గ్రామాల్లో బిజినెస్ కరస్పాండెంట్లను క్రియాశీలకం చేసి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలన్నారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేలా ఫైనాన్స్ అందించాలని చెప్పారు.

### తెలంగాణ పోస్టాఫీసుల్లో

# సరికొత్త సేవలు

## రూ.30కే గంగాజలం, ప్రత్యేక రాఖీ ఎన్వెలప్‌లు

**హైదరాబాద్, అగస్టు 19, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పోస్టాఫీసులు సరికొత్త సేవలతో ముందుకు వచ్చాయి. శ్రావణ మాసం, రాఖీ పౌర్ణమి వేడుకల వేళ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు తెలంగాణ పోస్టల్ సర్కిల్ కొన్ని ప్రత్యేక ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తెచ్చింది. పవిత్ర గంగాజలం నుంచి ప్రత్యేక రాఖీ కవర్ల వరకు పలు ఆకర్షణీయమైన సేవలను పోస్టల్ శాఖ ప్రవేశపెట్టింది. ఇళ్లలో పూజల కోసం గంగాజలాన్ని ఉంచుకోవాలనుకునే భక్తులకోసం గంగోత్రి నుంచి నేరుగా తెప్పించిన 250 మి.లీ. గంగాజలం బాటిళ్లను పోస్టాఫీసుల ద్వారా విక్రయిస్తున్నారు. ఒక్కో బాటిల్ ధర రూ.30గా నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల హెడ్ పోస్టాఫీసులు, ఎంపిక చేసిన పోస్టాఫీసులలో ఈ బాటిల్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే పోస్టల్ శాఖ అధికారిక ఈ కామర్స్ ప్లాట్‌ఫారమ్ ద్వారా కూడా వీటిని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయవచ్చని పోస్టల్ అధికారులు తెలిపారు. మరోవైపు రాఖీ పౌర్ణమి సమీపిస్తున్న తరుణంలో, దూర ప్రాంతాల్లో ఉండే కుటుంబ సభ్యులకు రాఖీలను సురక్షి తంగా పంపేందుకు వీలుగా ఎంపిక చేసిన పోస్టాఫీసులలో రూ.15 ధరతో ప్రత్యేక రాఖీ పోస్ట్ ఎన్వెలప్‌లను అందుబాటులో ఉంచారు. అలాగే రాఖీ మెయిల్స్ పంపేందుకు స్పీడ్ పోస్ట్ సేవలను వినియోగించుకునే వారికి పోస్టల్ శాఖ ఊరటనిచ్చింది. రాఖీ పోస్టేజ్ ఛార్జీలపై 10 శాతం ప్రత్యేక రాయితీని ప్రకటించగా, ఆగస్టు 12 నుంచి ఈ డిస్కౌంట్ సేవలు పోస్టల్ నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉన్నాయి. పండుగ వేళ బంధువులకు కానుకలు, రాఖీలు పంపేందుకు ప్రజలు తమ సమీపంలోని పోస్టాఫీసులను సందర్శించి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ కోరింది.

# 60 కిలోమీటర్లు చొరబాట్లు పూర్తిగా అవాస్తవం

## కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు వెల్లడి

**ఇటానగర్, ఆగస్టు 19:** అరుణాచల్ ప్రదేశ్‌లోకి చైనా సైన్యం 60 కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిందంటూ వస్తున్న వార్తలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ఈ కథనాలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. అరుణాచల్‌లోని అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో వాస్తవాధీన రేఖను దాటి చైనా సైనికులు లోపలికి వచ్చినట్లు స్థానికులు ఆరోపించిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చారు. రిజిజు మాట్లాడుతూ, భారత్‌చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో సుదీర్ఘ సరిహద్దు ఉంది. క్షేత్రస్థాయిలో ఈ సరిహద్దును ఇప్పటికీ పూర్తిస్థాయిలో, స్పష్టంగా నిర్ణయించలేదు. టిబెట్‌తో మన సరిహద్దును గతంలో సరిగ్గా గుర్తించకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయని వివరించారు. స్థానికుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెబుతూనే, బంగ్లాదేశ్‌కు చెందిన పాత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి చర్యలు సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనిక బలగాల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కిరణ్ రిజిజు ఈ సందర్భంగా ఆరోపించారు.

# నిషేధిత భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు19:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీ ఎత్తున అవినీతి, భూదందాలు జరుగుతున్నాయని, స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన క్షమాపణే ఇందుకు నిదర్శనమని బీజేపీ శాసనసభా పక్ష నేత (బీజేఎల్పీ) ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షల కోట్ల రూపాయల విలువైన కోటి ఎకరాల భూములను 22ఎ నిషేధిత జాబితా(ప్రొహిబిటెడ్ లిస్ట్)లో పెట్టి బేరసారాలు నడుపుతున్నారని, ఇంత పెద్ద తప్పిదం చేసి కేవలం క్షమాపణతో సరిపెట్టుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్వయంగా యాదగిరిగుట్టలోని తన 42 ఎకరాల భూమి కూడా నిషేధిత జాబితాలోకి వెళ్లిందని, దీని వెనుక కుట్ర దాగి ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని చెప్పడాన్ని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ భూదందాలు, నిషేధిత భూముల జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలని, సమగ్ర విచారణ లేదా సీబీఐ ఎంక్వైరీకి ఆదేశించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ సంస్థలకు, బీఆర్ఎస్ పార్టీకి బినామీగా ఉన్న ఫీనిక్స్ కంపెనీకి మధ్య భారీ క్విడ్ ప్రోకో జరిగిందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

### గాదె ఇన్నయ్యకు హైకోర్టులో ఊరట
## ఎనిమిది నెలల తరువాత బెయిల్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ బావజాలాన్ని వ్యాపింపచేస్తున్న అభియోగాలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ ) నమోదు చేసిన చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కేసులో అరెస్టయిన గాదె ఇన్నయ్య అలియాస్ ఇన్నారెడ్డికి ఎనిమిది నెలల తరువాత హైకోర్టులో రెగ్యులర్ బెయిల్ లభించింది. గత ఏడాది డిసెంబర్ నెల 21వ తేదీన ఇన్నయ్యను జనగాంలో ఎన్ఐఎ పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. జనగామలో గత డిసెంబర్‌లో మావోయిస్టునాయకుడు కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియలకు హాజరైన సమయంలో ఇన్నయ్య మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడారని ఎన్ఐఎ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇన్నయ్యను ఎన్ఐఎ హైదరాబాద్ విభాగం అధికారులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆయన రిమాండులో ఉన్నారు. మరోవైపు గాదె ఇన్నయ్యకు బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయ వాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు బుధవారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. 25వేల రూపాయల పూచీకత్తుతో పాటు ప్రతీ శుక్రవారం కూకట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో విచారణాధికారి ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. కాగా మూడు నెలల క్రితం ఇన్నయ్య అనారోగ్య సమస్యల కారణంగా మెడికల్ బెయిల్‌పై జైలు నుంచి విడుదలై ఆసుపత్రిలో చేరారు. తాజాగా హైకోర్టు ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

## చంచల్‌గూడ జైలుకు ఉదయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించిన కేసులో అరెస్టయి మూడు వారాలుగా చంచల్‌గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ బుధవారం ముగిసింది. మంగళవారం ఈ కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకోవడం తెలిసిందే. మొదటిరోజు ఆరు గంటల పాటు నిందితుడిని విచారించగా రెండవ రోజు కూడా మరో ఆరు గంటల పాటు విచారించినట్లు తెలిసింది. కాగా రెండవ దఫా కస్టడీ విచా రణలో కూడా ఉదయ్ కృష్ణారెడ్డి నోరు మెదపలేదని తెలిసింది. మొదటి దఫా రెండు రోజుల కస్టడీలోనూ ఇతను పోలీసులకు సహకరించని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇతన్ని రెండవ దఫా కస్టడీలోకి తీసుకున్నారు. కాగా కస్టడీ విచారణ ముగిసిన తరువాత అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి తదనంతరం కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణపై పోలీసులు గురువారం కోర్టుకు నివేదిక సమర్పించనున్నారు.

## నటి నిధి అగర్వాల్ విచారణ
### బెట్టింగ్ యాప్‌ల కేసులో ఇడి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌కు సంబంధించి దక్షిణాది సినీ తారలను కేంద్ర దర్యా ప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) మరోసారి విచారించడం మొదలు పెట్టింది. గత ఏడాది జూన్ నుంచి ఆగస్టు నెల వరకు వరుసగా తెలుగు, హిందీ నటులను విచారించిన ఈడీ అధికారులు సంవత్సరం తరువాత బుధవారం హిరోయిన్ నిధి అగర్వాల్‌ను హైదరాబాద్ ఇడి అధికారులు రెండు గంటలపాటు విచారించారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆమె తన సహాయ కులతో కలిసి హాజరయ్యారు. విచారణకు ఆమె ఒకత్తినే అనుమతించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ బ్యాంకుల లావాదేవీలను, ఏ యాప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు? దాని వివరాలు, ఆ సంస్థ నుంచి తీసుకున్న నగదు వివరాలపై ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. యాప్‌లను ప్రమోట్ చేసినందుకు తీసుకున్న రిమ్యునరేషన్ ఎంత ? ఇది హవాలా రూపంలో వచ్చిందా? నేరుగా తీసుకున్నారా అని ఈడీ అధి కారులు అడిగినట్లు తెలిసింది. ఒకవేళ హవాలా రూపంలో తీసుకుంటే ఇందుకు ఎవరు సహకరించారు? ఒకవేళ నేరుగా తీసుకుని వుంటే దీని తాలూకు రసీదులను సమర్పించాలని ఈడీ అధికారులు ఆమెను కోరినట్లు తెలిసింది. కాగా విచారణ సందర్భంగా నిధి అగర్వాల్ ఈడీ అధికారుల ప్రశ్నలలో కొన్నింటికి సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. దేశంలో చాలా రాష్ట్రాల్లో గేమింగ్ యాప్స్‌కు చట్టబద్దత వుందని, ఈయాప్స్ నుంచి జీఎస్‌టితోపాటు ఆయా రాష్ట్రాలు స్థానిక పన్నులను కూడా వసూలు చేస్తున్నారని, వీటికి ఆయా రాష్ట్రాలు రిజిస్ట్రేషన్ లైసెన్స్ ఇస్తున్నాయని ఈ క్రమంలోనే తాను ప్రమోషన్లలో పాల్గొన్నానని చెప్పినట్లు తెలిసింది. తన బ్యాంకు ఖాతాల వివరాలు సమర్పించిన నిధి అగర్వాల్ ఇంకా వివరాలు ఏమైనా కావాలంటే మరోసారి వచ్చి ఇస్తానని చెప్పినట్లు తెలిసింది. కాగా ఇదేకేసులో గతంలో రానా దగ్గుబాటి, మంచులక్ష్మి, ప్రకాష్ రాజ్ సహాపలువురిని హైదరాబాద్, ముంబాయి ఈడీ విభాగాలు విచారించాయి.

## ఫిలిప్పీన్స్‌లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ
### మనిలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ
### ఉత్తమ వలస విధానాలపై చర్చలు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. ఆ తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పిన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పిన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పిన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్‌లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుధీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పిన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

### లైంగిక వేధింపుల కేసులో రేగా కాంతారావుకు ఊరట
## పోలీసు కేసును కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** లైంగిక వేధింపుల కేసులో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ రేగా కాంతారావు ఊరట లభించింది. పంజాగు ట్ట పోలీసు స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును హైకోర్టు బుధవారం కొట్టివేసింది. గత నెల 26వ తేదీన రేగా కాంతారావు పై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో బిఎన్ఎస్ 69, 351 (2) సెక్షన్ కింద కేసు నమోదవడం తెలిసిందే. రియల్ ఎస్టేట్‌తో పాటు యూ ట్యూబ్ ఛానల్‌లో అవకాశాల పేరిట తనను రేగా కాంతారావు చాలా ఏళ్లుగా లైంగికంగా వేధించినట్లు సదరు మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదయ్యింది. దీని తరువాత రేగా కాంతారావు హైకోర్టులో రెండు పిటిషన్ దాఖలు చేశారు. మొదటి పిటిషన్‌లో ముందస్తు బెయిల్ కోరగా రెండవ పిటిషన్‌లో మొత్తం కేసును కొట్టి వేయాలని కోరారు. దీని తరువాత ఆయన పోలీసులకు అందుబాటులో లేకుండా పోయారు. రేగా కా ంతారావును విచారించేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే సమయంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ రెండుసార్లు వాయిదా పడి చివ రగా బుధవారం నాడు ముగిసింది. కాంతారావు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హై కోర్టు ఆయనపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా దీనిపై పోలీసులు స్పందించలేదు.

# ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హంతకులు విద్యార్థులే

### 'బాబు' అనే మాటతో హత్య కేసు మిస్టరీని ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులు
### రూ.1.54లక్షల నగదు, కత్తి, ఐఫోన్, సెల్‌ఫోన్లు స్వాధీనం: జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్




**నల్గొండటౌన్ ఆగస్టు 19, ప్రభాతవార్త:** కొండమల్లేపల్లి పరిధిలో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సవాలుగా తీసుకుని వెంటనే దేవరకొండ డియస్పీ ఆధ్వర్యంలో 5ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నేరస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధునిక దర్యాప్తు పద్ధతులను ఉపయోగిస్తూ అన్ని కోణాల్లో విచారణ కొనసాగించాలని ప్రత్యేక బృందాలకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హత్య జరిగిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల పరిధిని 360 డిగ్రీల కోణంలో పరిశీలిస్తూ, సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను ప్రతిరోజూ రాత్రి పగలు కష్టపడి విశ్లేషించారు. టెక్నికల్ అనాలసిస్, ఇన్ఫర్మేషన్ టీమ్స్‌తో కలిపి మొత్తం 5 ప్రత్యేక బృందాల్లో సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి 80 మందికి పైగా అనుమానితులను విచారించారు.

**కేసును మలుపు తిప్పిన ఒకే ఒక్క పదం:** హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో చివరిగా బాబు అని పలికారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో, 'ఆమె చివరిగా బాబు అని ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు?' అనే ప్రశ్న పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. ఈ కోణంలో విచారణ చేపట్టగా, రూపారెడ్డి తన పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా బాబు అని పిలిచేవారని పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో దర్యాప్తు పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది. ప్రిన్సిపాల్ మరణానికి సంతాప సూచకంగా పాఠశాలకు వరుసగా 6 రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను విచారించడంలో కొంత ఆలస్యం జరిగింది. పాఠశాల పునఃప్రారంభమైన అనంతరం పోలీసులు విద్యార్థులను ఒక్కొక్కరిని సున్నితంగా విచారిస్తూ దర్యాప్తును కొనసాగించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో అయిదుగురు విద్యార్థులు కొత్తగా జల్సాలకు అలవాటైన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. నేరస్థలంలో లభించిన సిసిటివి ఫుటేజ్ లు అనుమానిత విద్యార్థులతో సరిపోలడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించి నేరానికి పాల్పడినది సదరు విద్యార్థులే అని నిర్ధారించుకొని నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 11:30 గంటల సమయంలో పెండ్లిపాకల 'శ్రీ' రోడ్డు నుండి మల్లేపల్లి వస్తుండగా దొనియాల శ్రీరోడ్ వద్ద బైక్‌పై వస్తున్న పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని సున్నితంగా విచారించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో నగదు దాచుకున్నట్లు గుర్తించారు. అందులో సుమారు రూ.1.54 లక్షల నగదు, అలాగే స్వాధీన పరుచుకున్న మూడు 500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విచారించగా, ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్లు వెల్లడించారు. నిందితులు ఇద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ పాఠశాల నందు 10 తరగతి చదువుతూ హాస్టల్‌లో ఒకే గదిలో ఉంటున్నారు. చెడు వ్యసనాలకు అలవాటుపడి హాస్టల్ గదులలో వారి తల్లి తండ్రులకు తెలియకుండ సెల్ ఫోన్ లు వినియోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో డబ్బులు తేలికగా ఏలా సంపాదించాలి అని వెతుకేవారు. గతనెలలో వీరిద్దరు హాస్టల్‌లో డబ్బులతో ప్రిన్సిపాల్‌కు దొరకగా తల్లి తండ్రుల సమక్షంలో మందలించారు. ఇట్టి విషయాన్ని మనసులో పెట్టుకొని ప్రిన్సిపాల్‌పై కక్ష పెంచుకొని రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని భావించి సోషల్ మీడియాలో ఆదారాలు దొరకకుండా హత్యపై అన్వేషణ చేసి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పథకంలో భాగంగా వీరిద్దరు గత వారం రోజులనుండి ప్రిన్సిపాల్ రూపారెడ్డిని అంతమొందించాలని సాంకేతికంగా దొరకకుండా రెక్కి నిర్వహించి వారి ప్రణాళికలో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి, బ్యాగులో నుంచి ఎరుపు రంగు హుడీ టీషర్ట్, ప్యాంట్ తీసుకుని వచ్చారు. అనంతరం కొండమల్లేపల్లిలో ఇద్దరు కలిసి కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని, ఎవరైనా వస్తున్నారా అని ఒకరు గమనిస్తుండగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించారు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేశారు. కొంత దూరంలో బట్టలు మార్చుకుని, ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడించారు. పోలీసులు నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసును ఛేదిం చడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ నవీన్ కుమార్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ రమేష్, చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నరసిం హులు, గుర్రంపొడు ఎస్ఐ వెంకన్న, సిసిఎస్ ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరుణాకర్, విష్ణువర్ధనగిరి, వహీద్ పాషా, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, ప్రసాద్ రావు, ఫయాజ్, ప్రభాకర్, కానిస్టేబుళ్లు హేము నాయక్, గులాం దస్తగిరి, సాయికుమార్, శివరాజ్, జునైద్ అహ్మద్, నరేష్, సాయి, కమల్ కిషోర్, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్, శరన్ రెడ్డి, నాగరాజు, అనిల్, హెచ్‌జీ శేఖర్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. కేసులో ప్రతి చిన్న ఆధారాన్ని కూడా శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందాల కృషి అభినందనీయమని తెలిపారు.

# ఒకే ఇంటి చిరునామాపై 44 ఓట్లు
### ముసాయిదాలో సైతం అవకతవకలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎస్ఐఆర్ కార్యక్రమం తరువాత బంజారాహిల్స్‌లో ఒకే ఇంటి నంబరుతో దాదాపు 44 ఓట్లు నమోదవ్వడం ఇప్పుడు వివాదస్పదమైంది. ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ రోడ్ నంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఒక ఇంటి పైభాగంలో ఒక స్వచ్ఛంద సంస్థకు చెందిన కార్యాలయం ఉంది. కాగా ఎస్ఐఆర్‌కు ముందు ఈ ఇంటి చిరునామాపై దాదాపు 19 ఓట్లు ఉండగా, తాజాగా ఎస్ఐఆర్ అనంతరం ఓట్ల సంక్య ఇదే ఇంటి చిరునామాపై 44కు చేరింది. ఇదే విషయాన్ని స్థానికంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఎలాంటి పరిశీలన లేకుండా ముసాయిదాలో 44 ఓట్లు రావడంతో రాజకీయ పార్టీలు సైతం కంగుతిన్నాయి. ఈ విషయంపై తాము ఆందోళన చేయడానికి సిద్దంగా ఉన్నట్లు బీఆర్ఎస్ నేత జేజోళ్ల రాజు స్పష్టం చేశారు. మరోవైపు ఇదే అంశంపై బీఆర్ఎస్



ఒకే ఇంటి నంబరుతో ఉన్న ముసాయిదా ఓటరు లిస్టు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ సైతం స్పందించారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీవ్ర నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను ప్రహసనంగా మార్చారని విమర్శించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 237లో ఒకే ప్రైవేట్ వాణిజ్య కార్యాలయ చిరునామాపై 44 ఓట్లు నమోదైనట్లు ఆయన తెలిపారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఓ వాణిజ్య భవనంలో కాల్‌సెంటర్, ఇతర ప్రైవేట్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారని, అక్కడ నివాసం లేకపోయినా ఓటర్ల నమోదులు జరిగినట్లు తెలిపారు. ప్రత్యేక సవరణకు ముందు అదే చిరునామాపై 19 అనుమానాస్పద ఓట్లు ఉన్నట్లు బీఆర్ఎస్ బూత్ స్థాయి ప్రతినిధులు గుర్తించారన్నారు. సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, బూత్ స్థాయి అధికారి భవనాన్ని పరిశీలించి ఆ ఓట్లను తొలగించాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. పైగా కొత్త ఓటర్ల జాబితాలో అదే చిరునా మాపై 44 ఓట్లు నమోదయ్యాయని చెప్పారు. ఇది సాధారణ సాంకేతిక తప్పిదం కాదని, వ్యవస్థాగత అక్రమాలకు నిదర్శ నమని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అక్రమా లను ప్రశ్నించిన బీఆర్ఎస్ బూత్ స్థాయి ప్రతినిధులపై తప్పుడు పోలీసు కేసులు పెట్టారని, వాటిని వెనక్కి తీసుకో వాలన్నారు. తప్పిదాలకు కారణమైన అధికా రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం సైతం సీరియస్ అయ్యింది.

## మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా రాహుల్ రాజ్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** తెలంగాణ సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) మేనేజింగ్‌డైరెక్టర్‌గా పూర్తిఅదనపు బాధ్యలతో పిఎస్ రాహుల్ రాజ్ కొనసాగనున్నారు. ప్రస్తుతం సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ మరియు సహకార సంఘాల రిజిస్ట్రార్ అయిన రాహుల్ రాజ్ ను మార్కెటింగ్ డైరెక్టర్ పదవికి పూర్తి అదనపు బాధ్యత గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతీసుకుంది. ఇప్పటి వరకూ ఆ పదవిలో ఉన్న ఆర్.లక్ష్మణుడిని ఆ బాధ్యతలనుంచి రిలీవ్ చేసినట్లు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు విడుదల చేశారు. జగిత్యాల స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌జీడీసీ), అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఉన్న బి.రాజా గౌడ్‌ను నిజామాబాద్‌అదనపుకలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీచేసినట్లు సంజయ్‌జాజు తెలిపారు.

## పోలీసు శాఖలో పునర్ వ్యవస్థీకరణ
### గ్రే హౌండ్స్, ఎస్ఐబి, ఆక్టోపస్ విభాగాల నుంచి 513 సిబ్బందిని ఇతర విభాగాలకు కేటాయింపు
### సైబర్ నేరాలు, డ్రగ్స్‌ను తుదముట్టించేందుకు కఠినంగా ఉండాలి: డిజిపి సి.వి ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖను మారుతున్న పరిస్థితులతో పాటు ప్రజా భద్రతకు ఎదురవుతున్న సవాళ్లకు అను గుణంగా, నేరాల స్వభావం అనుసరించి పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు డిజిపి సి.వి ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రే హౌండ్స్, ఎస్ఐబి, ఆక్టోపస్ విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ట్రాఫిక్ విభాగంతో పాటు ఇతర విభాగాల్లో నియమించామని ఆయన తెలిపారు. సైబర్ నేరా లతో పాటు డ్రగ్స్‌ను సమూలంగా నాశనం చేసేందుకు, ఆహార కల్తీని నిరోధించేందుకు పోలీసులు మరింత అకుంటిత దీక్షతో పనిచేయాలని డిజిపి కోరారు. శివార్లలోని హిమాయత్‌సాగర్‌లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో పోలీసు శాఖ పునర్ వ్యవస్థీకరణతోపాటు కొత్తగా బదిలీ అయి న సిబ్బందికి నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలో మావోయిస్టుల సమస్య ఎక్కువగా వుండేదని, ఇప్పుడు ఇది కనుమరుగయ్యిందని, ఉగ్రవాద సమస్య కూడా చాలా వరకు తగ్గిందని అన్నారు. అయితే ఇదే సమయంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారి, ఆహార కల్తీ, బెట్టింగ్ యాప్‌లు ప్రజలను పీల్చుకు తింటున్నాయని ఆయన తెలిపారు. దీంతో పాటు రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే పోలీసు శాఖను పునర్ వ్యవస్థీకరించామని ఆయన అన్నారు. ఇందులో భాగంగా గ్రే హౌండ్స్, ఎస్ఐబి, ఆక్టోపస్‌ల నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ చేశామని ఆయన తెలిపారు. ఈ మూడు విభాగాల్లో 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు వుండగా వీరి సంఖ్యను కుదించామని డిజిపి తెలిపారు. కాగా ఈ మూడు విభాగాల నుంచి 224 మంది ట్రాఫిక్, రహదారి భద్రతా విభాగానికి, ఆహార కల్తీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలకు 80 మంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, పౌర సరఫరాల విభాగానికి 28మంది, టి, స్పార్క్‌కు 27 మందిని కేటాయించామని, దీంతో పాటు ఎసిబి, సిఐడి, సైబర్ సెకూ ్యరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున బదిలీ చేశామని డిజిపి తెలిపారు. కొత్తగా చేరిన వారికి రెండు నెలల పాటు అటాచ్‌మెంట్ చేయించామని ఆయన అన్నారు. సర్కారు అనుమతితో అన్ని విభాగాల్లో కేటాయింపులు వుంటాయని ఆయన తెలిపారు. కొత్త విభాగాల్లో విధుల గురించి పో లీసు అకాడమిలో 11రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరా ల వరకు వస్తే గత ఏడాదిలో మొత్తం 1750 కోట్ల రూపాయలను రాష్ట్రం నుంచి నేరగాళ్లు కొల్లగొట్టారని ఆనంద్ తెలిపారు. దీని తరువాత రాష్ట్రంలో మరో ప్రధాన సమస్య రహదారి భద్రతగా ఆయన తెలిపారు. వీటిని నివారించాల్సిందేనని, ఇందుకోసం రహదారి భద్రతా బ్యూరోను నెలకొల్పుతు న్నట్లు డిజిపి తెలిపారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ నివారణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇదే సమయంలో కొత్తగా విధుల్లో చేరిన వారు మరింత క్రమశిక్షణతో అకుంటిత దీక్షతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గ్రే హౌండ్స్ డిజి అనిల్ కుమార్, సిఐడి చీఫ్ చారు సిన్హా, ఆర్గనైజేషన్స్ డిజి స్వాతి లక్రా నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమా ర్, టిజి సేఫ్ ఐజి అవినాష్ మొహంతి, ఐజిలు షా నవాజ్ ఖాసీం, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 22ఎ కుంభకోణంపై సిఐడి విచారణ ఎందుకు జరపరు?
### పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి
### 22ఎ బాధితుల రక్షణకు తెలంగాణ భవన్‌లో లీగల్ సెల్ ఏర్పాటు:బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు19:** 22ఎ పేరుతో ఇబ్బందులు పడుతున్న బాధితులెవరూ ఆందోళన చెందవద్దు.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో మేమందరం మీకు అన్ని వేళలా అండగా ఉంటాం. బాధితులకు అన్ని రకాలుగా ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో 10 మంది న్యాయవాదులతో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. మా లీగల్ సెల్ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తుంది. లీగల్ సెల్ సపోర్ట్‌తో పాటు ఎమ్మెల్యేలుగా మేము కూడా అధికారులతో, కలెక్టర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యే వరకు మీ వెంటే ఉంటాం అని భరోసా ఇచ్చారు. బుధవారం 22ఎ నిషేధిత భూముల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులతో తెలంగాణ భవన్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రా రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన బాధితుల ఆవేదనలను ఓపికగా విన్న హరీశ్ రావు వారికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసానిస్తూ ప్రభుత్వంపై మండిపడ్డారు.



ఎవ్వరూ భయపడి 20శాతం, 30శాతం కమీషన్లు ఇవ్వవద్దు. తక్కువ ధరలకు ఆస్తులు అమ్ముకోవద్దు, ఎంతటి పోరాటానికైనా సిద్ధపడి ప్రభుత్వం మెడలు వంచి మీ ఆస్తులను రక్షించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుం దన్నారు. హుడా, హెచ్ఎమ్‌డీఏ అప్రూవ్డ్ లేఅవుట్లలో, 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న ఇళ్లను కూడా ఇప్పుడు 22ఏ లో పెట్టారంటే.. దీని వెనుక ఎంత పెద్ద కమీషన్ల దందా నడుస్తోందో అర్థమవుతోంది. బుద్వేల్ గ్రామం సర్వే నంబర్ 282, 283, 284 లలోని 30 ఎకరాల భూమి కోసం సర్వే సెటిల్మెంట్ డైరెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే 22ఏ నుంచి క్లియర్ చేసి కోట్లాది రూపాయల దందా చేశారని ఆరోపించారు. శేరిలింగంపల్లి సర్వే నంబర్ 20/1, 21 లో ఎస్ఏఎస్ ఇన్ఫ్రా ప్రాపర్టీకి 30శాతం కమీషన్ తీసుకుని 22ఏ నుంచి క్లియర్ చేసి రిజిస్ట్రేషన్లు చేయించారు.. బిల్డర్ పని అయిపోయాక మళ్లీ 10 రోజుల క్రితం దాన్ని 22ఏ లోకి మార్చారు. సంగారెడ్డి సమీపంలో శిల్పా మోహన్ రెడ్డి భూమిని 22ఏ నుంచి తీసి రిజిస్ట్రేషన్లు చేశాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిసి మళ్లీ 22ఏ లో పెట్టించారు. వీరి ఇష్టారాజ్యంతో కొనుక్కున్న సామాన్యుల జీవితాలు ఏమవ్వాలి అని ప్రశ్నించారు. అమీన్‌పూర్ కేఎస్ఆర్ కాలనీలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ 500 ఇళ్లను 22ఏ లో పెట్టి కాలనీవాసులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏ లో పెట్టారని నాలుగు నెలల క్రితమే స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రికి చెప్పినా రేవంత్ రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు. అంటే ఇదంతా రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇద్దరూ కూడబలుక్కుని ఆడుతున్న వసూళ్ల నాటకమని స్పష్టంగా అర్థమవుతోందని దుయ్యబట్టారు. చిన్న చిన్న విషయాలకే సీఐడీ, విజిలెన్స్ విచారణలు వేసే రేవంత్ రెడ్డి.. లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్న ఈ 22ఏ కుంభకోణంపై సీఐడీ ఎంక్వైరీ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి ఈ దందాతో సంబంధం లేకపోతే, తక్షణమే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తాండూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎకరాల్లో కొని గజాల చొప్పున బకరాలకు అమ్ముతున్నారు అని రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరే కాంగ్రెస్ ప్రభుత్వ అసలు రంగును బయటపెట్టిందన్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రజలకు నిద్రలేని రాత్రులు మిగిల్చిన ఈ ప్రభుత్వం ఒక తుగ్లక్ ప్రభుత్వంలా మారిపోయిందన్నారు. ప్రజలను మీసేవలు, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పకుండా ప్రభుత్వం చేసిన తప్పును ప్రభుత్వమే సుమోటోగా స్వీకరించి ఆన్‌లైన్ నుంచి 22ఏ ఆంక్షలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అక్రమాలను కప్పిపుచ్చు కోవడానికే భూభారతి వెబ్‌సైట్‌ను డౌన్ చేసి, హైదరాబాద్ జిల్లా వివరాలు కనిపించకుండా మాయం చేశారని ఆరోపించారు.

## చిత్ర పరిశ్రమలో క్రమశిక్షణ, నిబంధనలు తప్పవు: స్పష్టం చేసిన ఫిల్మ్ ఫెడరేషన్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చిత్ర పరిశ్రమలో క్రమశిక్షణ, నిబంధనలను అమలు చేయడం తప్పనిసరి అని, వీటిని ఉల్లంఘించే చర్యలను ఏమాత్రం సహించేది లేదని ఫిల్మ్ ఫెడరేషన్ హెచ్చరించింది. తెలంగాణలోని చలనచిత్ర పరిశ్రమలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలోని ఫిల్మ్ ఫెడరేషన్ హైదరాబాద్‌లో బుధవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఈ భేటీలో కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వ్యవహారం, డ్యాన్సర్స్ యూనియన్ తీరుపై కౌన్సిల్ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుమలత వ్యవహార శైలిపై ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో జానీ మాస్టర్ పై గతంలో విధించిన సస్పెన్షన్ యథాతథంగా కొనసాగించాలని ఫెడరేషన్ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా, గతంలో ఆయన ఫెడరేషన్‌కు ఇచ్చిన రూ.3 లక్షల మొత్తాన్ని తిరిగి ఆయనకే వెనక్కి పంపుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు తప్ప మిగిలిన 24 శాఖల (క్రాఫ్ట్) సంఘాలకు ఫెడరేషన్ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలోని కార్మికుల హక్కుల పరిరక్షణ తో పాటు, నిబంధనలకు కట్టుబడి పనిచేసే యూనియన్లకే తమ సహకారం ఉంటుంది స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
**తాండూర్ మునిసిపాలిటీ కార్యాలయం, వికారాబాద్ జిల్లా**
ఆసక్తి వ్యక్తీకరణ
R.No.E1/EOI/02/2026 తేదీ: 19.08.2026
తాండూరు మరియు కొడంగల్ మునిసిపాలిటీలకు కాగ్నానది వనరుగా, నీటి సరఫరా పనరు అభివృద్ధి పథకం యొక్క పని కొరకు DPRల తయారీ నిమిత్తం అనుభవం గల కన్సల్టెంట్స్ (ఇటువంటి రకం పనులలో) నుండి సీల్డ్ కవర్‌లలో ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వానించబడుతోంది. అర్హత గల ఏజన్సీ తాండూర్ మునిసిపాలిటీ కమిషనర్ పేరిట, రూ.10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ దాఖలు చేయుటం ద్వారా RFP డాక్యుమెంట్‌కు దరఖాస్తు పెట్టుకోవచ్చు. షెడ్యూల్ జారీకి చివరి తేది: 22.08.2026 సమయం: మ.3.00గం. సీల్డ్ ఆసక్తి వ్యక్తీకరణ దాఖలుకు చివరి తేది: 22.08.2026 సమయం సా.4.00గం. షరతులు: 1. కన్సల్టెంట్ ఏ రాష్ట్రంలో అయినా ఏ విభాగంలో అయినా జాబితాలో చేర్చబడి ఉండవలెను. 2. తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ ULB లో రూ.100.00 కోట్ల ప్రాజెక్ట్‌కు తక్కువ కాకుండా పని చేసి వుండవలెను. 3. ఆ సంస్థకు గత అయిదు సంవత్సరాలలో సగటున (ఏదైనా) రూ.1.00 కోట్లు యొక్క ఆర్థిక టర్నోవర్ కలిగి వుండవలెను. 4. ఈ తరహా స్వభావం యొక్క పనులలో అనుభవం గల కన్సల్టెంట్‌లు మాత్రమే పరిగణింపబడతారు. 5. పై షరతులు నెరవేర్చగల/సమ్మతించగల సంస్థ మాత్రమే దరఖాస్తు చేయాలి. 6. తాండూర్ మునిసిపాలిటీ మునిసిపల్ కమిషనర్ గార్కి సీల్డ్ EOIను అంగీకరించే లేదా తిరస్కరించే అన్ని అధికారాలు ఉన్నాయి. మరి ఏ ఇతర వివరాలకైనా తాండూర్ మునిసిపాలిటీ ఇంజనీరింగ్ సెక్షన్‌ను పని వేళలలో సంప్రదించవచ్చును. సంప్రదించవలసిన మొబైల్ నం: మునిసిపల్ కమిషనర్ (9849905909).
సం/-. కమిషనర్, తాండూర్ మునిసిపాలిటీ.
DIPR.NO.8289-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 19.08.2026

వార్త


ఒక దేశం కీర్తి ప్రతిష్ఠలు ప్రధానంగా ఆ దేశ రచయితలపై ఆధారపడి ఉంటాయి.

- శామ్యూల్ జాన్సన్

# న్యాయప్రక్రియ నత్తనడక!

న్యాయవ్యవస్థలో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండటం ఏవర్గానికీ సంతృప్తికరంగా లేదు. తాజాగా సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో దేశం మొత్తం మీద 5.74 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. ఇది నిజంగా ఆందోళనకరమే. సాధారణ పౌరులు అనుకోకుండా వ్యాజ్యాల్లో చిక్కుకోవడం, తమకు సంబంధం లేని కేసుల్లో ఇరుక్కోవడం కోర్టులనాశ్రయించడంలో తమ జీవితాలనే పణంగా పెట్టిన సందర్భాలు కోకొల్లలు. ఒక్క నేరస్థుడు తప్పించుకున్నా పర్వాలేదు కానీ ఒక నిరపరాధి శిక్షించబడకూడదనే ఏకైక న్యాయ సిద్ధాంతం మీద న్యాయవ్యవస్థలో వివిధ క్రిమినల్ కేసులు సాగుతుంటాయి. ఈ కోవకు చెందకపోయినా ప్రధానంగా చూస్తే ప్రజాప్రతినిధులపై ఉన్నకేసుల విచారణ వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతను సుప్రీంకోర్టు పదేపదే నొక్కి చెబుతోంది. ఎవరేం చేసినా,ఎవరెన్ని చెబుతున్నా సాధారణ కేసులుకానీ, ప్రజాప్రతినిధులపై ఉన్న అవినీతి వగైరా కేసులు కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన చతికిలపడిపోతున్నా యి. ఇలాంటి కేసుల్లో నష్టపోయేది ఎవరంటే ఎంతో నిజాయితీగా కోర్టులను ఆశ్రయిస్తున్న కక్షిదారులే.ఏంపాపం చేసుకున్నారని వాళ్లకీ శిక్ష. అందుకేనేమో 'ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడ'నే జనశ్రుతి ఉండనే ఉంది. దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 4192 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలో లోక్‌సభలో 543 మంది ఎంపీల్లో 251 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 533మంది రాజ్యసభ సభ్యుల్లో 75మంది క్రిమినల్ కేసులు నడుస్తున్నాయి. సాధారణంగా నిందితులు రాజ్యాంగ పదవుల్లో ఉన్నప్పుడు కేసుల అసాధారణ జాప్యం జరగడం పరిపాటి. కేసుల్లో ఇరుకున్న ప్రజాప్రతినిధులు వాయిదాలు కోరుతూ న్యాయప్రక్రియను ఎంత కాలం వీలైతే అంతకాలం పరిష్కారం కాకుండాన్యాయశాస్త్ర, చట్టంలోని లోపాలను ఆసరాగా తీసుకుని ఓపట్టాన తెమలనీయరు. అది సహజం. అలా వీళ్ల కేసులు సుదీర్ఘ కాలం న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉంటాయి.మరి సాధారణ ప్రజలపరిస్థితి ఆ దేముడికే తెలియాలి.'కోర్టువాయిదా'లనేవి వాళ్ల పాలిట శాపాలుగా మారతాయి. తాజాగా ప్రజాప్రతినిధుల కేసులో అపరిష్కృతంగా ఉన్న అంశంలో ఒకప్రజాప్రయోజన వ్యాజ్యంలో 'అమికస్‌క్యూరి'గా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లోని వివరాలు ఒక్కసారిగా ప్రక్రియలోని డొల్లతనాన్ని హెచ్చరిం చినట్లుగా అనిపించింది. ఆయన అఫిడవిట్‌లోని సారాంశ మేమిటంటే 'సుప్రీం కోర్టు ఎన్నిసార్లు ఆదేశాలిచ్చినా ప్రజాప్రతినిధులపై కేసులకు తార్కిక ముగింపు దొరకడంలేదు. అదంతా వ్యవస్థాగత లోపమేనంటున్నారాయన.నేరన్యాయ విచారణ ప్రక్రియలో ఉన్నలోపాన్ని ఎత్తిచూపారు. కేసులు అపరిష్కృతంగా వాయిదాలు వేసుకుంటూ ఏళ్ల తరబడి అటకమీదనే ఉంటున్నాయన్నది సమాజానికి తెలియనిదీ కాదు. దాని మీద ఎంత కసరత్తు జరిగినా సత్ఫలితాలు మాత్రం 'హుళక్కే'. ప్రజాప్రతినిధుల మీదఉన్న కేసులవాయిదాలు, సుదీర్ఘ వాయిదాలు, వంటి అంశాలను అర్థంచేసుకోవచ్చు. కానీ సాధారణ పౌరుల కేసుల పరిష్కారంలో 'సాగతీత' కక్షిదారులను ఎంత నిర్బలురను చేస్తుందో చెప్పనలవికాదు. ఒక వ్యక్తి అతి చిన్న వయసులో కోర్టుకు చేరిన పిత్రార్జిత ఆస్తుల విభజన కేసుల్ని చూస్తే ఆ వ్యక్తి పండు ముదుసలై పళ్లూడిపోయాక కానీ హాయిగా నవ్వుకు నేందుకు కూడా వీలుకాదు. ఒకసారి కోర్టు వ్యాజ్యంలో చిక్కుకుంటే ఇక న్యాయం కోరే కక్షిదారుని ముఖారవిందమే చూడబోము. వాయిదాల తీరుపై ఉన్న ధర్మాసనం నిర్దిష్ట ఆదేశాలుండి న్యాయవాదుల నుంచి సరైనసహకారం లభిస్తే తప్ప సాధారణ కక్షిదారుల న్యాయానికి తాత్కాలిక సంకెళ్లు వేసినట్లే. ప్రజాప్రతినిధుల్లో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ముఖ్యమంత్రులు కూడా కేసుల్లో ఉండటంకొంతఅసౌకర్యం కలుగుతున్నమాట వాస్తవమే అయినా మిగిలిన కేసుల సంగతి ఏమిటో ఆలోచన చేయాలి. న్యాయం ముందు అందరూ ఒక్కటేనని తరచు వినిపించే మాట. అది వాయిదాల న్యాయప్రక్రియలో మాత్రమే పనిచేస్తోంది. అలా అనిసుమోటో రిట్ పిటిషన్ల రోజువారీ అప్పటికప్పుడు అత్యవసరం పేరిట లంచ్‌మోషన్‌లో వచ్చేరాజకీయప్రాధాన్యమున్న కేసుల గురించి సమాచారాన్ని మరుసటి రోజు పేపర్లలో, చానళ్లలో పరకాయిస్తున్నప్పుడు మన కేసులు వాయిదాలకేనా?అని సాధారణ కక్షిదారుడు విచారించకుండాఉండడు. ఏ క్రిమినల్ కేసునైనా అభియోగాలు నమోదు చేసిన తేదీ నుండి ఏడాదిలోగా తీర్పు రావాలని నిర్దేశిత సమయంగా నిర్ణయిస్తే మంచిదనేసూచన 'అమికస్ క్యూరీ' అఫిడవిట్‌లో ప్రస్తావించారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నకేసులను హైకోర్టు నిరంతర పర్యవేక్షణలోకి తీసుకోవాలి. అలాగే ప్రజాప్రతినిధుల కేసుల విషయంలోనూ హైకోర్టుల పర్యవేక్షణ అవసరమేనని హైకోర్టుకు సూచనలున్నాయి. దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులను శాశ్వతంగా రాజకీయాల్లో పాల్గొనకుండా నిషేధించాలనికోరుతూ న్యాయవాది అశ్వినీ కుమార్ 2016లో దాఖలుచేసిన 'పిల్'లో 'అమికస్ క్యూరీ' విజయ్ హన్సారియా తన 22వ నివేదికను సమర్పించారు. ఏ కేసుకైనా నిర్దిష్ట విచారణ గడువును ఉన్నత ధర్మాసనం నిర్దేశిస్తే కోర్టుల్లో విచారణవేగవంతమయ్యే వీలుంది. దేశంలో 15 కోట్ల నుండి 20 కోట్ల మంది ప్రజలు నేరుగా కోర్టుకేసుల వలలో చిక్కుకుని న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు.వారి ఘోషఆలకించే విధంగా మరిన్ని సంస్కరణలు అవసరం.కేసు ఎలాంటిదైనా అత్యంత అరుదైన సందర్భాలు, లేదంటే తప్పనిసరి విధిలేని పరిస్థితుల్లో మాత్రమే 'వాయిదా'కు అర్హత పొందేటట్లు నిర్దేశించాలన్న సూచనలు లేకపోలేదు. ప్రజాప్రతిని ధుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది.

అతనికేమీ తెలియదు. అయినా అన్నీ తెలుసుననుకుంటాడు. అటువంటి వాళ్లు రాజకీయంగా రాణిస్తారు.



జార్జి బెర్నార్డ్ షా

పాలకులు సాధారణంగా ప్రజల వంటివారు కారు, పాలకుడు మంచివాడైతే ప్రజలు కూడా మంచివారుగా ఉంటారు.



చాణక్యుడు

## ప్రజావాక్కు



### పర్యావరణ రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది

పరిశ్రమల నుంచి వెలువడే పొగ,కొండల్లా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, భానుడి భగభగలు,అకాల వర్షాలు, ఎల్‌నినో ప్రభావం,భూగోళం ఎంతటి ప్రమాదకర పరిస్థితులలోకిజారిపోయిందో తెలియజేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గాలి,నీరు, భూమి, జీవజాతులను కాపాడుకోవలసినవసరముంది. ఇవిభూమిపై సమతుల్యతను కాపాడటానికి,ప్రకృతి వనరులను భవిష్యత్ తరాల కోసం నిల్వఉంచడానికి, కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగపడతాయి.వీటిని కాపాడుకోవాలంటే మొక్కలు నాటడం అడవులను కాపాడుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను వాడటం, నీటిని వృథా చేయకుండా ఆదా చేయడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనవనరులను ప్రోత్సహించడం, చెత్తను తగ్గించి, సక్రమంగా పారవేయడం,పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవడం వల్ల అంటువ్యాధులు సోకవు,స్వచ్ఛ ప్రాణవాయువు, చల్లదనమిచ్చే వర్షాలతో జీవరాశికి ముప్పుండదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ఆశకు అంతం లేదా?

ఆశకు అంతం లేదంటారు. దురాశ దుఃఖానికి చేటు అని చదువుకున్నాం. మానవుడి జీవితంలో కీలకపాత్ర పోషించే ఆశమితంగా ఉండాలంటారు. మనిషి ఉల్లాసంగా ఉండడానికి ఆశ కూడా ఒక కారణం అంటే అతిశయోక్తి కాదు. మంచికన్న మనీకే మక్కువ ఎక్కువ. తల్లిదండ్రుల బిడ్డల మీద ఆశ మరింత కష్టపడడానికి పునాది వేస్తుంది. ఆశ నిత్యనూతనం, అందమైన నిరీక్షణ, ప్రతి మనిషి జీవితంలో ఆశ నిరాశలమధ్య ఊగిసలాడే సందర్భాలనేకం. శ్రమ,పట్టుదలతో కోరికలను సొంతం చేసుకోవచ్చు.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఫెర్టిలైజర్ ఫర్ సేల్ యాప్ వాడాలి

రాష్ట్ర రైతులు వ్యవసాయానికి వాడుకునే ఎరువుల బస్తాలు ఇక నుండి ఫెర్టిలైజర్ ఫర్ సేల్ యాప్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలనిఅధికారులు సూచిస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఈ యాప్ ద్వారా బ్లాక్‌లో అమ్మకాలు,డీలర్ల మధ్య సమన్వయం, రైతులకు ఏరువు సమయంలో ఎరువులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అప్రమత్తత

కూరగాయలు తాజాగా, శుభ్రంగా కనిపిస్తే చాలు అని మనం వెంటనే కొనేస్తుంటాం. అయితే కొందరు వ్యాపారులు కూరగాయలు తాజాగా కనిపించేందుకు రసాయనాలతో కడుగుతున్న సందర్భాలు ఉన్నాయి. విషయం తెలియక వాటిని కొనుగోలు చేసి మనమే ఇంటికి తెచ్చుకుంటున్నాం. అందుకే కూరగాయలు కొనేటప్పుడు వాటిసహజమైన రంగు, తాజాదనాన్ని గమనించడం అవసరం. వ్యాపారులు కూడా కేవలం లాభాపేక్షతో కాకుండా ప్రజలఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన, సహజమైన కూరగాయలను అందించాలి. ప్రజలకు మంచి ఆహారం అందించడం ప్రతి వ్యాపారి సామాజిక బాధ్యతగా భావించాలి.మనం కూడా కూరగాయలను ఇంటికి తెచ్చిన తర్వాత శుభ్రమైన నీటితో బాగా కడిగి ఉపయోగించాలి. వ్యాపారులు బాధ్యతగా, ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యకరమైన ఆహారం ప్రతి కుటుంబానికి అందుతుంది. ఆరోగ్యమే మన నిజమైన సంపద.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అవయవదానంపై అవగాహన అవసరం

అవయవదానం గురించి సమాజంలో అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసిన అవయవాలతో గరిష్ఠంగా ఎనిమిది మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. కణజాల దానం కూడా పలువురికి కొత్త జీవితాన్ని అందించగలదు.అయినప్పటికీ అవయవదానంపై ఉన్న అపోహలు, అనవసర భయాలు, అపార్థాలు దాతలసంఖ్య పెరగడానికి అడ్డంకిగామారుతున్నాయి. మూత్రపిండాలు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, పేగులు, ఎముకలు, ఎముక మజ్జ, చర్మం, కళ్ల కార్నియా వంటి అవయవాలు, కణజాలాలను అవసరమైన వారికి మార్పిడి చేయడం ద్వారా వారి జీవితాలను పొడిగించవచ్చు. జీవించి ఉన్న వ్యక్తి కూడా వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా ఒక మూత్రపిండం లేదా కాలేయం, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, పేగుల్లో కొంత భాగాన్ని దానం చేయగలడు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పలుకుబడితో దౌర్జన్యాలు

స్థానిక ప్రజా ప్రతినిధులు సర్పంచ్ కుటుంబ సభ్యులు వివిధ గొడవలతో దాడులు దౌర్జన్యాలు గ్రామాలలో అలజడులు సృష్టిస్తున్నారు. ప్రజాప్రతినిధులు పలుకుబడితో అధికారులను ఇబ్బంది పెడుతున్నారు. ఎక్కువగా గొడవలు చేస్తున్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, అభిప్రాయాలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మీ వ్యాసాలు ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలను పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరించాలని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# హాకర్ల జీవనోపాధిని దెబ్బతీస్తున్న జోన్లు

**పట్టణాల అభివృద్ధి, సుందరీకరణ, ట్రాఫిక్ నియంత్రణ అవసరమే కానీ ఆ అభివృద్ధి పేదల జీవనోపాధిని బలి తీసుకునే విధంగా ఉండకూడదు. పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించి, చిన్న వ్యాపారులను పట్టణాల నుంచి బయటకు నెట్టడం సమంజసం కాదు.వీధి వ్యాపారులు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. తక్కువ ధరలకు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో, స్వయం ఉపాధిని పెంపొందించడంలో, నిరుద్యోగాన్ని తగ్గిం చడంలో వారిపాత్ర విశేషమైనది. అందువల్ల వారిని సమస్యగా కాకుండా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా ప్రభు త్వం గుర్తించాలి.రుణాలు మంజూరు చేయాలి. జి.ఓ.ఎం. ఎస్. నెం.140లోని రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని పునఃసమీక్షించి రద్దు చేయాలి. టౌన్ వెండింగ్ కమిటీలను చట్టం ప్రకారం పునర్వ్యవస్థీకరించి, వీధి వ్యాపారుల నిజమైన ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించాలి.**

రాష్ట్రంలో 10 లక్షల మంది పైగా పట్టణాలు నగరాలు మండల కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాలలోనూ రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నారు. దాదాపు 50 లక్షల మంది కుటుంబ సభ్యులు ఇదే జీవనాధారంగా ఉన్నది. చిరు వ్యాపారులకు ఉపాధి కల్పనే కాకుండా సాధారణ ప్రజలకు చౌకగా కూరగాయలు,పళ్ళు ఇతర సరుకులు అందిస్తూ సమాజంలో ముఖ్యపాత్ర వహిస్తున్నారు. వీధుల్లో వ్యాపారాలు చేసుకునే వారిని రక్షణ కొరకు సుప్రీంకోర్టులు అనేక తీర్పులు ఇచ్చాయి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. నిబంధనలు రూపొందించాయి అవి కాగితాలికే మిగిలిపోయాయి. వీరికి రక్షణ కొరవడింది. వేధింపులు నిత్యకృత్యం అయ్యాయి. ఒకవైపున మున్సిపల్, మరొకవైపున పోలీసులు, వివిధ శాఖలు వీరితో బంతాట ఆడుకున్నట్లు జీవితాలతో ఆడుకుంటున్నారు. వీరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ దొంగల్లా చూస్తున్నారు. పట్టణాభివృద్ధి, సుందరీకరణ, రోడ్ల వెడల్పు, ప్రమాదాల నివారణ పేరుతో వీరిని అక్కడక్కడ తొలగిస్తున్నారు. ప్రత్యామ్నాయం లేకుండా చేస్తున్నారు. దీనితో వారి కుటుంబాలను బజారున పడేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీధి వ్యాపారుల సర్వే చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నోటీసులు లేకుండా తొలగించరాదు. రుణ సదుపాయం కల్పించాలి. మంచినీరు, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇవన్నీ గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వెండింగ్ జోన్లు ప్రవేశపెట్టి కొన్ని వీధుల్లో చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలి. అలా కాకుండా కూటమి ప్రభుత్వం (జి.ఓ.ఎం.ఎస్). నెం.140 ద్వారా రాష్ట్రంలోని 51పట్టణ, స్థానిక సంస్థల్లో స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌లకు ఆమోదం తెలపడం పట్టణాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, పరిశుభ్రత, వీధి వ్యాపారుల జీవనోపాధి వంటి కీలక అంశాలపై మరోసారి చర్చకు దారి తీసింది. పట్టణాలను క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, పాదచారులకు సురక్షితమైన మార్గాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే అదే సమయంలో లక్షలాది మంది వీధి వ్యాపారుల జీవనోపాధిని రక్షించడం కూడా రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన ప్రభుత్వ బాధ్యత. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగులు, స్వయం ఉపాధిపై ఆధారపడిన కుటుంబాలకు వీధి వ్యాపారమే ప్రధాన జీవనాధారం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహిళలు, వికలాంగులు, వృద్ధులు, యువకులు, చిన్న వ్యాపారులు రోడ్లపైనే చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి జీవనోపాధిని దెబ్బతీసే విధానాలు సామాజిక న్యాయానికి విరుద్ధం. స్ట్రీట్ వెండర్స్ (జీవనోపాధి రక్షణ, వీధి వ్యాపార నియంత్రణ) చట్టం-2014ను కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులను రక్షించడానికి తీసుకొచ్చింది. ఈ చట్టం ఉద్దేశం హాకర్లను పట్టణాల నుంచి తొలగించడం కాదు. వీధి వ్యాపారులను గుర్తించి, సర్వే నిర్వహించి, గుర్తింపుకార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేసి, పట్టణ ప్రణాళికలో భాగస్వాములుగా గుర్తించడమే ఈచట్టం ప్రధాన లక్ష్యం. అందువల్ల స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌ల అమలుకూడా అదే స్ఫూర్తితో జరగాలి. ప్రభుత్వం గుర్తించిన వెండింగ్ జోన్లలో మాత్రమే వ్యాపారం చేయాలని నిర్ణయించడం పరిపాలనా పరంగా సమంజసంగా కనిపించినా, ఆ జోన్లు నిజంగా జీవనోపాధిని కొనసాగించడానికి అనుకూలంగా ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ప్రజల రాకపోకలు లేని ప్రాంతాలకు వ్యాపారులను తరలిస్తే వారి ఆదాయం పూర్తిగా దెబ్బతింటుంది. ఇదిచట్టం కల్పించిన జీవనోపాధి హక్కును నిర్వీర్యం చేయడమే.స్ట్రీట్ వెండర్స్ చట్టం



ప్రకారం -(2014) టౌన్ వెండింగ్ కమిటీ మొత్తం ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి. ప్రతి పట్టణంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి వీధి వ్యాపారికి గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలి.టౌన్ వెండింగ్ కమిటీల్లో నిజమైన వీధి వ్యాపారుల ప్రతి నిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. కానీ అనేక పట్టణాల్లో ఈ ప్రక్రియను పక్కనబెట్టి, సర్వేలు పూర్తిచేయకుండా, గుర్తింపుకార్డులు ఇవ్వకుండా, నేరుగా తొలగింపులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది స్ట్రీట్ వెండర్స్ చట్టానికి విరుద్ధం మాత్రమే కాకుండా, సుప్రీంకోరు, వివిధ హైకోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు కూడా వ్యతిరేకం. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర పట్టణాల్లో కూడా రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ విధానం వీధి వ్యాపారుల హక్కులను తీవ్రంగా పరిమితం చేసే ప్రమాదం ఉంది. రెడ్ జోన్ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలకు పూర్తిగా నిషేధం విధిస్తున్నారు. విజయవాడ నగరంలో 418ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులను రెడ్ జోన్లుగా ప్రకటించారు. బందర్ రోడ్, మహాత్మా గాంధీరోడ్, సిద్ధార్థ కళాశాల రోడ్, వన్‌టౌన్, గాంధీనగర్, సింగ్‌నగర్, బీఆర్‌టీఎస్ రోడ్, రైల్వే స్టేషన్ పరిసరాలు, కాళేశ్వరరావు మార్కెట్, లెనిన్ సెంటర్ వంటి ప్రాంతాలు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా జీవనోపాధి సాగిస్తున్న వేలాది మంది హాకర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీనితో వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. అంబర్ జోన్ ప్రాంతాల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే వ్యాపారులకు అనుమతి ఉంటుంది. నిర్ణీత సమయాల్లో లేదా కొన్ని రోజులలో మాత్రమే వ్యాపారం చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల రోజువారీ ఆదాయంపై ఆధారపడే చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారు. ఒక రోజు వ్యాపారం లేకపోయినాకుటుంబ పోషణ కష్టమయ్యే పరిస్థితుల్లో ఈ విధానం అన్యాయంగా మారుతుంది. వీధి వ్యాపారానికి అనుమతి ఉన్న ప్రాంతా లను గ్రీన్ జోన్లుగా పేర్కొంటున్నారు. అయితే చాలా గ్రీన్ జోన్లు జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్నాయి. వినియోగదారులు లేని ప్రాంతాల్లో వ్యాపారం చేస్తే ఆదాయం ఎలా వస్తుంది? వారి కుటుంబాలు ఎలా బ్రతు కుతాయి అనేది ప్రశ్న. వ్యాపారం జరిగే ప్రాంతాలే హాకర్ల జీవనాధారం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో గ్రీన్ జోన్ పేరుతో వ్యాపారులను ఖాళీ ప్రదేశాలకు తరలించడం అంటే వారి జీవనోపాధిని హరించడమే. విజయవాడలో బీసెంట్ రోడ్ గ్రీన్ జోన్ పరిధిలోనే ఉన్నప్పటికీ, అక్కడ గుర్తింపు కార్డులు కలిగిన హాకర్లను కూడా తరచూ తొలగిస్తున్నారు. ఇది ప్రభుత్వం ప్రకటించిన విధానానికే విరుద్ధంగా ఉంది. చట్టబద్ధమైన గుర్తింపు కార్డులున్నప్పటికీ హాకర్లను వేధించడం ఆందోళనకరమైన విషయం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జి) ప్రకారం ప్రతి పౌరుడికి తనకు నచ్చిన వృత్తి లేదా వ్యాపారం చేసే హక్కు ఉంది. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో జీవనోపాధి కూడా అంతర్భాగమేనని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసింది. అందువల్ల వీధి వ్యాపారులను ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించకుండా, పునరావాసం ఇవ్వకుండా బలవంతంగా తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కావున ప్రభుత్వాలు కూడా వ్యాపార ప్రదేశాలలో మౌలిక సదుపాయలు, రక్షణ కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణాల అభివృద్ధి, సుందరీకరణ, ట్రాఫిక్ నియంత్రణ అవసరమే కానీ ఆ అభివృద్ధి పేదల జీవనోపాధిని బలి తీసుకునే విధంగా ఉండకూడదు. పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించి, చిన్న వ్యాపారులను పట్టణాల నుంచి బయటకు నెట్టడం సమంజసం కాదు.వీధి వ్యాపారులు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. తక్కువ ధరలకు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో, స్వయం ఉపాధిని పెంపొందించడంలో, నిరుద్యోగాన్ని తగ్గించడంలో వారిపాత్ర విశేషమైనది. అందువల్ల వారినిసమస్యగా కాకుండా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా ప్రభుత్వం గుర్తించాలి.రుణాలు మంజూరు చేయాలి. జి.ఓ.ఎం.ఎస్. నెం.140లోని రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల విధానాన్ని పునఃసమీక్షించి రద్దు చేయాలి. టౌన్ వెండింగ్ కమిటీలను చట్టం ప్రకారం పునర్వ్యవస్థీకరించి, వీధి వ్యాపారుల నిజమైన ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించాలి. ●

# 'ఆర్గానిక్ సాగు'తో ఆరోగ్య విప్లవం రావాలి

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

గతంలో ఆకలితో అలమటించిన భారతదేశం హరిత విప్లవంతో ఆహార స్వయం సమృద్ధిని సాధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. కానీ, ఆనాడు సాధించిన విజయం నేడు ఒక ప్రాణాంతక సంక్షోభానికి దారితీస్తుందని ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు 'ఆహారమే ఔషధం' అని గర్వంగా చెప్పుకున్న మన నేలపై, నేడు 'ఆహారమే విషం' అనే చేదు నిజం ప్రతి పల్లాన్నీ భయపెడుతోంది. పొలాల్లో దిగుబడి పెంచాలనే ఆరాటం, మార్కెట్‌లోపంట మెరిసిపోవాలనే కక్కుర్తి కలగలసి మన నిత్య జీవితాన్ని ఒక విషవలయంలోకి నెట్టేశాయి. పంట పరిమాణం (రాశి) కంటే నాణ్యత (వాసి) ముఖ్యమనే పరమసత్యాన్ని మరచిపోయిన పరిణామమిది. కేంద్ర వ్యవసాయ శాఖలోక్‌సభలో సమర్పించిన అధికారిక వివరాలు ఈ విష సంస్కృతి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. జాతీయ స్థాయిలో పురుగు మందుల అవశేషాల పర్యవేక్షణ ప్రాజెక్ట్ కింద దేశవ్యాప్తంగా పరీక్షించిన 70,652 పండ్లు, కూరగాయల శాంపిళ్లలో ఏకంగా 2,223 సాంపిళ్లు ఆహార భద్రత ప్రమాణాలసంస్థ నిర్ణయించిన సురక్షిత పరిమితులను మించి ప్రమాదకర రసాయనాలను కలిగి ఉన్నాయని తేలింది.జాతీయ స్థాయిలో ఉల్లంఘనల సగటు 3.1శాతంగా ఉంటే, మనతెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దిగ్భ్రాంతికరంగా ఉంది. తెలంగాణలో పరీక్షించిన 8,198 శాంపిళ్లలో 486(5.9శాతం) శాంపిళ్లు కల్తీగా తేలి దేశంలోనే అత్యధిక సంఖ్యను నమోదు చేయగా, ఆంధ్రప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో అత్యధికంగా 6.4శాతం శాంపిళ్లు విష రసాయనాల మయమయ్యాయి. కర్ణాటకలో 3.6శాతం, మహారాష్ట్రలో4.9శాతం మేర ప్రమాదకర అవశేషాలు ఉండగా, తెలంగాణలో హెక్టారుకు వాడే క్రిమిసంహారకాల మోతాదు (0.530 కేజీ) జాతీయ సగటు (0.277 కేజీ) కంటే దాదాపు రెట్టింపు కావడం మనల్ని నివ్వెరపరుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా



అనేక దేశాల్లో నిషేధించిన మోనోక్రోటోఫాస్, క్లోర్‌పైరిఫాస్, కార్బోఫ్యూరాన్ వంటి నిషిద్ధ రసాయనాలు నేటికీ మన పొలాల్లో యథేచ్ఛగా చిలకరించబడుతున్నాయి. ఈ రసాయన విషం ప్రతిరోజూ మన శరీరంలోకి చేరి నిశ్శబ్దంగా మన ఆరోగ్య వ్యవస్థను ధ్వంసం చేస్తోంది. జ్ఞాపకశక్తి మందగించడం, తీవ్రమైన నాడీ సంబంధిత రుగ్మతలు, హార్మోన్ల అసమతుల్యత, సంతానలేమి వంటి సమస్యలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రాణపదంగా చూసుకునే చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల అటకెక్కుతోంది. కాలేయం, మూత్రపిండాల వైఫల్యంతో పాటు క్యాన్సర్ వంటి మహమ్మారులు ప్రతి ఇంటా భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. పంట పండించే రైతు కుటుంబాలు, ముఖ్యంగా పొలాల్లో పనిచేసే మహిళలు, పిల్లలు ఈ విషప్రభావానికి మొదటి బాధితులుగా మారుతుండటం అత్యంత విచారకరం. ఈ ప్రాణాంతక పరిస్థితి నుంచి బయటపడాలంటే మన ఆలోచనా ధోరణి మారాలి. హరిత విప్లవం ఆకలి తీర్చింది నిజమే,కానీ ఇప్పుడు మనకు కావలసింది ఆరోగ్యకరమైన ఆహార విప్లవం. సమగ్ర సస్యరక్షణ, సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను యుద్ధప్రాతిపదికన ప్రోత్సహించాలి. భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా ఆర్గానిక్ రైతు కలిగిన దేశంగా ఉన్నప్పటికీ, రసాయన రహితసాగు వైపు రైతులు ధైర్యంగా అడుగులు వేయాలంటే ప్రభుత్వాల మద్దతు అనివార్యం. ప్రారంభంలో దిగుబడి తగ్గినా రైతు నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యేక కనీస మద్దతు ధర, ప్రీమియం ధరలు, పంట కొనుగోలు హామీని అందించాలి. కేవలం ఉపన్యాసాలు కాకుండా ఆర్థికప్రోత్సాహకాలు దక్కినప్పుడే రైతు సేంద్రీయ బాట పడతాడు. పొలం నుండి మన పళ్లెం వరకు ప్రతి స్థాయిలోనూ కఠిన పర్యవేక్షణ ఉండాలి. నిషేధిత రసాయనాలు అమ్మేవ్యాపారులపై నిర్దాక్షిణ్యమైన చర్యలు తీసుకోవాలి. ఎగుమతిఅయ్యేపంటలకు, దేశీయంగా మనం తినే ఆహారానికి ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలను వర్తింపజేయాలి. వినియోగదారులుగా మనం కూడా పండ్లు,కూరగాయలను ఉప్పు,పసుపు నీటితోశుభ్రం చేసుకోవడం, తొక్క తీసి వాడుకోవడం సేంద్రీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. ●

# ఆర్థిక రంగాన్ని వణికిస్తున్న 'ఎల్‌నినో' దడ

నందూరి రవిశంకర్

ఈ ఏడాది అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు అనూహ్య రీతిలో మారిపోతాయని, ఉష్ణోగ్రతలు భారీగా పెరగొచ్చని, రుతుపవనాలు అసాధారణంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా రుతుపవనాలపై ఏవిధంగా ఉంటుందనే దానిపై నిశితంగా పరిశీలిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో వాతావరణ వ్యవస్థ సాధారణ వర్షపాత విధానాన్ని తీవ్రంగా దెబ్బతీయనుంది. దీని ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో కరవును, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాలను తెచ్చే అవకాశం ఉందని నేషనల్ జియోగ్రాఫిక్ నివేదించింది. అందుకే దీన్ని 'సూపర్ ఎల్‌నినో'గా సైంటిస్టులు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలోని నీరు అసాధారణంగా వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. ఇది 2నుంచి 7సంవత్సరాలకు ఒకసారి కనిపించే ఊహించని వాతావరణ దృగ్విషయం. ఇది జరిగినప్పుడు వాతావరణంలో తేమ కదలికలను మార్చి, కొన్ని చోట్ల పొడి పరిస్థితులను, మరికొన్ని చోట్ల భారీ వర్షాలను కలిగిస్తుంది.గతంలో ఎల్‌నినో బలహీనమైన రుతుపవనాలు, కరవు, పంట నష్టాలు వంటి పరిస్థితులను కలిగించింది. గతంలో 1982-83, 1997-98, 2015-16లో ఇటువంటి భారీ మార్పులు సంభవించాయి. ఈ ఏడాది కొన్ని చోట్ల వర్షపాతం తగ్గడం, మరికొన్ని చోట్ల అధిక వర్షపాత ఘటనలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శీతాకాలం, వసంతకాలంలో జరిగే పరిణామాలు రుతుపవనాల సీజన్‌పై గరిష్ట ప్రభావాలు చూపుతాయనిఅమెరికా ఎన్ఓఎఎ వాతావరణ అంచనా కేంద్రం ఆపరేషనల్ ప్రిడిక్షన్ బ్రాంచ్ చీఫ్ జాన్ గోట్‌షాల్క్ తెలిపారు. ఈ ఏడాది జూన్,ఆగస్టు 2026 మధ్యలో ఎల్‌నినో మొదలై ఏడాది చివరివరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా కాలానుగుణ వర్షాలు పడే ప్రాంతాల్లో ఆహార భద్రత, కరవు, కారుచిచ్చు వంటి పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంది. మరోవైపు ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని చోట్ల బలమైన రుతుపవనాల కారణంగా అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత్‌లో సాధారణంగా ఎల్‌నినో సంవత్సరాల్లో తక్కువవర్షపాతం నమోదవుతుంది. భారత వాతావరణశాఖ ఇప్పటికే ఈఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈ క్రమంలో పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను జాగ్రత్తగా పరిశీలిస్తోంది. హిమాలయాల్లో తక్కువ మంచు కవరేజ్, అమెరికా నైరుతి ప్రాంతంలో పొడి శీతాకాలం వంటి కారకాలు ఎల్‌నినోఉన్నప్పటికీ రుతుపవనాలను బలపరిచే అవకాశం కూడా లేకపోలేదు. అయితే ఈసారి పసిఫిక్ వేడెక్కడం బేసిన్‌వైడ్‌గా కనిపిస్తుంది.భారత్, ఇండోనేషియా, పశ్చిమ ఆఫ్రికా రుతుపవన వ్యవస్థను ప్రభావం చూపే అవకాశం ఉందని గాట్‌షాల్క్ పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిపోవడంవల్ల భారత్‌లో కరవు సంభవించే అవకాశాలున్నాయి. అలాగే మధ్య ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌తోపాటు దక్షిణ పసిఫిక్, మధ్య అమెరికా, ఉత్తర బ్రెజిల్ వంటి ప్రాంతాల్లోనూ కరవు సంభవించే అవకాశాలున్నాయని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. 1876-78 మధ్య పసిఫిక్ మహాసముద్ర జలాల ఉష్ణోగ్రతలు 3.5డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. ఫలితంగా ఏర్పడిన సూపర్ ఎల్‌నినో కారణంగా ప్రపంచ దేశాల్లో కరవు విలయ తాండవం చేసింది. పంటలు పండకపోవడంతో తినడానికి తిండి లేక, తాగునీళ్లు అసలే లేక అప్పటి ప్రపంచ జనాభాలో 4శాతం మంది మృత్యువాతపడ్డారు. భారత్‌లో ఈ సంఖ్య 96లక్షలపైనే. భారత్‌లో ముఖ్యంగా దక్షిణాదిన బాంబే, మైసూరు, మద్రాస్, హైదరాబాద్ ప్రావిన్స్‌లలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు తలెత్తి పంటలు పండలేదు. దీంతో లక్షలాది మంది రైతులు,నేత కార్మికులు కూలిపనుల కోసం ఉత్తరాదికి వలస వెళ్లారు. దక్షిణాదిలో జనాభా తగ్గడానికి ఈ కరవు కూడా ఒక కారణమైందని అంటారు. భారత్‌లో తలెత్తిన ఈ కరవును గ్రేట్ ఫెమైన్ (మహా కరవు) లేదా మద్రాస్ ఫెమైన్ (మద్రాస్ కరవు)గా పిలుస్తారు. ఈ కరవు కారణంగా చైనా, బ్రెజిల్, ఆఫ్రికా దేశాలపైనా తీవ్ర ప్రభావం పడింది. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. ఇప్పటికీ ఆఫ్రికా దేశాలపై ఈ కరవు ప్రభావం ఉన్నదని నిపుణులు చెప్తారు. భారత్ వంటి ఆసియా దేశాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతుంది. ఫలితంగా కరవు పరిస్థితులు రావొచ్చు. మరికొన్ని తీరప్రాంత దేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఎండలు మండిపోతాయి. అలాగే ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నమోదు చేస్తాయి. ఇక పసిఫిక్, హవాయి, పశ్చిమాసియా దేశాల్లో తుఫాన్లు తీవ్రమవుతాయి. అట్లాంటిక్ మహాసముద్రంలో తుఫాన్ల ఉధృతి తగ్గుతుంది. భూమిపైనే అత్యంత వేడి దేశంగా భారత్ రికార్డులకెక్కింది.ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత వేడినగరాల జాబితాలోఉన్న 100నగరాలు భారత్‌కు చెందినవే కావడం గమనార్హం.ఇలాంటి సమయంలో నైరుతి రుతుపవనాలు ఐదు రోజుల ముందుగానే కేరళను చేరుతాయన్న ఐఎండీ అంచనాలు రైతులకు కాస్తఊరటనిచ్చాయి. సూపర్ ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు అంతకంతకూ పెరుగుతుండటం అన్నదాతలకు కొత్త భయాలను తీసుకొస్తున్నది. ఖరీఫ్‌లోనే దేశంలో 6570శాతం వరకూ ధాన్యం దిగుబడివచ్చే అవకాశం ఉన్నది. సూపర్‌ఎల్‌నినో కారణంగా ఈసారి ఖరీఫ్‌లో సరైన వర్షాలు పడకపోవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సరైనవానలు లేకధాన్యం దిగుబడి గణనీయంగా పడిపోయి దేశంలో ఆహారసంక్షోభం కూడా తలెత్తే ప్రమాదం ఉన్నదని మరికొందరు అంచనావేస్తున్నారు.దిగుబడి రాకపోవడంతో గ్రామీణప్రాంతాల్లోని ప్రజలు ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదంఉన్నదని చెప్తున్నారు. ఇప్పటికే యుద్ధాలతో పతనమైన ప్రపంచదేశాల ఆర్థికవ్యవస్థలపై సూపర్‌ఎల్‌నినో దెబ్బ మరింత గట్టిగా పడనున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ●

# 4 రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్



## చెన్నైని హౌరాతో కలిపే 410 కి.మీ. రైలు మార్గం

## ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9,450 కోట్లు

## ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో 3, 4 రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం

## బీహార్‌లో రూ.3,590 కోట్ల ఎన్‌హెచ్ ప్రాజెక్టుకు ఓకే

## కేబినెట్ వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** రైలు సామర్థ్యాన్ని విస్తరించడం, రహదారి అనుసంధానాన్ని మెరుగు పరచడం లక్ష్యంగా, ఐదు రాష్ట్రాల్లో రూ.13,041 కోట్లకు పైగా విలువైన రైల్వే, రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. చెన్నైని హౌరాతో కలిపే రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులతో పాటు, బీహార్‌లోని జాతీయ రహదారి-22లోని ముజఫర్‌పూర్ - సీతామర్హి - సోన్‌బర్సా విభాగాన్ని రూ.3,590.73 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులన్నింటికీ కలిపి సుమారు రూ.13,041 కోట్ల పెట్టుబడి అవసరమని కేంద్ర రైల్వే, ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. "దేశంలో సరుకు రవాణాకు డిమాండ్ యేటా కనీసం 10శాతం పెరుగుతోంది, దీనివల్ల ట్రక్కులు, రైళ్లు, ఓడలు, విమాన మార్గాలలో వృద్ధి చోటుచేసుకుంటుంద్ని అని వివరించారు.

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేసే ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులు, ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌కు సుమారు 410 కిలోమీటర్లు అదనంగా చేర్చనున్నాయి. ఇవి 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులలో ఖరగ్‌పూర్, భద్రక్ (రాణితల్) మధ్య 173 కిలోమీటర్ల నాలుగో లైన్, భద్రక్, హరిదాస్‌పూర్ మధ్య 75 కిలోమీటర్ల నాలుగో లైన్, గుమ్మిడిపూండి, గూడూరు మధ్య 90 కిలోమీటర్ల మూడో, నాలుగో లైన్లు ఉన్నాయి. నాలుగవ ప్రాజెక్టులో భాగంగా ఒడిశాలోని 72 కిలోమీటర్ల కటక్- పారాదీప్ (బడబంధ) మార్గంలో మూడవ, నాల్గవ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకారం, ఈ సామర్థ్య విస్తరణ వల్ల సంవత్సరానికి సుమారు 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా ఏర్పడుతుందని అంచనా. ఈ మార్గాలను బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్స్, కంటైనర్లు, ఆహార ధాన్యాల రవాణాకు ఉపయోగిస్తారు. క్యాబినెట్ ప్రకటన ప్రకారం, ఈ విస్తరణ వల్ల సుమారు 13 కోట్ల లీటర్ల చమురు వినియోగం, దాదాపు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని కూడా అంచనా.

**బీహార్‌కు రూ. 3,591 కోట్ల హైవే ప్రాజెక్ట్:** ఇదిలా ఉండగా, బీహార్‌లోని ఎన్‌హెచ్22లో 82.58 కిలోమీటర్ల ముజఫర్‌పూర్- సీతామర్హి- సోన్‌బర్సా విభాగాన్ని రూ. 3,590.73 కోట్ల మూలధన వ్యయంతో నాలుగు లేన్లుగా విస్తరించడానికి సిసిఇఎ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఎఎం) కింద అభివృద్ధి చేయబడుతుంది. తూర్పు- పశ్చిమ కారిడార్‌లో భాగమైన ఎన్‌హెచ్27కు అనుసంధానమైన సోన్‌బర్సా వద్ద ఉన్న భారత్- నేపాల్ సరిహద్దు, ముజఫర్‌పూర్ మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఈ ప్రాజెక్టులో బాగమతి నదిపై 340 మీటర్ల వంతెనతో సహా ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్‌లు ఉన్నాయి.



## ఎన్టీయేలో ప్రక్షాళన.. 600 మంది నిపుణులు తొలగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టారు. సుమారు 600 మంది సబ్జెక్ట్ నిపుణులను తొలగించారు. వీరి స్థానంలో బోర్డులోకి కొత్త నిపుణులను నియమిస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల ప్రకారం ఈ మార్పులు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్టీఏ రివ్యూ మీటింగ్‌లో మంత్రి జోషి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల తయారీలో నాలుగు అంచెల విధానాన్ని అమలు చేయనున్నట్లు ఎన్టీఏ డైరెక్టర్ మంత్రి జోషికి వివరించారు. భద్రతను పెంచి, లోపాలను తగ్గించనున్నట్లు తెలిపారు. రాబోయే మూడు వారాల్లోగా సుమారు 25 మంది అధికారులను ఎన్టీఏలోకి తీసుకోనున్నట్లు డైరెక్టర్ జనరల్ చెప్పారు. ఎన్టీఏ ఆఫీసులను కొత్త ప్రదేశాలకు మార్చనున్నారు. సీఐఎస్ఎఫ్ దళాలను మోహరించే రీతిలో ఆఫీసులను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల జరిగిన నీట్ యూజీ పేపర్ పరీక్ష లీక్, రద్దు ఘటనల నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్‌తో మంత్రి జోషి సమావేశం అయ్యారు. ప్రస్తుతం ఎన్టీఏ నుంచి 50 మంది సిబ్బందిని తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా 10 ప్రొఫెషనల్ లీడర్‌షిప్ పొజిషన్స్ ప్రకటించారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూర్టీ ఆఫీసర్, జనరల్ మేనేజర్ టెస్ట్ సెక్యూర్టీ, ఆర్ అండ్ డీ జనరల్ మేనర్ పోస్టులకు రిక్రూట్మెంట్ చేస్తున్నారు. సైబర్ సెక్యూర్టీ, సైకోమెట్రిక్స్, క్వశ్చన్ పేపర్ డిజైన్ అంశాలపై ఫోకస్ పెట్టినట్లు మంత్రికి చెప్పారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్‌కు సంబంధించిన వ్యవస్థను సమూలంగా మార్చాలని మంత్రి ఆదేశించారు.




## నీట్ నిర్వహణలో సమగ్ర సంస్కరణలు అవసరం

### విచారణ ప్రారంభించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టిఎలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీం కోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టిఎలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఎను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఎలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.



## జమ్ముకాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం

### అమెరికా రాయబారి సెర్గియోగోర్

**శ్రీనగర్, ఆగస్టు 19:** జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతోసంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూ కశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికారాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

## బలూచిస్థాన్‌లో పాక్ దుశ్చర్యలపై జోక్యంచేసుకోవాలి

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు బలూచ్ అధ్యక్షుడి లేఖ



**క్వెట్టా, ఆగస్టు 19:** బలూచిస్థాన్లో పాకిస్థాన్ సైన్యం ఇటీవల జరిపిన వైమానిక దాడుల ఘటన తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ దాడుల్లో 30 మందికి పైగా పౌరులు మరణించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బలోచ్ అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారా చంద్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖ రాశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. పాకిస్థాన్ దుశ్చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు ఆగస్టు 12వ తేదీ తెల్లవారుజామున సురబ్ జిల్లాలోని గిదర్ ప్రాంతంలో నివాస గృహాలపై పాకిస్థాన్ వైమానిక దళం విచక్షణారహితంగా బాంబుల వర్షం కురిపించిందని, ఈ ఘటనలో మహిళలు, చిన్నారులతో సహా అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, భారీగా ఆస్తి నష్టం జరిగిందని బలోచ్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తారా చంద్ రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ తీవ్రమైన ఆరోపణలపై మీ ప్రభుత్వం విచారణ జరపాలి. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన విమానాలు, ఆయుధాలు, డ్రోన్లు, టెక్నాలజీ లేదా ఇతర సైనిక పరికరాలు ఏమైనా ఉపయోగించారా అనే విషయాన్ని నిర్ధారించాలి. ఒకవేళ అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లభిస్తే, పాకిస్థాన్కు అందిస్తున్న సైనిక సహాయంపై సమీక్ష జరపాలి" అని ఆయన కోరారు. అంతే కాకుండా అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించిన ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తునకు అమెరికా మద్దతు ఇవ్వాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని తారా చంద్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు. "అధ్యక్షా ప్రపంచంలో ఏ చిన్నారి ప్రాణమైనా ఎంత విలువైందో, బలోచ్ చిన్నారి ప్రాణం కూడా అంతే విలువైంది. సాక్ష్యాలను ముందుగానే నిర్ధారించాలని మేము అమెరికాను కోరడం లేదు. వాస్తవాలను నిగ్గు తేల్చి, పౌరులను రక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే కోరుతున్నాం" అని పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ఆరోపణలను పాకిస్థాన్ మీడియా విభాగం ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్పీఆర్) గట్టిగా ఖండించింది. ఇది వైమానిక దాడి కాదని, ఓ ఉగ్రవాదసంస్థకు చెందినవాహనంలో అమర్చిన శక్తిమంత మైన బాంబు అనుకోకుండా పేలిపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని వివరణ ఇచ్చింది.

## పూర్వవైభవం కోసం తెరపైకి మళ్లీ పాతఫార్ములా

### బిఎస్‌పి అధినేత్రి వ్యూహాల్లో మార్పులు

**లక్నో, ఆగస్టు 19:** ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళితబ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్‌చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధిం చిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు. దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు.

## జార్ఖండ్‌లో నిరసనల ఆందోళన రెండునెలలు వాయిదా

### డిమాండ్లు పరిష్కరించనిపక్షంలో మరింత ఉధృతంచేస్తాం..

**రాంచి, ఆగస్టు 19:** జార్ఖండ్‌లో పరీక్షల వివాదం రాంచీ: టిడిపిఎల్‌కు సంబంధం ఉన్న 22 జెపిఎస్‌సి, జెఎస్ఎస్‌సి పరీక్షలను రద్దు చేస్తూ, మరో 23 పరీక్షలపై సిఐడీ దర్యాప్తునకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అర్ధరాత్రి నోటిఫికేషన్ జారీ చేసిన కొన్ని గంటల్లోనే పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న జెపిఎస్‌సి,జెఎస్ఎస్‌సి రిఫార్మ్ మంచ్ తమ నిరసనను రెండు నెలల పాటు వాయిదా వేసింది.గత 26 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మంచ్ బుధవారం ప్రకటించింది. తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చేందుకు ప్రభుత్వానికి రెండు నెలల సమయం ఇస్తున్నట్లు మంచ్ నేత రవీంద్ర పాస్వాన్ తెలిపారు.రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థులు మాట్లాడుతూ తమ పోరాటాన్ని, పరీక్షల సంస్కరణల డిమాండ్‌ను ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం గుర్తించాల్సి వచ్చిందన్నారు. పలు పరీక్షలను రద్దు చేయడం జార్ఖండ్ యువత 26 రోజులుగా సాగించిన పోరాటం ఫలితమేనని పేర్కొన్నారు.రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వం తీసుకునే చర్యలను నిశితంగా పరిశీలిస్తామని మంచ్ తెలిపింది. ఈ వ్యవధిలో తమ డిమాండ్లన్నింటిపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత భారీ స్థాయిలో పునఃప్రారంభిస్తామని రవీంద్ర పాస్వాన్ హెచ్చరించారు.ప్రభుత్వం 22 పరీక్షలను రద్దు చేసిందని విద్యార్థులు తెలిపారు. తమడిమాండ్లన్నీ ఇంకా పూర్తిగా నెరవేరలేదని స్పష్టం చేశారు. పిజిటి, మున్సిపల్ సర్వీసెస్, ఎక్సైజ్ కానిస్టేబుల్, సెకండరీ స్కూల్ టీచర్ (మాధ్యమిక్ ఆచార్య) వంటి మరికొన్ని పరీక్షలను కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఇంకా రద్దు చేయని పరీక్షలను కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆందోళన సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దీపికా పాండే సింగ్, డాక్టర్ ఇర్ఫాన్ అన్సారీ నిరసన స్థలాన్ని సందర్శించారని విద్యార్థులు తెలిపారు. 'ఎగ్జామ్ మాఫియాపై చర్యలు తీసుకుంటామని, పరీక్షల్లో అక్రమాలను నిర్మూలించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి ఇర్ఫాన్ అన్సారీ హామీ ఇచ్చి రెండు నెలల సమయం కోరినట్లు చెప్పారు.మంత్రి విజ్ఞప్తి, ప్రభుత్వం ఇప్పటికే పలు డిమాండ్లపై తీసుకున్న చర్యలను పరిగణనలోకి తీసుకుని ఆందోళనను రెండు నెలల పాటు నిలిపివేయాలని రిఫార్మ్ మంచ్ నిర్ణయించింది. ఈ వ్యవధిలో ప్రభుత్వం తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని విద్యార్థులు కోరారు.రెండు నెలల తర్వాత కూడా ప్రభుత్వం తమ ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని, డిమాండ్లపై ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని భావిస్తే ఆందోళనను తిరిగి ప్రారంభిస్తామని హెచ్చరించారు.

## మధ్యాహ్నభోజనంలో ఉప్పుకు బదులు సర్ఫ్‌పౌడర్!

**పాట్నా, ఆగస్టు 19:** మధ్యాహ్న భోజనంలో ఉప్పునకు బదులు సర్ఫ్ పౌడర్‌ను వంటవాడు కలపడంతో ఆ భోజనం తిన్న తర్వాత 40మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బీహార్‌లోని నలంద జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం మధ్యాహ్నం పరాసిలోని మిడిల్ స్కూల్‌కు సోయాబీన్ రైస్‌తో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ఒక ఎన్జీవో సంస్థ సరఫరా చేసింది. కొంతమంది విద్యార్థులు భోజనం చేసిన తర్వాత ఆహారంలో ఉప్పు తక్కువగా ఉన్నదని ఫిర్యాదు చేశారు. కిచెన్ రూమ్‌లో ఉప్పు, డిటర్జెంట్ పౌడర్ డబ్బాలు ఒకేచోట ఉండటంతో వంట వ్యక్తి పొరపాటుపడ్డాడు. సాల్ట్‌కు బదులుగా సర్ఫ్ పౌడర్‌ను ఆ ఆహారంలో కలిపాడు. ఆ భోజనం తిన్న తర్వాత 36మంది బాలికలు కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో పాటు వాంతులు చేసుకున్నారు. స్కూల్‌లో ప్రాథమిక చికిత్స తర్వాత ఆ విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నదని డాక్టర్లు తెలిపారు. మరోవైపు బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్ ఆ ఆసుపత్రిని సందర్శించారు. ప్రభావిత విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని మీడియాతో అన్నారు.

## ఇరాన్ పట్టు తప్పుతున్న హార్ముజ్!

**టెహ్రాన్, ఆగస్టు 19:** ప్రపంచ ఇంధన రవాణాకు గుండెకాయలా ఉన్న హార్మూజ్ జలసంధి ఇప్పుడు మరోసారి మూడు దేశాలకు కేంద్ర బిందువు అయింది. ఈ కీలక సముద్రమార్గంపై ఇరాన్ ఆధిపత్యం క్రమంగాతగ్గుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా నౌకాదళం కొనసాగిస్తున్నదిగ్బంధం, ప్రత్యామ్నాయ మార్గాల్లో పెరుగుతున్న నౌకల రాకపోకలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. దీంతో యుద్ధం మొదలైనతర్వాత తొలిసారిగా హార్మూజ్‌పై ఇరాన్ పట్టు బలహీనపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

**ట్రాఫిక్ దారి మారింది**

సముద్ర నౌకల కదలికలను పర్యవేక్షించే మెరైన్‌ట్రాఫిక్ గణాంకాల ప్రకారం గత వారం హార్మూజ్ జలసంధిని కనీసం 95 నౌకలు దాటాయి. అంతకుముందు వారంలో ఈ సంఖ్య 118గా ఉంది. అయితే నౌకలు ఎంచుకుంటున్న మార్గంలో కీలకమైన మార్పు కనిపించింది. గత రెండు వారాల్లో హార్మూజ్ దాటిన నౌకల్లో దాదాపు 80 శాతం ఒమన్ వైపు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నాయి. ఈ మార్గాన్ని ఐక్యరాజ్యసమితి అనుమతించింది. అయితే దీన్ని ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇరాన్ హెచ్చరికలను పట్టించుకోకుండా అమెరికా రక్షణపై నమ్మకంతో నౌకలు ఈ మార్గంలో సాగుతున్నాయి. ఇరాన్ సూచించిన మార్గాన్ని నౌకలు ఎంచుకోకపోవడంతో ఆ దేశానికి మరో దెబ్బ తగిలింది. జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలు చేసే అవకాశం తగ్గింది. మధ్యప్రాచ్య దేశాలు కూడా ఈ విధానాన్ని అంగీకరించేందుకు ఆసక్తి చూపడంలేదు. సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ వంటి చమురు ఉత్పత్తి దేశాలు భారీ చమురునౌకలను హార్మూజ్ మీదుగా పంపిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్ దాటిన తర్వాత అక్కడి నుంచి ఇతర నౌకలకు చమురును బదిలీ చేస్తున్నాయి. ఇరాన్ దాడులను తప్పించుకునేందుకు కొన్ని భారీ నౌకలు తమ ట్రాన్స్‌పాండర్లను ఆపివేస్తున్నాయి. దీంతో వాటి కదలికలను సాధారణ ట్రాకింగ్ వ్యవ స్థలు కూడా గుర్తించలేకపోతున్నాయి. ఈ రహస్య రాకపోకలను డార్క్ షిప్పింగ్‌గా పిలుస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్మూజ్ జలసంధికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. జలసంధిలో ఉంచిన సముద్రపు మైన్లను తొలగించామని తెలిపారు. నౌకాదళ దిగ్బంధం కొనసాగుతోందని స్పష్టం చేశారు. హార్మూజ్ జలసంధి నుంచి సాధారణంగా ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు సాగుతుంది.

# సంక్షిప్త వార్తలు

## పుస్తక రూపంలో సోనియా ఆత్మకథ..నవంబరు 10న విడుదల




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ తన ఆత్మకథ(జీవిత చరిత్ర)ను పుస్తక రూపంలో పాఠకుల ముందుకు తీసుకొస్తున్నారు. బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ పేరుతో ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానున్నట్టు అంతర్జాతీయ ప్రచురణ సంస్థ ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ (పెంగ్విన్ ర్యాండమ్ హౌస్) ప్రకటించింది. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ చాలా మందికి తెలుసు. చదువుకునే రోజుల్లో రాజీవ్‌తో ప్రేమాణం, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా పంచుకోబోతున్నారు.

## ఇమ్రాన్‌ను కలుసుకున్న సోదరీమణులు..



**రావల్పిండి, ఆగస్టు 19:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పిటిఐ అధినేత ఇమ్రాన్ ఖాన్ రావల్పిండిలోని అడియాల జైలులో తన భార్య బుష్రా బీబీ, సోదరి నొరీన్ నియాజీలతో భేటీ అయ్యారు. పాక్ సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాల మేరకు దాదాపు తొమ్మిది నెలల తర్వాత మొదటిసారి వీరిద్దరూ జైల్లో ఇమ్రాన్‌తో ములాఖత్ సందర్భంగా కలిశారు. పాకిస్థాన్ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి కలిసేందుకు అనుమతినిస్తూ మంగళవారం ప్రభుత్వానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలోనే జైలు అధికారులు ఈ భేటీకి ఏర్పాట్లు చేశారు.

## సిజెపి నిరసనలపై ఆదేశాలు వెనక్కి తీసుకున్న విజయ్ సర్కార్

**చెన్నై, ఆగస్టు 19:** తమిళనాడు సర్కారు యూటర్న్ తీసుకున్నది. ఆదేశాలు ఇచ్చి 24 గంటలు గడవకముందే వెనుకడుగు వేసింది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, యువత నిరసన ప్రదర్శనల్లో పాల్గొనరాదు అని మంగళవారం తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సింథియా సెల్వి పి ఆ ఆదేశాలు జారీ చేశారు.ఆగస్టు 17వ తేదీన ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆందోళనల్లో పాల్గొనే విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ తన ఆదేశాల్లో పేర్కొన్నది.

## తమిళనాడు ఎమ్మెల్యేలకు కార్లు, నిర్వహణకోసం రూ.75 వేలు

**చెన్నై, ఆగస్టు 19:** తమిళనాడు సిఎం విజయ్ ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలకు భారీ బొనాంజా ప్రకటించారు. ప్రతి ఎమ్మెల్యేకు ఓ కారు, పెట్రోల్ అలెవన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సిఎం చెప్పారు. తమిళనాడులో మొత్తం 234 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పుడు వారందరికీ ప్రభుత్వం తరపున ఓ కారు అందనున్నది. దాని పెట్రోల్, మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వనున్నది. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు నిత్యం ప్రయాణం చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వ వాహనం వల్ల పారదర్శక, అవినీతిలేని ప్రభుత్వాన్ని నడపవచ్చు అని అన్నారు.

## హోటల్‌లో అగ్నిప్రమాదం..చిన్నారిసహా 9 మంది మృతి

**కోల్‌కత్తా, ఆగస్టు 19:** కోల్‌కతాలో తాజాగా ఓ హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఎసి పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# అంగన్వాడీలకు డబుల్ బెనిఫిట్స్

## 2,572 మందికి లబ్ధి

## మొత్తం రూ.15.61కోట్లు జమ

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,572 మంది అంగన్వాడీ సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ కింద మొత్తం రూ.15.61 కోట్లు జమ చేసినట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. ఈ చెల్లింపుల్లో 473 మంది అంగన్వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు, 1,930 మంది హెల్పర్లకు రూ.9.65 కోట్లు అందాయి. పెంచిన ప్రయోజనాల కింద మరో 14 మంది టీచర్లకు రూ.28 లక్షలు, 59 మంది హెల్పర్లకు రూ.59 లక్షలు చెల్లించారు. పాత నిబంధనల ప్రకారం మరో 96 మంది అంగన్వాడీ సిబ్బందికి రూ.36.10 లక్షల బెనిఫిట్స్ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాగా రాష్ట్రంలో



పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బంది రిటైర్మెంట్ సమయంలో అందించే సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేసింది. సుదీర్ఘకాలం అంగన్వాడీ సేవలు అందించిన సిబ్బందికి రిటైర్మెంట్ తర్వాత ఆర్థికంగా అండగా, వారికి గౌరవప్రదమైన ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో రిటైర్ అంగన్వాడీ సిబ్బందికి కూడా ప్రస్తుత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించినట్లు వెల్లడించింది.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారుల వివరాలు ప్రకారం కొత్తగా అమలయ్యే నిబంధనల ప్రకారం 65 ఏళ్ల వయస్సు పూర్తి అయిన అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున సర్వీస్ ఎండ్ బెనిఫిట్ లభిస్తోంది. అలాగే, 60 ఏళ్ల దాటాక స్వచ్ఛందంగా వైదొలిగే అంగన్వాడీ సిబ్బందికి కూడా ఇదే ప్రయోజనం వర్తించనుంది. కేంద్ర ప్రభుత్వం అందించే మిషన్ సక్షమ్ అంగన్వాడీ అండ్ పోషణ్ 2.0 మార్గదర్శకాల ప్రకారం అంగన్వాడీ సిబ్బంది రిటైర్మెంట్ వయస్సును గరిష్టంగా 65 ఏళ్లుగా నిర్ణయించారు. అది గతంలో అంగన్వాడీ టీచర్లకు రూ.1 లక్ష, హెల్పర్లు, మినీ అంగన్వాడీ వర్కర్లకు రూ.50 వేలు ఉండేది. అయితే, ఇప్పుడు ఆ మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. పెంచిన బెనిఫిట్స్ ప్రకారం అర్హత ఉన్న సిబ్బందికి చెల్లింపులు కూడా మొదలయినట్లు అధికారులు తెలిపారు.

# వైఎస్ఆర్ స్టేట్ మ్యూజియానికి పూర్వ వైభవం

## క్రీ.పూ. 2500యేళ్ల నాటి ఈజిప్షియన్ మమ్మీ సంరక్షణకు చర్యలు

## మ్యూజియం పునరుద్ధరణకు త్వరలో నిధులు: మంత్రి జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** చారిత్రక, పురావస్తు సంపదకు నిలయమైన డా. వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇన్నాళ్లుగా నిరాదరణ, నిరక్ష్యానికి గురైన మ్యూజియాన్ని సమగ్రంగా పునరుద్ధరించి, దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు సందర్శించేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని డా. వైఎస్ఆర్ రాష్ట్ర హెరిటేజ్ మ్యూజియాన్ని బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. మ్యూజియంలోని వివిధ గ్యాలరీలను పరిశీలించి అక్కడ భద్రపరిచిన అరుదైన పురావస్తు, చారిత్రక వస్తువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్రాంజ్, బుద్ధిస్ట్, శిల్పకళ, ఫిరంగులు, పెయింటింగ్ గ్యాలరీలను పరిశీలించారు. మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటి ఈజిప్షియన్ మమ్మీని మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. ఇంతటి ప్రాచీనమైన మమ్మీని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా అత్యంత భద్రంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. జర్మన్ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా మమ్మీ సంరక్షణకు రూ.82 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశ, విదేశీ పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే ప్రదేశంగా హెరిటేజ్ మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. మ్యూజియంలోని అరుదైన పురా వస్తు సంపద, చారిత్రక విశేషాలను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావడంతో పాటు పర్యా టకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొం దించాలని అన్నారు. మ్యూజియం పునరు ద్ధరణకు అవసరమైన నిధులను త్వరితగతిన విడు దల చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భవన సంరక్షణతో పాటు మ్యూజియం పునర్నిర్మాణం, పెయింటింగ్ తదితర పనులను చేపట్టేందుకు సమగ్ర అంచ నాలు రూపొందిం చాలని ఆదేశించారు. మ్యూజియం పునర్నిర్మాణం, భవన సంరక్షణ, పెయింటింగ్ పనులకు సంబంధించిన అంచ నాలను రూపొందించి వారంలోగా సమర్పిం చాలని పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జునరావును మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మ్యూజియం అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే అరుదైన సంపదను పరి రక్షించడంతో పాటు వాటిని ప్రజలకు, పర్యాటకుల కు మరింత చేరువ చేయ డమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ డిప్యూటీడైరెక్టర్ డా. రాములు నాయక్, డా. నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ బి.మధు, డి. బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.



ఈజిప్షియన్ మమ్మీని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# మత్స్య శాఖ ప్రక్షాళన

**అవినీతి, అక్రమాలకు చెక్**

**కార్యకలాపాలపై నిరంతర నిఘా**

**పారదర్శకత పెంపునకు చర్యలు**

**ప్రత్యేక విజిలెన్స్ కమిటీ ఏర్పాటు**

**హైదరాబాద్,ఆగస్టు 19, ప్రభాతవార్త:** మత్స్య శాఖను ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ శాఖలో ముఖ్యంగా అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమవుతోంది. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెంచేందుకు తెలంగాణ సర్కార్ చర్యలకు సిద్ధమవుతోంది. ఈ శాఖలో అక్రమాలపై నిరంతర నిఘా పెట్టేందుకు ప్రత్యేక విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఇటీవల మహబూబాబాద్ తదితర జిల్లాల్లో ఓ ఉన్నతాధికారి, ఇతర అధికారులు, ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణకు అధికారిని నియమించిన ప్రభుత్వం ఒక్క ఘటనతో సరిపెట్టకుండా శాఖలో వ్యవస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మత్స్యశాఖ ద్వారా చేప పిల్లల ఉచిత పంపిణీ, సబ్సిడీ పథకాలు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు, మత్స్యకార సహకార సంఘాలకు సంబంధించిన పథకాలు అమలవుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక, నిధుల కేటాయింపు, కొనుగోళ్లు, టెండర్ల నుంచి పథకాల అమలు వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదులపై విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలతోపాటు చట్టపరమైన చర్యలకు సిఫారసు చేసే విధానం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం విజిలెన్స్ కమిటీని ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కమిటీ విధులు, అధికార పరిధిని నిర్దేశించి పథకాల అమలును ఎప్పటి కప్పుడు పరిశీలించేలా చర్యలు తీసుకోనున్నారు. త్వరలో విజిలెన్స్ కమిటీ స్వరూపం, సభ్యుల నియామకం, అధికార పరిధి, ఫిర్యాదుల స్వీక రణ, విచారణ విధానంపై అధికారిక మార్గదర్శ కాలు వెలువడే అవకాశం ఉంది. దీంతో మత్స్య శాఖలో అవినీతిపై నిఘా మరింత కట్టుదిట్టం కానుంది. అయితే కమిటీ సభ్యులు, అధికారాలు, విధివిధానాలపై ఇంకా అధికారిక ఉత్తర్వులు వెలు వడాల్సి ఉంది. పథకాల ప్రయోజనాలు పొందేందుకు కొందరు అధికారులు, మధ్యవర్తులు లబ్ధిదారుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తు న్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అవినీతిపై మత్స్యకా రులు, ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ లేదా డిజిటల్ వేదిక ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క మత్స్యకారుల సహకార సంఘాల్లోనూ పారదర్శకత పెంచేందుకు చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

గ్రామస్థాయి ప్రాథమిక సంఘాల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి సంఘాల వరకు సభ్యత్వాల ప్రక్రియను పర్యవేక్షి ంచడంతోపాటు అనర్హులు, బోగస్ సభ్యులకు అడ్డు కట్ట వేసేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

# వేతన సవరణను వెంటనే ప్రారంభించాలి

## ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్ వర్తింపజేయాలి

## టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్‌సౌధలో మహాధర్నా




**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థల్లో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆర్టిజన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఏపీ ఎస్ఈబీ సర్వీసు రూల్స్‌ను ఆర్టిజన్లకు వర్తింపజేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జెఏసి (టీజీపీఈజేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేదంటే ఈ నెల 27నుంచి అన్ని విద్యుత్ సంస్థల్లో వరుస ఆందోళనలు నిర్వహించడానికి వెనుకాడబోమని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం విద్యుత్ సౌధలో భారీ ఎత్తున ఉద్యోగుల మహాధర్నా నిర్వహించింది. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు, జనరల్ సెక్రెటరీ శ్రీధర్, కోకన్వీనర్ బిసిరెడ్డి, వజీర్, మహేష్ తదితరులు మాట్లాడారు. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు సంబంధించిన 14 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. 1999 నుండి 2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని, సుదీర్ఘకాలంగా విద్యుత్ సంస్థలకు సేవలందిస్తున్న ఈ ఉద్యోగుల పట్ల ప్రభు త్వం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో వివిధ కేటగిరీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం ద్వారా విద్యుత్ ఉద్యోగులపై ఉన్న అదనపు పనిభారాన్ని తగ్గించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేప ట్టాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర మోడల్ తరహాలో రైతు అనుకూలమైన "రైతు డిస్కం" విధానాన్ని పరిశీలించి అమలు చేయాలని, ఈపీఎఫ్ ఉద్యోగులకు ఎటువంటి పెన్షన్ పరిమితి (సీలింగ్) లేకుండా యాజమాన్య వాటాను చెల్లించాలని, అన్ని కేడర్‌లలో ఉద్యోగులకు రెగ్యులర్ ప్రమోషన్లు కల్పించి, ప్రమోషన్లలో ఉన్న జాప్యాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో వెంకటేశ్వర్లు, నీలం ఐలేష్, సదానందం, తాజు ద్దీన్ బాబా, కరుణాకర్ రెడ్డి, రాంజీ, రాధాకృష్ణ, నెహ్రూ, మేడి రమేష్, కె.వి.రామారావు, స్వామి, సత్యనారాయణ రావు, మోసెస్, జె.ఎల్ జనప్రియ, భూపాల్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, శ్రీని వాస్ రెడ్డి, సురేష్ కుమార్, విద్యాసాగర్, వెం కటేష్, యుగంధర్, అశోక్ కుమార్, తిరుపతి, రాజేంద్రప్రసాద్, అనిల్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు : విద్యార్థి సంఘాల నేతలు

**అడ్డగుట్ట,ఆగస్టు 19 ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసే శక్తి శాఖను మారిస్తే, పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడితే సహించేది లేదని ఎస్.ఎఫ్.ఐ.జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, ఏఐ.డి.ఎస్.ఓ జిల్లా కార్యదర్శి ఎన్.నాగరాజులు హెచ్చరించారు. పాలిటెక్నిక్ డిప్లమాను ఐటీఐలతో అనుసంధానం చేసే ప్రభుత్వ నిర్ణయాన్నివెనక్కి తీసుకొని జీవో నెం 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐ.డి.ఎస్.ఓ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో క్లాసులను బహిష్కరించి నిరసన,ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలను ఇతర శాఖలలోకి మార్చడం ద్వారా పాలిటెక్నిక్ విద్యకు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కళాశాలల్లో మౌళిక వసతులు, అధ్యాపకులు కొరతవంటి సమస్యలు పరిష్కరించకుండా విద్యా వ్యవస్థలో మార్పులు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ.జిల్లా అధ్యక్షులు లెనిన్, ఉపాధ్యక్షులు నాగేందర్,నాయకులు ప్రవీన్,అరవింద్,భరత్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. పాలిటెక్నిక్ విద్యను శక్తి స్కీం నుంచి తొలగించాలని కోరుతూ రామంతాపూర్ లోని ప్రభుత్వ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల ఆందోళన నిర్వహించారు. రామంతాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని విద్యార్థులను సముదాయించారు.

# తెలంగాణలో మఖానా సాగుతో ఎకరానికి రూ.1.5లక్షల నికర లాభం

## బీహార్‌లో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

## రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పంటల వైవిధ్యీకరణ దిశగా తెలంగాణ, బీహార్ రాష్ట్రాలు చారిత్రాత్మక ముందడుగు వేస్తున్నాయి. తెలంగాణలో విస్తరిస్తున్న ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేసేందుకు బీహార్ ఆసక్తి చూపుతుండగా, మఖానా సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో ఆ రాష్ట్ర అనుభవాన్ని అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది. వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం ఇప్పటికే తెలంగాణ, బీహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. బీహార్‌లో ఆయిల్‌పామ్, తెలంగాణలో మఖానా సాగుకు సంబంధించి ఇరు రాష్ట్రాల వ్యవసాయ శాఖలు సహాయ, సహకారాలను ఇచ్చి, పుచ్చుకుంటాయి. రాష్ట్రంలో జరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి ఇప్పటికే బీహార్ ఆసక్తి చూపగా, ఆ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. బీహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంట ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బీహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ నిర్ణయించింది. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా, బీహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది. కాగా ఇటీవలి కాలంలో ఫూల్ మఖానా సూపర్ ఫుడ్‌గా ప్రచారం పొందింది. ఇందులో ప్రొటీన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, కాల్షియం, మెగ్నీషియం ఎక్కువగా ఉండటంతోపాటు క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటుంది. వీటిలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి డయాబెటిస్ ఉన్న వారికి, బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం అని చెబుతున్నారు. దీంతో ఫూల్ మఖానాను స్నాక్స్‌గా తీసుకోవడానికి సామాన్యులు సైతం ఇష్టపడుతున్నారు. విదేశాల్లోనూ ఫూల్ మఖానాకు డిమాండ్ ఉంటోంది. ముళ్ల తామర నుంచి తయారయ్యే ఫూల్ మఖానాను ప్రస్తుతం బిహార్లోనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంట సాగు వల్ల ఎకరానికి కనీసం రూ.1.5 లక్షల నికర లాభంవస్తుందని అంచనా. చెరువులతోపాటు నీరు నిల్వ ఉండే నేలల్లో ఈ పంటను సాగు చేయొచ్చు. చిన్న నీటి చెరువుల్లో మఖానాతోపాటు చేపల పెంపకం వల్ల మంచి లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఇంధన భద్రతకు కృషి

## బొగ్గుతో పాటు పునరుత్పాదక విద్యుత్‌పై దృష్టి

## అధిక మొత్తంలో బొగ్గు అందించేందుకు ప్రణాళికలు

## సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర దేశ ఇంధన భద్రతకు సింగరేణి తగినంత బొగ్గును అందించడంతో పాటు, పునరుత్పాతక విద్యుత్తు రంగంలో కూడా తన వంతు కృషి చేస్తుందని ఆ సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన భారత ఇంధన భద్రత విద్యుత్ ఉత్పత్తి అనే గోష్టిలో ఆయన మాట్లాడుతూ సింగరేణి దశాబ్దాల కాలంగా దేశ ఇంధన అవసరాలకు తనవంతుగా బొగ్గు అందిస్తూ వస్తోందన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో, నట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ట్రాన్స్‌కోతో కలిసి సమష్టిగా కృషి చేస్తుందని చెప్పారు. సింగరేణి తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా థర్మల్, సోలార్ విద్యుత్ క్రిటికల్ మినరల్ రంగంలోకి కూడా ప్రవేశించిందని వివరించారు. అయినప్పటికీ దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే పునరుత్పాతక ఇంధన రంగంలో కూడా తన వంతు బాధ్యత నిర్వహిస్తుందని వెల్లడించారు. ఈ చర్చ గోష్టికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయ కర్తగా వ్యవహరించగా, రాష్ట్ర విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సిఎండి డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగంలిమిటెడ్ సిఎండి దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్ కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండి కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్ ఘడ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ ఎండి సంజీవ్ కుమార్ కటియార్ తదితరులు పాల్గొన్నారు

# ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం: మహేష్ కుమార్ గౌడ్

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ఫేజ్2)పై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈడీ నిర్వహించిన దాడుల్లో 90 శాతానికి పైగా ప్రతిపక్ష పార్టీల నేతలపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షి ంచడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు గత రెండున్నర నెలలుగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నారని తెలిపారు. బీఎల్ఏల లిస్ట్ 35 వేల సమర్పిస్తే ఎన్నికల సంఘం కేవలం 13 వేల మాత్రమే నమోదు చూపించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు నమోదును తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లాలో సుమారు 20 శాతం ఓట్లు తొలగించబడగా, మరో 40 శాతం ఓట్లకు నోటీసులు జారీ చేయడం ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎంపీ సురేష్ షెట్కర్, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఆకుల లలిత, యూత్ కాంగ్రెస్ నాయకులు విపుల్‌బాజ్ గౌడ్, సునీల్ కుమార్ రెడ్డి



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం

## హౌస్ అరెస్టులపై బిఆర్ఎస్ నేతల మాటలు సిగ్గుచేటు

## గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** ప్రజా సమస్యలను నేరుగా విని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం (శ్రీదీ), సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష ్మణ్‌కుమార్ అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధానానికి ప్రభుత్వం



అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వ హించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరిం చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించగా మంత్రి సంబంధిత శాఖలు, అధి కారులు, జిల్లా యంత్రాంగానికి వాటిని పంపించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష ్మణ్ మాట్లాడుతూ ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో కార్యక్రమం ముగిసిపోదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను పర్యవేక్షి స్తూ.. సమస్య పరి ష్కారం అయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. హౌస్ అరెస్టుల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి అడ్లూరి లక్ష ్మణ్‌కుమార్ మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి పక్ష నేతలను ఇంటి నుంచి బయటకు రాని చ్చారా? అని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ సిరిసిల్లకు వచ్చిన సందర్భంలో తనను ధర్మపురిలో హౌస్ అరెస్టు చేసేవారని గుర్తుచేశారు. నాడు ప్రతిపక్ష నేతలను నిర్బంధించిన వారు.. నేడు హౌస్ అరెస్టులపై

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులపై ప్రభుత్వం సానుకూలం: ముకుందరెడ్డి

## ప్రతికలకు ఫోటో జర్నలిస్టులు ప్రాణం లాంటివారు:కె.శ్రీనివాస్‌రెడ్డి



ఫోటోలను పరిశీలిస్తున్న ముకుందరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 19 ప్రభాతవార్త:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అవార్డుల అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డి చెప్పారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ హౌసింగ్ సొసైటీల అంశాలను మీడియా అకాడమీ ద్వారా పరిశీలించి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 'బెస్ట్ న్యూస్ ఫోటో కాంపిటెషన్-2026'తోపాటు ఫోటో ప్రదర్శన కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో ముకుందరెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి మాట్లా డుతూ హెల్త్ కార్డుల కోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు కార్డులు అందించిన తరువాత జర్నలిస్టులకు కూడా ఒకే విధంగా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగిస్తూ వార్త పత్రికలకు ఫోటో జర్నలిస్టులు ప్రాణం వంటివారని, ఒక ఫోటో వెయ్యి మాటలతో సమామన్నారు. గత రెండున్నర దశాబ్ధాలుగా ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యాక్షుడు పి.రామ్మూర్తి, టి.కిషోర్‌సింగ్, కోశాధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు, మాజీ కార్యదర్శి అశోక్ విచారణ

## 2019 నాటి గ్లోబరీనా టెక్నాలజీస్ గోల్‌మాల్‌పై లోతుగా విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ఇంటర్ బోర్డులో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సోదాలు చేబట్టారు. సాయంత్రం ఐదు గంటల నుంచి మొదలైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారిస్తున్నారు. 2019లో జరిగిన ఇంటర్ పరీక్షలకు సంబంధించి గ్లోబరీనా టెక్నాలజీస్ అనే సంస్థ చేసిన తప్పిదాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ లోతుగా విచారణ చేబట్టింది. అప్పట్లో గ్లోబరీ నా టెక్నాలజీస్ సంస్థ ఇంటర్ పరీక్షలు రాసిన లక్షలాది మంది విద్యార్థులతో చెలగాటం ఆడడం తెలిసిందే. ర్యాంకర్లకు సున్నా మార్కులు రావడం, పరీక్షలకు హాజరైనా గైర్హాజర్‌గా చూపడం, మరికొందరికి అ త్తెసరు మార్కులు రావడం సంచలనం రేపడం విదితమే. ఈ నేపథ్యంలో అప్పట్లో విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేబట్టగా అనేక మ ంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీని తరువాత నాటి సర్కారు ఇంటర్ పరీక్ష ల బాధ్యతలను గ్లోబరీనా టెక్నాలజీస్ నుంచి తప్పించి ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు అప్పగించింది. ఈ ఘటనపై విచారణ చేసిన అధికారులు ఇందులో ఇంటర్ బోర్డు అధికారులతో పాటు గ్లోబరీనా సంస్థ తప్పిదాలు వున్నట్లు తేల్చారు. నాటి ఘటనపై గ్లోబరీనా టెక్నాలజీస్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థి సంఘాలు ఆ రోపించాయి. ఈ సంస్థలో కొందరు రాజకీయ నాయకులు వున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ మొత్తం వ్యవహారంపై నిగ్గు తేల్చాలని సిఎం రే వంత్ రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. సిఎం ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేబట్టారు. సోదాల సందర్భంగా బోర్డు కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున రికార్డులను పరిశీలించిన అధికారులు వాటిలో కొన్నింటిని జప్తు చేసినట్లు తెలిసింది. నాటి ఘటనలో బోర్డు మాజీ కార్యదర్శి అశోక్ పాత్రపైనా ఆరోపణలు రావడంతో ఆయనను విచారిస్తున్నారు. దీంతో పాటు మరికొందరిని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కొందరు అరెస్టయ్యే అవకాశాలున్నాయని తెలిసింది.

# 22ఎ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి

ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి

అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

మాభూమి మాకు దక్కింది

ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: 22 ఏ దరఖాస్తుదారులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు19:** 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మంత్రి మాట్లాడుతూ.22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలిం చాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.'నా భూమి నాకు దక్కింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు' 22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన పోచారం గ్రామానికి చెందిన రాకేష్ తన అనుభవాన్ని వెల్లడించారు.

'నేను 2022లో పోచారం గ్రామంలో వంద గజాల స్థలం కొనుగోలు చేశాను. ఇటీవల ఆ స్థలాన్ని విక్రయించేందుకు నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. మొదట డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించగా, మీ భూమి22/ఎ లో ఉందని చెప్పారు. దీంతో కొంత ఆందోళనకు గురయ్యాను. అయితే మూడు, నాలుగు రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి మీ భూమికి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ఈ రోజు నేను ఆ స్థలాన్ని కొనుగోలు దారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేశాను. నా భూమి నాకు దక్కేలా సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు' అని తెలిపారు. 'క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం' నారపల్లి సబ్ రిజిస్ట్రార్ సునీల్ మాట్లాడుతూ.. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గత ఏడాది డిసెంబర్‌లో22/ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల కలెక్టర్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. వెంటనే గతంలో రిజిస్ట్రేషన్ కోసం మమ్మల్ని సంప్రదించిన వారికి ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నాం. వారు కార్యాలయానికి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం" అని సబ్ రిజిస్ట్రార్ సునీల్ తెలిపారు. 'మా సొసైటీలోని 300 ప్లాట్లకు పూర్తి విముక్తి కలిగింది చక్రపాణి (కొనుగోలుదారు)'.కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని నెంబర్ 80సిలోగల 250 గజాల స్థలాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు చేశాను. అయితే రిజిస్ట్రేషన్ కోసం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆభూమి 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ చేయలేదు. తాజాగా ప్రభుత్వ చర్యల కారణంగా నిన్ననే నాకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఈ రోజు (బుధవారం)వెళ్లగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అంతేగాక మా సొసైటీలోని 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు అని చక్రపాణి అనే కొనుగోలుదారు తెలిపారు. ప్రభుత్వ సకాల చర్యల వల్ల రిజిస్ట్రేషన్ పూర్తయింది: రాజేంద్రప్రసాద్... బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల రెయిన్‌బో విస్టాలో ఉన్నప్లాట్ నెంబర్ 804 ను విక్రయించేందుకు కొద్దికాలం క్రితం యజమాని వెంకట విజయ్‌కుమార్ ప్రయత్నించారు. అయితే 22ఎ నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ జరగలేదు. వెంకట విజయ్‌కుమార్ ఆస్ట్రేలియా వెళ్లిపోతూ తన మామ రాజేంద్రప్రసాద్‌కు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈనెల 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఈరోజు రాజేంద్రప్రసాద్ వెళ్లి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ ఏమన్నారంటే..మా అల్లుడు సేల్ చేద్దామనుకున్న ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వస్తే... 22ఎ కింద గవర్నమెంట్ నిషేధం విధించిందని చెప్పినందున ఆ రోజు రిజిస్ట్రేషన్ అవ్వలేదు. ఆ తర్వాత నా అల్లుడు నా పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. అది ఇంకా చాలా కాలమే పడుతుందేమో అనుకున్నాం గానీ... అదృష్టవశాత్తూ ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకున్నందున వెంటనే ఒక వారం రోజుల్లోనే ఇది క్లియర్ అయ్యి... అనుకూలంగా తేలింది. ఈ రోజు(బుధవారం) రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం, రిజిస్ట్రేషన్ కూడా మాకు సంతృప్తి కరంగా పూర్తిగా అవుతుంది. ప్రభుత్వానికి చాలా కృతజ్ఞతలు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి: శ్రీనివాస్...బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల వైష్ణవి ఎస్టేట్ ప్రతినిధి శ్రీనివాస్ మూసాపేట సర్వే నెంబర్ 108లోగల భూమిని విక్రయించేందుకు రాగా 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వ చర్యలు కారణంగా ఈరోజు (బుధ వారం)శ్రీనివాస్ తన భూమికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు.

## విద్యుత్ ఉత్పత్తిదారులుగా రైతులు

### వినియోగాన్ని తగ్గించేందుకు పంటల వైవిధ్యీకరణ

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రైతులను వినియోగదారుల నుండి విద్యుత్ ఉత్పత్తిదారులుగా తీర్చిదిద్దాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి తెలిపారు. నీరు-విద్యుత్-వ్యవసాయ రంగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా వనరుల సమర్థ వినియోగంతో పాటు స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో భాగంగా బుధవారం నిర్వహించిన గ్రామీణ భారతదేశానికి విద్యుత్ పునరుత్పాదక ఇంధనం, విశ్వసనీయ విద్యుత్, సమ్మిళిత అభివృద్ధి అంశంపై జరిగిన చర్చల మాట్లాడుతూ రైతులను విద్యుత్ ఉత్పత్తిదారులుగా మార్చేందుకు మూలధన పెట్టుబడికి సహకారం అందించడంతో పాటు, వారికి అనుకూలమైన విధానాలను రూపొందించి సమర్థవంతమైన వ్యవస్థను ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు వంటి సంస్థలను సౌర విద్యుదీకరణ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా రైతులే విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. వివిధ పంటలకు నీటి అవసరం భిన్నంగా ఉంటుందని, తద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం కూడా పంటను బట్టి మారుతుందన్నారు. అయితే ప్రస్తుతం అధికంగా ఒకే పంటను సాగు చేసే ఒకే రకమైన పంట విధానం వైపు వ్యవసాయం సాగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పంటల వైవిధ్యీకరణను ప్రధాన ప్రాధాన్యతగా తీసుకుందని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. తక్కువ నీటి అవసరమున్న, రైతులకు లాభదాయకమైన పంటలను ప్రోత్సహించడం ద్వారా నీటిపై, వ్యవసాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని వివరించారు. రాష్ట్రం ఏర్పడిన 2014లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 1.31 కోట్ల ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అది 70 శాతం పెరిగి సుమారు 2.2 కోట్ల ఎకరాలకు చేరుకుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నీటి వనరులు, విద్యుత్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించేందుకు పంటల వైవిధ్యీకరణకు మరింత ప్రాధాన్యత ఇస్తూ తదనుగుణంగా వ్యవసాయ శాఖ తక్కువ నీటితో పండే మినుము పెసర వంటి పప్పు జాతి పంటలతో పాటు, కూరగాయ పంటలు, ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించే విధంగా విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.

## రహదారుల అభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు

### సుల్తానాబాద్, మంథనిలో పర్యటించిన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, శ్రీధర్ బాబు

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ మండలం గరేపల్లితో పాటు మంథని నియోజకవర్గంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావులతో కలిసిఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో రూ.219 కోట్ల 67లక్షల విలువైన హెచ్ఏఎం, నాన్ ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం మంథనిలోని గంగాపురి వద్ద రూ.20కోట్లతో నాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.21 కోట్లతో మంథని రామగుండం నాలుగులేన్ల రహదారి విస్తరణ, ఇతర శాఖల రహదారి పనుల తో పాటు పట్టణంలో బీటీ,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.

## వ్యవసాయ పరిశోధన-మీడియా మధ్య సమన్వయం అవసరం: డా. ఆర్.ఎం. సుందరం

**అత్తాపూర్ ఆగస్టు 19,ప్రభాతవార్త:** వ్యవసాయ పరిశోధనా సంస్థలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, శాస్త్రీయ అభివృద్ధి, నూతన సాంకేతికతలకు సంబంధించిన సమాచారాన్ని రైతులు, ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాల్సిన అవసరం ఉందని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం అన్నారు.రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో అగ్రిమీడియా సినర్జీ: ఎన్‌హాన్సింగ్ కొలాబరేటివ్ కమ్యూనికేషన్” అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఈ సందర్భంగా డైరెక్టర్ డా. సుందరం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పరిశోధకులు, రైతులు, ఇతర భాగస్వాముల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించేందుకు స్పష్టమైన కమ్యూనికేషన్ విధానం అవసరమన్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలు, పరిశోధన ఫలితాలను సరైన దృక్పథంతో ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న మోడీ సర్కార్

### వర్కింగ్‌కమిటీ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ,ఆగస్టు 19:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. యువత కోసం కాంగ్రెస్ పార్టీ సమగ్ర, కాలపరిమితితో కూడిన విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభంలో ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్లలో మోడీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీసిందని విమర్శించారు. కొత్త పాఠశాలలు ప్రారంభం కావాల్సిన సమయంలో ఇటీవలి సంవత్సరాల్లో 94 వేల పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ పోటీ కారణంగా ఉన్నత విద్య ఖరీదైనదిగా మారి సామాన్య కుటుంబాలకు అందుబాటులో లేకుండా పోతోందని అన్నారు.విద్యా సంస్థల్లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల జోక్యం పెరుగుతోందని ఖర్గే ఆరోపించారు. విద్య పూర్తిచేసుకున్న తర్వాత ఉద్యోగాల కోసం వెతుకుతున్న యువతకు పేపర్ లీకులు, నియామక పరీక్షల అక్రమాలు, నియామకాలలో జాప్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పేద, అణగారిన వర్గాల విద్యార్థులే ఎక్కువగా నష్టపోతున్నారని అన్నారు.దేశవ్యాప్తంగా యువతలో వ్యక్తమవుతున్న ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదని ఖర్గే పేర్కొన్నారు. వారి సమస్యలను వినేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సమయం కేటాయించలేదని, సమస్యలను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలతో దాటవేయాలని ప్రయత్నించిందని విమర్శించారు. దీంతో యువత రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.యువత సమస్యలను కాంగ్రెస్ తన రాజకీయ ఎజెండాలో చేర్చిందని చెప్పారు. ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీ విద్యార్థుల గొంతును జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు.పార్లమెంట్‌లోనూ విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చకు కాంగ్రెస్ ప్రయత్నించిందని ఖర్గే తెలిపారు. విద్యార్థులకు జరిగిన అన్యాయాలపై చర్చించి, బాధ్యత వహించాలని డిమాండ్ చేశామని చెప్పారు. అయితే వర్షాకాల సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు మాట్లాడటం ప్రారంభించినా యువత లేవనెత్తిన అసలు సమస్యలకు బదులుగా ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.రామ మందిర విరాళాలపై ప్రశ్నలురామ మందిరానికి సంబంధించిన విరాళాల వ్యవహారంపై కూడా ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. రామ మందిర నిర్మాణం కోసం ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోడీ పార్లమెంట్‌లో ప్రకటించారని గుర్తుచేశారు. ప్రజలు ప్రధాని ఏర్పాటు చేసిన ట్రస్ట్ నిజాయితీగా పనిచేస్తుందనే నమ్మకంతో భారీగా నగదు, బంగారం, వెండి తదితరాలను విరాళంగా ఇచ్చారని చెప్పారు. భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని, ప్రజలు ప్రశ్నలు అడుగుతున్నప్పటికీ ప్రధాని మోడీ మోనం వహిస్తున్నారని ఆరోపించారు. రామ మందిరానికి ఎంత బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు వచ్చాయి వాటికి సంబంధించిన లెక్కలు ఏమిటి అనే విషయాలను దేశ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొంతమంది దిగువస్థాయి వ్యక్తులను జైలుకు పంపడం ద్వారా ఈ వ్యవహారం ముగిసిపోదని అన్నారు. ఈ అంశంపై ప్రధాని మోడీ భక్త ప్రజలకు క్షమాపణ చెప్పి సమాధానం ఇవ్వాలని ఖర్గే డిమాండ్ చేశారు.

సమావేశంలో మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితర కాంగ్రెస్ నేతలు కూడా సమావేశానికి హాజరయ్యారు.

## ప్రైవేట్ ఆస్తులపై సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?

### అధికారుల తప్పిదమే కారణమని అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** రాష్ట్ర వ్యాప్తంగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిరక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. 'ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

## సైబర్ నేరగాళ్ల కొత్త తరహా నేరం..ఫియర్ స్కాం

### మీవాళ్లను చంపింది మేమే, మీరు బతికి ఉండాలంటే మాకు డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు బరితెగించారు. ఎప్పటికప్పుడు కొత్తతరహా నేరాల కు బీజం వేస్తూ అమాయకుల ను ంచి అందినంత దోచుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొత్తగా సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న నేరం ఫియర్ స్కాం. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశా ల్లో కొత్తగా అనేక వర్గాల వారిని కలవర పరుస్తున్న నేరం ఇది. ఈ తరహా నేరాలలో సైబర్ నేరగాళ్లు ముందుగా కొందరు వ్యక్తుల వివరాలు పూర్తిగా సేకరిస్తారు. అనంతరం ఆయా కుటుంబాలలో ఎవరైనా చనిపోయి వుంటే వారి వివరాలు కూడా తీసుకుంటారు. అనంతరం కొందరికి ఫోన్లు చేస్తూ తాము మీకు స్నేహితులమని పరిచయం చేసుకుంటూ కుటుంబ సభ్యుల వివరాలు చెబుతారు. దీంతో ఫోన్ చేసిన వ్యక్తులు తమ కు స్నేహితులేనని ఇవతలి వారు నమ్ముతారు. దీని తరువాత రెండు రోజుల విరామం ఇచ్చి మళ్లీ ఫోన్ చేస్తారు. మాకు అర్జంటుగా ఐదు లక్షల రూపాయలు కావాలి. నేను చెప్పిన నంబర్‌కు వెంటనే పంపాలి. లేకుంటే మీ నాన్న లేదా అమ్మను చంపేస్తామని బెదిరిస్తారు. దీని తరువాత ఇంట్లో వారికి గతంలో ఏదైనా ప్రమాదం జరిగి వుంటే దానికి మేమే కారణమని చెబుతారు. దీంతో ఫోన్ అందుకున్న వ్యక్తి బెదిరిపోయి సైబర్ నేరగాళ్లతో మాట్లాడుకుని వారు అడిగినంత కాకుండా అందులో సగం వరకు ఇచ్చేస్తున్నారు. కొన్నిసార్లు అడిగినంతా ఇచ్చేస్తున్నారు. దేశ రాజ ధాని ఢిల్లీతో పాటు ముంబాయి నగరంలో ఇటువంటి నేరాలు కొన్ని వెలుగు చూశాయి. దీనిపై ఆయా ప్రాంతాల పోలీసులు విచారిస్తున్నారు. ఇ ప్పటి వరకు సైబర్ నేరగాళ్లు అనుసరించిన డిజిటల్ అరెస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, వర్క్ ఫ్రం హోం స్కాంలు ఇతర గోల్‌మాల్ వ్యవహారా లకు భిన్నంగా ఫియర్ స్కాం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఈ తరహా నేరాల్లో సైబర్ నేరగాళ్లు ముందుగా తాము టార్గెట్ చేసుకున్న వారికి సంబంధించి అన్ని వివరాలు సేకరిస్తున్నారు. ఆఖరుకు వారి బ్యాంకు ఖాతాల వివరాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలు, వ్యాపారాలు, ఉద్యోగాల వివరాలు కూడా సేకరిస్తున్నారు. అనంతరం పక్కాగా వ్యవహరించి ఫియర్ స్కాంకు దిగుతూ అందినంత దండుకుంటున్నారు. ఢిల్లీలో వెలుగు చూసిన ఘటనలో ఒకరి వద్ద నుంచి 7.13 లక్షలు, ముంబాయిలో ఆరు లక్షల రూపాయలు దోచుకున్నారు. ఇదిలావుండగా ఫియర్ స్కా ఒక రకంగా డిజిటల్ అరెస్టు లాంటిదేనని పోలీసులు చెబుతున్నారు. డిజిటల్ అరెస్టులో నేరగాళ్లు పోలీసులతో పాటు ఈడీ, సిబిఐ అధికారుల పేర్లను వాడుతూ పోలీసు వేష భాషలు వాడుతుండగా ఇందులో ముందుగానే బాధితుల వివరాలు సేకరిస్తూ కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరించి దోచుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. కొందరు వ్యక్తులు తమ కుటుంబ సభ్యుల వివరాల తో పాటు వ్యక్తిగత వివరాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తుండడం సైబర్ నేరగాళ్లకు బాగా కలిసి వస్తుందని పోలీసులు చెబుతున్నారు.



విద్యార్థులపై ఏకే47 ప్రయోగానికి నిరసనగా

## ఆర్జేడి భారీ ర్యాలీ..తేజస్వి యాదవ్ అరెస్టు, విడుదల

**పాట్నా, ఆగస్టు 19:** నీట్ లీక్ వివాదంపై బీహార్‌లో విద్యార్థుల నిరసన సందర్భంగా ఒక పోలీస్ ఏకే 47తో కాల్పులు జరుపడంపై రాజ్ భవన్ మార్చ్‌కు ఆర్జేడీ పిలుపునిచ్చింది. ఈ ర్యాలీకి నేతృత్వం వహించిన ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసనకు మద్దతుగా పాట్నాలో విద్యార్థుల నిరసనలు కొనసాగాయి. సివాన్ జిల్లాలో ఒక పోలీస్ కానిస్టేబుల్ ఏకే 47తో నిరసనకారులపై కాల్పులు జరిపిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన క్రమంలో ఈ సంఘటనపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బుధవారం"రాజ్ భవన్ మార్చ్"కు ప్రతిపక్ష ఆర్జేడీ పిలుపునిచ్చింది. కాగా, తేజస్వి యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆర్జేడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీలో ఒక వ్యక్తి నకిలీ ఏకే47 గన్ పట్టుకుని కనిపించారు. రాజ్‌భవన్ వైపు వెళ్తున్న నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు వాటర్ క్యానన్లను ప్రయోగించారు. అలాగే తేజస్వీ యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆయనను విడిచిపెట్టారు. అయితే విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, జైలుకు వెళ్లేందుకు కూడా భయపడబోమని తేజస్వీ యాదవ్ తెలిపారు.



## మొత్తం 44 పరీక్షలు రద్దుచేసిన జార్ఖండ్ సర్కార్

**రాంచీ, ఆగస్టు 19:** జార్ఖండ్ ప్రభుత్వం 2014 నుంచి నిర్వహించిన ఏకంగా 44 ప్రభుత్వ నియామక పరీక్షలను రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ , టీడీఎల్ అనే ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ముఖ్యంగా జేఎస్ఎస్‌సీజీఎల్ పరీక్ష రద్దు నిర్ణయంపై తీవ్ర కలకలం రేగింది. ఈ రద్దు నిర్ణయంతో అప్పటికే ఎంపికై, వివిధ ప్రభుత్వ శాఖల్లో బాధ్యతలు స్వీకరించిన దాదాపు 2,000 మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారదర్శకంగా ఎంపికైన తమను కూడా అక్రమార్కులతో కలిపి శిక్షించడం సరి కాదని, రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాంచీలోని సెక్రటేరియట్ నుంచి బిర్సా చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ వివాదం వెనుక సీబీఐ చేపట్టిన సమగ్ర దర్యాప్తు కీలక పాత్ర పోషించింది. కీలక నిందితుడైన అభయ్ తివారీ కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయడంతో పాటు, వివిధ పరీక్షల్లో పాస్ అవ్వడానికి రూ. 2 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు రేట్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కేసులో ఇప్పటి వరకు 22 మందిని అరెస్టు చేశారు.ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సమర్థిస్తూ.. నియామక వ్యవస్థపై నిరుద్యోగుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

### గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు కొత్త మార్గదర్శకాలు

## సెప్టెంబరు 18 నుంచి అమలులోకి కొత్తరూల్స్

**వాషింగ్టన్, ఆగస్టు 19:** అమెరికాలో స్థిరపడాలని భావిస్తున్న నివాసేతరులకు, ముఖ్యంగా గ్రీన్ కార్డ్ కోసం ఎదురుచూస్తున్న భారతీయ కుటుంబాలకు, ఇతర దేశాల వలసదారులకు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌యుఎస్‌సిఐఎస్ కీలక ప్రకటన చేసింది. గ్రీన్ కార్డ్ దరఖాస్తులను సమీక్షించే విధానంలో అత్యంత కీలకమైన పబ్లిక్ ఛార్జ్ అనర్హత నిబంధనలపై స్పష్టతనిస్తూ, విస్తృతమైన కొత్త విధాన మార్గదర్శకాలను విడుదల చేసింది . డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ల్యాండ్ సెక్యూరిటీ సమర్పించిన తుది నియమావళి ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ కొత్త నిబంధనలు రాబోయే సెప్టెంబర్ 18 నుండి అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ఈ తేదీన లేదా ఆ తర్వాత దాఖలయ్యే హోదా సర్దుబాటు దరఖాస్తులన్నింటికీ (ఫారం 485) నవీకరించిన నిబంధనలే వర్తిస్తాయి. ఈ కొత్త విధానం ప్రకారం అమెరికాలో గ్రీన్ కార్డ్ పొందే వ్యక్తులు పన్ను చెల్లింపుదారుల నిధులతో నడిచే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడకుండా, తమకు తాముగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే వ్యూహంతో యుఎస్‌ఐసిఎస్ ఈ చర్యలు చేపట్టింది.

## ఆజంఖాన్ యూనివర్సిటీ, ట్రస్టుల్లో ఇడి సోదాలు

**లక్నో,ఆగస్టు 19:** ఉత్తరప్రదేశ్‌లో జైలులో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్‌కు చెందిన మోలానా మహ్మద్ అలీ జౌహర్ ట్రస్ట్, మహ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీకి సంబంధించిన సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ బుధవారం సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్ లోని రాంపూర్, సహారన్‌పూర్‌తో పాటు ఢిల్లీలోని జామియా నగర్‌లో ఈతనిఖీలు జరిగాయి.2002 నాటి మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 17 కింద ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా వచ్చిన నిధులను ప్రైవేట్ కాంట్రాక్టర్లు మళ్లించి, వాటిని జౌహర్ ట్రస్ట్,యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తుల నిర్మాణంతోపాటు ఇతర అవసరాలకు వినియోగించారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

## జింపెక్స్ అధినేత ఆర్.ఎస్ గోయింకా కన్నుమూత

**రైల్వే కోడూరు అర్బన్, ఆగస్టు 19, ప్రభాత వార్త:** ప్రముఖ పారిశ్రామికవేత్త జింటెక్స్ కంపెనీ అధినేత ఆర్ఎస్ గోయింకా బుధవారం చెన్నైలో కన్నుమూశారు. ఈయన 1970,71 సంవత్సరంలో ముగ్గురాళ్ల వ్యాపారానికై నాటి కడప జిల్లా నేటి తిరుపతి జిల్లా అయిన మంగంపేట ప్రాంతానికి వచ్చారు. అప్పటినుంచి చెన్నైలో ఉన్న జింపెక్స్ కంపెనీని మంగంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో కూడా పెట్టారు. నాటి నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి అయిన వైఎస్ రాజారెడ్డి,సీఎంఆర్ కంపెనీలకు చెందిన సుధాకర్ రెడ్డి, ఐబీసీ కంపెనీలకు చెందిన కందుల ఓబుల్ రెడ్డి, రాజమోహన్ రెడ్డిలతో కలిసి అప్పటినుంచి ఇప్పటికీ ముగ్గురాళ్ల వ్యాపారంలో ఐక్యతతోను, పోటీలతోనూ వ్యాపారం చేసి అంచెలంచెలుగా రైల్వే కోడూరులోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా జింపెక్స్ కంపెనీని స్థాపించి ముగ్గురాళ్ల వ్యాపారాన్ని పోటా పోటీగా చేస్తూ ఆర్ఎస్ గోయింకా తనదైన శైలిలో వ్యాపారధిత్య తన పేరును నిలుపుకున్నారు. చిన్న ఆరోగ్య సమస్య చికిత్స నిమిత్తమై చెన్నై ఆసుపత్రి కి వెళ్లిన అయనకు మంగళవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి బుధవారం చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ విషయం తెలియగానే మంగంపేట, కోడూరు, కడప, తిరుపతి, చెన్నై లకు చెందిన వందలాది మంది ముగ్గురాయి మిల్లుల యజమానులు, పారిశ్రామిక వేత్తలు, పల్లెలు పట్టణ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మాచినేని విశ్వేశ్వర రావుతో పాటు హరినాథ రెడ్డి, రమణా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, చలపతిలతోపాటు పలువురు అయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

## మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌పై కేసు నమోదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** ధాన్యం కుంభకోణం కేసులో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేఖా నాయక్‌కు చెందిన రైస్ మిల్లులో రూ.40.96 కోట్ల ప్రభు త్వ ధాన్యం మాయమైనట్టు విజిలెన్స్ దాడులో అధికారులు గుర్తించారు. ఖానాపూర్ మండలం సత్తెనపల్లిలో రేఖానాయక్ పేరిట ఉన్న ఏఆర్ఎస్ రైస్‌మిల్లులో మూడు రబీ సీజన్లకు సంబంధించిన 9,639.962 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైందని,మాయమైన ధాన్యం విలువ రూ. 40.96కోట్లు ఉంటుందని అధికారుల అంచనా వేసి కేసు నమోదు చేశారు.

## అర్హులైన ఓటరు మిగలకూడదు: సీఈఓ సుదర్శన్‌రెడ్డి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు19:** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.బుధవారంఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగాడీఈఓలు, ఈఆర్ఓలతోసీఈవోసుదర్శన్‌రెడ్డివీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

# రిజర్వేషన్లతో బిసిలకు అందలం



**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బిసి నాయకుల సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి బిసి నేతలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బిసిల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపి ఆవిర్భవించిందన్నారు. బిసిలకు వెన్నుదన్నుగా అన్న ఎన్టీఆర్, సిఎం చంద్రబాబు నిలిచారన్నారు. బిసిలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టిడిపి ప్రభుత్వాల హయాంలోనే లభించాయన్నారు. తొలుత ఎన్టీఆర్ బిసిలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబు బిసిలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. 1995లో సిఎం చంద్రబాబు ఆ సంఖ్యను 34శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లకు కోత విధించి, 24శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బిసిలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బిసిలకు పదవులే కాకుండా ఆర్థికంగా లబ్ధి కలిగించే పథకాలను సైతం జగన్ రద్దు చేశారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బిసిలను, ఆ సామాజిక వర్గ నేతలను తప్పుడు కేసులతో వేధించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బిసి రిజర్వేషన్లను 34శాతానికి పెంచుతూ సిఎం నిర్ణయం, చారిత్రాత్మక నిర్ణయమన్నారు. నిర్ణయాధికారంతోనే బీసీలకు అందలం దక్కుతుందని మంత్రి సవిత తెలిపారు. కార్పొరేషన్ ఛైర్మన్లు వీరంకి గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వెంకటి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం చేసేది సంస్కృతమే

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్
- ఉత్కర్ష మహోత్సవం-2026 ఘనంగా ప్రారంభం



**తిరుపతి(విద్య), ఆగస్టు 19 ప్రభాతవార్త:** వికసిత్ భారత్‌కు దిశ, దశ మార్గనిర్దేశం చేసే శక్తి సంస్కృత భాషకు ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ అన్నారు. సంస్కృతంలో నిక్షిప్తమైన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసి, సమాజానికి ఉపయోగపడే విధంగా అన్వయించుకోవాలని సూచించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతిలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఉత్కర్ష మహోత్సవం-2026ను బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్, రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణ రావు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ 2020లో కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాల చట్టం ద్వారా దేశంలోని మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాలకు కేంద్ర విశ్వవిద్యాలయ హోదా లభించిందన్నారు. భారతీయ సంస్కృతికి మూలాధారమైన సంస్కృత భాష అధ్యయనం, బోధన, పరిశోధనలకు ఈ విశ్వవిద్యాలయాలు దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సంస్కృతంలో ఉన్న విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞాన విషయాలను ఆధునిక అంశాలతో అనుసంధానం చేస్తూ పరిశోధనలు చేపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సంస్కృత భాష అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల ద్వారా సహకారం అందిస్తోందని తెలిపారు. ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొంటున్న పండితులు విస్తృతంగా మేధోమథన సదస్సులు నిర్వహించి, సమాజానికి ఉపయోగపడే అంశాలను వెలికితీయాలని సూచించారు. మహోత్సవంలో భాగంగా మహాపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అద్వైత వేదాంత విద్యార్థి వరదరాజన్‌కు వేదాంత విద్వన్మణి సత్కారంతో పాటు నగదు పురస్కారాన్ని మంత్రి అందజేశారు. ఆయనకు విద్యాబోధన చేసిన అద్వైత వేదాంత విభాగ ఆచార్యులు డా. శ్రీహరి శివరామ్ దావగుడెను శాస్త్ర విద్వన్మణి బిరుదుతో సత్కరించారు. అలాగే కె.వి.ఎస్.ఎస్. అవధాని, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు ప్రొ. ప్రతాప్‌లకు విశ్వవిద్యాలయం తరఫున ప్రాచ్య విద్యాభూషణ అవార్డులు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం ప్రచురించిన 25కు పైగా పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్జున్‌రామ్ మేఘ్వాల్ గతంలోనూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. మరోసారి ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమానికి హాజరు కావడం సంస్కృత భాష, భారతీయ సంస్కృతిపై ఆయనకున్న అభిమానానికి నిదర్శనమన్నారు లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ సంస్కృతాన్ని జనభాషగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఉత్కర్ష మహోత్సవం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొ. కె.గణపతి భట్ సభా సంచాలకులుగా వ్యవహరించగా, అడిషనల్ కోఆర్డినేటర్లు డా. భారత భూషణ్ రథ్, డా. నాగరాజు భట్ కార్యక్రమ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణరావు, అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, లక్నో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొ. సర్వనారాయణ ఝా, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీవత్స, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. దక్షిణామూర్తి శర్మతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కోసం 7 నౌకలు, 2 విమానాలతో ముమ్మర గాలింపు

- భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పర్యవేక్షణలో సహాయక చర్యలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక,గాలింపు చర్యలను కొనసాగిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలోని ఫిషరింగ్ ల్యాండ్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్. నైడియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల బుచ్చిరాజు, నర్సాపురం బొమ్మిడి నాయకర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్‌లతో కలిసి ఇన్ ఛార్జ్ మంత్రి క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తూ, గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే దిశగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం, పోలీస్, మెరైన్ విభాగాలు భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని తెలిపారు. ఆగస్టు 3వ తేదీన ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారు. కోపనాతి రామకృష్ణ, కొల్లాటి యేసు దాసు, పాలేపు సంతోషరావు, కర్రి రాంబాబు, కొల్లాటి శ్రీనుబాబు, సంగడి తాతారావు, పోనాడి సతీష్‌లు ఈ బోటులో ఉన్నారు. వీరంతా అమలాపురం, ముమ్మిడివరం నియోజక వర్గాలకు చెందినవారని బాధిత కుటుంబాలు మంత్రికి తెలియజేశారు. సాధారణంగా పది రోజుల్లో తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు తెలిపి సముద్రంలోకి వెళ్లినప్పటికీ, నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా బోటు తిరిగి రాక పోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 17న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ డా.ఆర్ మహేష్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలను ప్రారంభించారని బాధితులు తెలియజేశారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్‌కు చెందిన 5 నౌకలు, భారత నౌకాదళానికి చెందిన 2 నౌకలు, అలాగే నేవీకి చెందిన 2 అత్యాధునిక విమానాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. సుమారు 300 నాటికల్ మైళ్ల పరిధిలో సముద్ర ప్రాంతాన్ని జల్లెడ పడుతూ బోటు, మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతరంగా శోధన కొనసాగు తోందని మంత్రి అచ్చెన్నా యుడు భరోసా ఇచ్చారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తదితర తీర ప్రాంతాల రక్షణ విభాగాలకు సమాచారం అందించి సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. తాజాగా ఒడిశాలోని పారాదీప్‌కు సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో పసుపు రంగులో ఉన్న ముత్యాలమ్మ పేరుతో కూడిన బోటును గుర్తించినట్లు సమాచారం అందింది. దీనిపై అధికారులు అప్రమ త్తమై, గుర్తించిన బోటు గల్లంతైన మత్స్యకారుల బోటేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించామని మంత్రి తెలిపారు. గాలింపు చర్యల్లో లభిస్తున్న తాజా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని మత్స్య శాఖ మంత్రి తెలిపారు.

### గాలింపు చర్యలపై సిఎం ఆరా..

**విజయవాడ, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో గల్లంతైన బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారుల ఆచూకీని కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనలో జరుగుతున్న గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులతో వర్చువల్ గా మాట్లాడారు. గాలింపు చర్యలు ఏ మేరకు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్స్, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారని... జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తోందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇప్పటికే రెండు డార్నియర్ విమానాలు నేవీ బోట్లతో పాటు మరో ఏడు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల బోట్లను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నామన్నారు. పారాదీప్‌కు 14 నాటికల్ మైళ్ల దూరంలో కొన్ని పడవలను గుర్తించామని, వాటి గురించి ఆరా తీస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. గాలింపు చర్యలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆ కుటుంబాలకు తెలియచేస్తూ ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

- జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**విశాఖపట్నం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం అమరావతి నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వార్డుల వారీగా వివరాలు, రిజర్వేషన్లు, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను సరిచూసుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అవసరమైన డేటాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, మౌలిక వసతులు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ఓటుహక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సేకరించి, అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు చేపట్టాలని, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నిబంధనలు, విధివిధానాలు, బాధ్యతలపై దశలవారీగా పూర్తి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్ లభ్యతను ముందుగానే నిర్ధారించుకోవడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ప్రీఎలక్షన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్, ప్రచురణలు, ఓటర్ల విభజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రధానంగా మూడు దశల ఎన్నికల సరళిపై చర్చించారు. అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన 15వ రోజున పోలింగ్ నిర్వహించి, పోలింగ్ ముగిసిన 18వ రోజున ఫలితాలు ప్రకటించేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. మేయర్/మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఓటర్లకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉన్నందున దీనిపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన 16వ రోజున పోలింగ్ నిర్వహించి, 19వ రోజున ఫలితాలు ప్రకటించే విధంగా షెడ్యూల్ ఉంటుందని చెప్పారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన 14వ రోజున పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, సామగ్రిని సిద్ధం చేయడం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ వివరించారు. జీవిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిపిఒ శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ రమణ మూర్తి, ఎస్.డి.సి. గోవిందు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మం చౌదరిని పరామర్శించిన ఎమ్మెల్యేలు



**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యేలు బ్రహ్మం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని, మళ్లీ మీ సేవలు ప్రారంభించాలన్నారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురికావడం బాధాకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ వలన ఆయన త్వరగా కోలుకున్నారని, మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు.

## గుంటూరులో భారీ స్థాయిలో
# ఐటి సోదాలు

**గుంటూరు(క్రైమ్), ఆగస్టు 19 ప్రభాతవార్త:** చార్టెడ్ అకౌంటెంట్ ఇంట్లో ఐటీ బృందం మంగళవారం సాయంత్రం నుండి సోదాలు నిర్వహించారు. తెలిసిన వివరాలు ప్రకారం అరండల్ పేట 17/2లో తేజ కాంప్లెక్స్‌లోని చార్టెడ్ అకౌంటెంట్ దామా సుబ్రహ్మణ్యం చెందిన నివాసం వద్దకు ఆదాయ పన్ను శాఖ అధికారులు ఒక్కసారిగా మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఐదు కార్లలో 26 మంది వరకు విచ్చేసి సోదాలు చేశారు. విజయవాడ, హైదరాబాద్ నుంచే కాకుండా సెంట్రల్ ఐఆర్ఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సోదాల్లో కీలకమైన హార్డ్ డిస్కులు, ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. దీనికి సంబంధించిన కంపెనీ యజమానిని కూడా ఐటీ అధికారులు విచారిస్తున్నట్లు తెలియవచ్చింది.

వందల కోట్ల రూపాయలతో బ్యాంకులకు కుచ్చు టోపి పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఆరు బ్యాంకుల నుండి కోట్లలో లావాదేవీలు జరిగినట్లు అంచనా. దావా సుబ్రహ్మణ్యంపై గత నెల రోజులగా నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

ఓ బడా కంపెనీ యజమానికి బినామిగా కూడా వ్యవహరిస్తున్నట్లు ఐటీ అధికారులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఆ కంపెనీ యజమానిని కూడా అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో విజయవాడ నుండి ఆరుగురు, హైదరాబాద్ నుండి 17 మంది, సెంట్రల్ నుంచి మరో ఇరువురు ఐఆర్ఎస్ అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## ఎసిబి వలలో ఇరిగేషన్ ఎఇ

**విజయనగరం, గరివిడి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని కొండ లక్ష్మీపురం పంచాయతీ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఎఇ చింతాడ మహేష్ అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడుల్లో పట్టుబడ్డారు. కొండ లక్ష్మీపురానికి చెందిన మీసాల శ్రీను అనే వ్యక్తి కోళ్ల పారం ఏర్పాటుకి పంచాయతీ అనుమతులు కోరారు. అనుమతులకు రూ.15 వేలు లంచం ఎఇ డిమాండ్ చేశారు. దీంతో మీసాల శ్రీను ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి అధికారులు విజయనగరంలో లంచం తీసుకుంటుండగా ఎఇ మహేష్‌ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు.

# కీచక ఉపాధ్యాయుడు

- మాయమాటలతో మైనర్ విద్యార్థినిపై అత్యాచారం

**కంచిలి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 19 ప్రభాతవార్త:** విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారికి ఉన్నత స్థానంలో నిలపాల్సిన ఉపాధ్యాయుడు కీచకంగా మారి మైనర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ప్రధానోపాధ్యాయుడు చాణక్య విలేకరులకు తెలియజేసిన వివరాలు ప్రకారం ఉపాధ్యాయుడు, మరో కళాశాలలో చదువుకుంటున్న మైనర్ విద్యార్థినికి సంవత్సరం కాలంగా మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. విద్యార్థినికి ఉపాధ్యాయుడికి మధ్య చరవాణిలో కొంతకాలంగా చాటింగ్ జరుగుతుంది. అయితే తల్లిదండ్రులకు అమ్మాయి ప్రవర్తనలో మార్పు గమనించి నిలదీశారు. తల్లిదండ్రులు నిలదీయడంతో అమ్మాయి పూర్తిగా జరిగిన విషయాలను తెలియజేసింది. జరిగిన సంఘటనను 45 రోజుల క్రితం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమక్షంలో ఉపాధ్యాయుడిని నిలదీశారు. అమాయకురాలైన తమ కుమార్తెను ఉపాధ్యాయుడు మాయ మాటలతో లొంగదీసుకున్నాడని, తమది పేద కుటుంబమని కుమార్తె విషయం బయటకు తెలిస్తే తమ కుటుంబ సభ్యులంతా సంఘంలో, సమాజంలో బతకలేక, మరణమే శరణ్యమని ప్రధానోపాధ్యాయులు ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతకీ న్యాయం జరగపోవడంతో, జరిగిన విషయాన్ని జిల్లా ఉపవిద్యా శాఖ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై జిల్లాఉప విద్యాశాఖ అధికారి మూడు రోజుల క్రితం ఉన్నత పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. జరిగిన విషయాలను కుటుంబ సభ్యుల నుండి తెలుసుకొని, వివరాలంతా ప్రధానోపాధ్యాయుల నుండి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందుకొని ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# డాక్టర్ ప్రియాంక హత్య కేసులో నిందితుల రెండు రోజుల పోలీస్ కస్టడీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాజమహేంద్రవరంలో డాక్టర్ ప్రియాంక హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు నిందితులను పోలీసులు విచారించనున్నారు. విచారణ అధికారి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పాటిల్ దేవరాజ్ మునీష్ ఆధ్వర్యంలో నిందితులను బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఘటనకు ముందు, ఘటన జరిగిన సమయంలో, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. డాక్టర్ ప్రియాంక ప్రయాణిస్తున్న స్కూటీని నిందితుల కారు ఏ విధంగా ఢీకొట్టింది? ప్రమాదం అనంతరం నిందితులు ఎక్కడికి వెళ్లారు? కారు ఎందుకు వేగంగా అక్కడి నుంచి వెళ్లింది? తదితర అంశాలపై విచారణ సాగుతోంది.

అలాగే ప్రసాదిత్య మాల్‌లో నిందితులకు, సిబ్బందికి మధ్య జరిగిన వివాదానికి కారణాలు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపైనా పోలీసులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారా లతో నిందితుల వాంగ్మూలాలను పోలీసులు సరిపోల్చనున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావడమే లక్ష్యంగా దర్యాప్తు కొనసాగు తోంది.

# 22, 23 తేదీల్లో విశాఖలో బ్రిక్స్ సమావేశాలు

- 11 దేశాల నుంచి యువజన, క్రీడామంత్రులు, ఉన్నతాధికారుల రాక







**విశాఖపట్నం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి విశాఖపట్నం వేదిక కానుంది. బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం నగరానికి లభించిన అరుదైన గౌరవంగా నిలవనుంది. యువత, క్రీడలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారంపై ప్రపంచ దేశాల ప్రతినిధులు చర్చించే ఈ సమావేశాల ద్వారా విశాఖపట్నం తన అంతర్జాతీయ ప్రతిష్టను మరోసారిచాటుకోనుంది. భారతదేశం 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో 2వ బ్రిక్స్ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రుల సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన బ్రిక్స్‌కు చెందిన 11 దేశాల నుంచి మంత్రులు, ఉన్నతస్థాయి ప్రతినిధులు విశాఖకు రానుండటంతో నగరం అంతర్జాతీయ అతిథ్యానికి సిద్ధమవుతోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధుల భాగస్వామ్యంతో జరిగే ఈ సమావేశాలు యువత, క్రీడలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై కీలక చర్చలకు వేదిక కానున్నాయి. 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్ టైనబిలిటీ' అనే విస్తృత అంశంతో జరిగే సమావేశాల్లో యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత, ఆవిష్కరణలు, సాధికారతతో పాటు క్రీడా అభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, సంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ తదితర అంశాలపై సభ్య దేశాలు చర్చించనున్నాయి. విశాఖ ప్రత్యేకతను చాటే కార్యక్రమాలు 22న తోట్లకొండలో మొక్కల నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన, ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం హోటల్ రాడిసన్ బ్లూలో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి హోటల్ నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో గాలా డిన్నర్ నిర్వహించనున్నారు. దీనిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి భాగస్వామ్యం కానున్నారు. 23వ తేదీ ఉదయం నిర్వహించనున్న బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నోవాటెల్ నుంచి రామకృష్ణ బీచ్ రోడ్, సబ్‌మెరైన్ మ్యూజియం, సీ హారియర్ ప్రాంతం మీదుగా సుమారు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగనుంది. అనంతరం క్రీడా మంత్రుల సమావేశం, విశాఖలోని క్రీడా ప్రదేశాల సందర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

**ప్రతినిధుల కోసం అత్యున్నత స్థాయి ఏర్పాట్లు:** అంతర్జాతీయ ప్రతినిధులకు అత్యున్నత స్థాయి ఆతిథ్యం అందించేలా జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. రాడిసన్ బ్లూ రిసార్ట్స్, నోవాటెల్ హోటళ్లలో ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికల వరకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, రవాణా, ప్రోటోకాల్ ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వైద్య బృందాలు, అంబులెన్సులు, అగ్నిమాపక సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆహార భద్రత తదితర అంశాలపై సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేదిక, ఎల్ఈడీ స్క్రీన్లు, ఆడియో విజువల్, లైటింగ్ తదితర సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాల సమన్వయకర్తగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడును నియమించారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, ప్రతినిధుల రాక నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశాన్ని పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. అంతర్జాతీయ ప్రతినిధుల పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఇప్పటికే అధికారులతో సమీక్షించి, విమానాశ్రయం నుంచి ప్రతినిధుల బస, సమావేశ వేదికలు, పర్యటన ప్రాంతాల వరకు ఎక్కడా లోటుపాట్లు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టారు.



# తీపి వంటకం ! చేదు సంకటం !!

భారతీయ సంస్కృతిలో, పండుగల్లో వేడుకలకు 'తీపి మిఠాయిలుంటేనే ఆ వేడుక బాగా చేసుకున్నట్లు లెక్క. ఇప్పుడు తీవ్రమైన వాతావరణ సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గులాబ్ జామున్, లడ్డూ, కాజూ కట్లీ వంటి సంప్రదాయ స్వీట్ల తయారీకి అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులపై గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తీవ్రంగా పడుతోంది. దీంతో ముడిసరుకుల నాణ్యత, లభ్యత తగ్గిపోతుంది. 'క్లైమేట్ ఆన్ మై ప్లేట్' అనే ప్రత్యేక కథనం వెలుగులోకి తెచ్చింది. వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాడి పశువులు తీవ్రమైన వేడి ఒత్తిడికి (హీట్ స్ట్రెస్) గురవుతున్నాయి. దీనివల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా, పాలలో కొవ్వు శాతం కూడా పడిపోతోంది. ఇది రసగుల్లా, గులాబ్ జామున్ వంటి పాల ఆధారిత స్వీట్ల తయారీకి అవసరమైన నాణ్యమైన కోవా లభ్యతను దెబ్బతీస్తోంది. మరోవైపు, లడ్డూల తయారీకి వాడే శనగ పంటలు అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో నష్టపోతున్నాయి. అనూహ్యంగా పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల శనగ గింజ పరిమాణం తగ్గి దిగుబడి తగ్గుతోంది. అలాగే, హల్వా, ఇతర మైదా స్వీట్లకు వాడే గోధుమ పంటలు విపరీతమైన వేడిగాలుల (హీట్‌వేవ్స్) కారణంగా దెబ్బతింటున్నాయి. స్వీట్లకు ప్రాణమైన చక్కెరను ఇచ్చే చెరకు పంటపై ఎల్ నినో, నీటి కొరత ప్రభావం చూపుతున్నాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చెరకు దిగుబడి తగ్గడంతో చక్కెర ధరలు పెరిగి, స్వీట్ల తయారీ వ్యయం అధికమవుతోంది. కాజూ కట్లీకి వాడే జీడిపప్పు, స్వీట్లకు సువాసననిచ్చే ఏలకులు, కుంకుమపువ్వు వంటి వాటి సాగుపైనా వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముడిసరుకుల ధరలు పెరగడంతో కొందరు వ్యాపారులు కల్తీకి పాల్పడే ప్రమాదం కూడా పొంచి ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, పండుగల తియ్యదనం తగ్గిపోతోంది. □

# మేకప్ ఐ'తేనే'ం ?



.పెళ్లిళ్లు, పార్టీలు అంటూ మేకప్‌ను వేసుకుంటాం. మరి దాన్ని తొలగించ డానికి టిష్యూని వాడి పైపైన తొలగిస్తాం. లేదంటే అలానే నిద్రపోతుం టాం. ఇలా చేయడంవల్ల మొటిమలు చర్మాన్ని పాడుచేస్తాయి. వీటిని దూరం చేయాలంటే..

తేనె సహజమైన మేకప్ రిమూవర్‌గా పని చేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా చేస్తుంది. రెండు స్పూన్ల తేనె తీసుకుని దానిలో కాటన్ బాల్‌ను ముంచి ముఖంపై ఐదు నిమిషాలు మృదువుగా మసాజ్ చేసి ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే మరి. పచ్చిపాలల్లో విటమిన్లు, ప్రొటీన్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాదు, మేకప్‌నూ తొలగిస్తాయి.

పాలల్లో కాటన్ బాల్ ముంచి పది నిమిషాలు పాటు మర్దన చేసి ఆపై నీటితో శుభ్రం చేయాలి. పాలు సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి మెరుపును అందిస్తాయి. ముఖానికి ఆవిరి పట్టి కూడా మేకప్‌ను సులభంగా తొలగించవచ్చు. పదినిమిషాలు ఆవిరిపట్టి.. తరవాత కాటన్ క్లాత్‌తో ముఖం తుడుచుకుంటే చాలు. చెమటతో పాటు మురికి పోతుంది. మొటిమలు రాకుండా ఉంటాయి. దోసకాయ రసం.. ఉబ్బిన కళ్లకు ఉపశమనాన్ని అందించడమే కాదు, సహజ మేకప్ రిమూవర్‌గానూ ఉపయోగపడుతుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మొటిమల నుంచి కాపాడటంతో పాటు సహజ క్లెన్సర్‌గా పని చేస్తాయి. దోసకాయ రసంలో కాటన్ బాల్ ముంచి చర్మంపై రాసుకోవాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకుంటే సరి. □

# వాల్జెడ కోసం !



వాలు జడ చాలామంది అమ్మాయిల కల. కానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అది నెరవేరని వారే ఎక్కువ. అలాంటివారు ఈసారి స్టార్ అనీస్ లేదా అనాసపువ్వు ప్రయత్నించండి. బిర్యానీకి ఘుమఘుమలు అందించే ఈ దినుసులు కురులు వేగంగా పెరగడంలో చాలా బాగా సాయపడుతుందట. ఇంతకీ ఎలా వాడాలంటే.. ఈ పువ్వుల్లోని విత్తనాలను ఓ పదింటిని కచ్చా పచ్చాగా దంచి, ఒక గాజు సీసాలో వేయాలి. తరవాత అరకప్పు కొబ్బరినూనెను ఆ పొడి మునిగేలా పోసి, ఎండలో ఉంచాలి. నూనె వేడెక్కాక వేరే పాత్రలోకి వడపోయాలి. తలస్నానం చేసే ముందురోజు రాత్రి పెట్టుకుంటే సరి. లేదంటే అరకప్పు కొబ్బరిపాలకు స్పూను చొప్పున ఆలివ్ నూనె, అనాస పువ్వు నూనె, కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ కలిపి, తలకు పట్టించి, అరగంటయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే సరి. వీటిల్లో నచ్చినదాన్ని వారానికి రెండుసార్లు ప్రయత్నిస్తే చాలు. స్టార్ అనీస్ విత్తనాల్లోని షికిమిక్ యాసిడ్..కెరటిన్ పెరుగుదలలో సాయపడు తుంది. దీంతో కురులు వేగంగా పెరుగుతాయి. వీటిల్లోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుకీ చెక్ పెట్టేస్తాయి. అంటే రెండిందాలా ప్రయోజనమన్ననమాట ప్రయత్నించండి మరి. □



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# వ్యథ
# ప్రేమతో చేరదీయండి !

ప్రశ్న: నేను 50 ఏళ్ల ఒంటరి మహిళను. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాను. డిగ్రీ చదివే రోజుల్లో ఒక తాగుబోతుకు ఇచ్చి నాకు పెళ్లి చేశారు. ఒక కొడుకు పుట్టిన తరువాత నా భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. దీంతో గొడవపడి విడాకులు తీసుకున్నాను. ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండాల్సి రావడంతో నా కొడుకును మా అమ్మ వద్ద ఉంచాను. ఆమె సరిగా పెంచకపోవడంతో అతను బాధ్యత లేకుండా తయారయ్యాడు. బీటెక్‌లో చేరినా మొదటి సంవత్సరం సరిగా చదవకుండా కాలేజీ మానేశాడు. ప్రస్తుతం సెల్‌ఫోన్‌కు బానిసై ఇంటికే పరిమితమయ్యాడు. నేను మందలిస్తే నాపైనే తిరగబడుతున్నాడు. నాతో రావడానికి కూడా ఇష్టపడటం లేదు. మా అమ్మ కూడా అతన్ని వెనకేసుకొస్తోంది. ఇప్పుడు నా కొడుకును ఎలా మార్చాలి?

– ఒక సోదరి, అనంతపురం



జవాబు: అమ్మా, మీ కొడుకు పరిస్థితికి సెల్‌ఫోన్ ఒక్కటే కారణం కాదు. చిన్న నాటి పెంపకం, తండ్రి దూరం కావడం, తల్లి ఉద్యోగరీత్యా ఎక్కువకాలం దూరంగా ఉండటం, అతని ఆలోచనా విధానం, వ్యక్తిత్వంపై ప్రభావం చూపి ఉండవచ్చు. అందువల్ల అతన్ని పనికిరాని వాడు" అంటూ విమర్శించడం మానేయాలి. కొడుకును మార్చాలని కాదు.. అతనితో మీ సంబంధాన్ని మార్చాలని ప్రయత్నించండి. అతనితో ప్రశాంతంగా, స్నేహపూర్వకంగా మాట్లాడండి. 'నువ్వు ఎందుకు ఇలా తయారయ్యావు?' అని ప్రశ్నించడంకంటే.. 'నీకు ఏం చేయాలని ఉంది? నీకు ఏం ఇబ్బందిగా ఉంది?' అని అడగండి. అతని మాటలను మధ్యలో అడ్డుకోకుండా వినండి. బీటెక్ ఎందుకు మానేశాడో, బయటకు వెళ్లడానికి ఎందుకు ఇష్టపడటం లేదో, భవిష్యత్తు గురించి అతని ఆలోచనలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. తక్షణమే చదువు కొనసాగించమని అని ఒత్తిడి చేయకుండా చిన్న చిన్న బాధ్యతలను అప్పగించండి. ఇంటి పనుల్లో భాగస్వామ్యం చేయడం, రోజూ కొంతసేపు బయటకు వెళ్లడం, వ్యాయామం చేయడం, నిద్ర–ఆహార సమయాలను క్రమబద్ధీకరించడం వంటి చిన్న మార్పులతో ప్రారంభించండి. సెల్‌ఫోన్ వినియోగానికి కూడా స్పష్టమైన పరిమితులు అవసరం. అతనితో చర్చించి క్రమంగా వినియోగ సమయాన్ని తగ్గించేలా చూడండి.మీ తల్లి అతన్ని వెనకేసుకురావడం కూడా సమస్యను పెంచే అవకాశం ఉంది. అయితే ఆమెను నిందించడం వల్ల ప్రయోజనం లేదు. ఆమెతో కూడా ప్రేమగా మాట్లాడి వివరించండి. కుటుంబంలోని పెద్దలందరూ ఒకే విధమైన నియమాలను పాటించడం చాలా ముఖ్యం. అతనిలో తీవ్రమైన నిరాశ, అసహనం, కోపం, నిద్రలో పెద్ద మార్పులు, సామాజికంగా పూర్తిగా దూరం కావడం, ఏ పనిపైనా ఆసక్తి లేకపోవడం లేదా రోజువారీ పనులను కూడా చేయలేని పరిస్థితి కనిపిస్తే మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం మంచిది. అవసరమైతే సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్ ద్వారా సమగ్రంగా అంచనా వేయించాలి. కొడుకును ఒక్కరోజులో మార్చలేం. కానీ తల్లి చూపించే ప్రేమ, సహనం, నమ్మకం.. వాటితో పాటు స్పష్టమైన హద్దులు, బాధ్యతలను కలిపితే మార్పుకు బలమైన పునాది వేయవచ్చు. కొడుకును మార్చడం కంటే ముందుగా.. అతనితో మీ సంబంధాన్ని మార్చండి. సంబంధం మారితే, ప్రవర్తన మారే అవకాశం ఉంటుంది. □

# దత్తాత్రేయస్వామి వజ్రకవచం



అత్రి మహర్షి .. అనసూయ మాత కోరిక మేరకు దత్తాత్రేయుడు అవతరించాడు. దేవతలకు .. మహర్షులకు జ్ఞానాన్ని భోదించాడు. అలాంటి దత్తాత్రేయస్వామి తన భక్తులను అనేక రూపాలలో .. అనేక విధాలుగా పరీక్షిస్తుంటాడు. తన పరీక్షకి నిలబడిన భక్తులను ఆయన కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. దత్తాత్రేయ స్వామిని ఏడుమార్లు తలచుకుంటే .. ఏడోసారికి ఆయన భక్తుల చెంతకి చేరుకుంటాడని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. అలాంటి దత్తత్రేయస్వామి చరిత్రను పారాయణం చేయడం వలన అనేక దోషాలు తొలగిపోతాయి. ఇక స్వామివారి 'వజ్ర కవచం' చదువుకోవడం వలన కూడా విశేషమైన ఫలితాలు కలుగుతాయి. దత్తాత్రేయస్వామివారి 'వజ్ర కవచం'ను మేడిచెట్టు క్రింద కూర్చుని చదువుకోవడం వలన ధనధాన్యాలు కలుగుతాయి. మారేడు చెట్టు క్రింద కూర్చుని చదవడం వలన సుఖ సంతోషాలు కలుగుతాయి ..రావిచెట్టు క్రింద కూర్చుని 'వజ్ర కవచం' చదవడం వలన ఆయురారోగ్యాలు చేకూరతాయి. తులసి మొక్క దగ్గర కూర్చుని ఈ వజ్రకవచాన్ని చదవడం వలన జ్ఞానము లభిస్తుంది. □

# స్టీమ్ బాస్కెట్‌తో...



కాయగూరల్ని ఆవిరిమీద ఉడికించాలంటే ఏం చేస్తాం? ఒక పాత్రలో నీళ్లుపోసి.. ఆ పాత్రలోకి సరిగానఫిట్ అయ్యే మరో పాత్రని తీసుకుంటాం. మళ్లీ దాన్లోకి నీళ్ల పోకుండా కింద మరో గిన్నెని బోర్లించాలి. వెజిటబుల్ స్టీమర్ బాస్కెట్ మీ దగ్గరుంటే.. ప్రతి సారీ ఇంత కష్ట పడాల్సిన అవసరం లేదు. ఈ స్టెయిన్‌లెస్ స్టీల్ బాస్కెట్‌ని కావాలంటే వెడల్పు చేసుకోవచ్చు. వద్దనుకుంటే పాత్రకు తగ్గట్టుగా చిన్నదిగా మార్చుకోవచ్చు.



రంధ్రాలుండటంవల్ల దీన్లో నీళ్ల చేరే అవకాశం లేదు. ఉడికించిన తర్వాత బాస్కెట్‌ని బయటకు తీయడానికి వీలుగా ఒక హుక్ ఉంటుంది. చేతికి ఆవిరి పట్టకుండా బాస్కెట్‌ని తేలిగ్గా బయటకు తీసుకోవచ్చు. □

# 'మోడ్రన్ మిస్సమ్మ' ఫస్ట్ సింగిల్ లాంచ్



మోడ్రన్ మిస్సమ్మ చూసిన ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు : 'వదల' నిర్మాత కిశోర్ నాయుడు లాస్య అండ్ మిధున క్రియేషన్స్ బ్యానర్‌పై చిరంజీవి పమిడి, శివ పమిడి, కిరణ్ కుమార్ నల్లూరి, స్రవంతి నంబూరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం మోడ్రన్ మిస్సమ్మ. సాయిబాబా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష నర్రా, తన్మయి ఖుషి, సిజు ఏఆర్, ప్రమోదిని, హారిక, డా.భద్రం, శివన్నారాయణ, రాకేష్ రాచకొండ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హీరో హర్ష నర్రా మాట్లాడుతూ.. మిస్సింగ్, రోటి కపడా రొమాన్స్ తర్వాత ఇది నా మూడో సినిమా. ఆ రెండు చిత్రాలు కమర్షియల్‌గా పెద్దగా ఆడలేదు. అయినా నా పోరాటం ఆగదు. కష్టపడుతూనే ఉంటాను. ఈ సినిమా కష్టపడి కాకుండా ఇష్టపడి చేశాం. టీమ్ అంతా ఫ్రెండ్స్‌లా మూవీ చేశాం. తన్మయి చాలా బాగా నటించింది. హీరోయిన్ తన్మయి ఖుషి మాట్లాడుతూ '23' మూవీ తర్వాత నటించిన సినిమా ఇది. నాగార్జున మన్మథుడు చిత్రంలోని 'వద్దురా సోదరా' అనే సాంగ్ అప్పట్లో మగవాళ్లకు కనెక్ట్ అయినట్టు, ఇప్పుడు మా చిత్రంలోని ఈ సాంగ్ అమ్మాయిలకు కనెక్ట్ అవుతుంది. డైరెక్టర్ సాయి బాబా మాట్లాడుతూ.. ఈ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు.. అని పెద్దలు చెబుతుంటారు కదా.. దానికి నేనొక ఒకటి యాడ్ చేద్దామనుకుంటున్నా. సినిమా చేసి చూడు అని. ఈ మూడింటిలో అదే కష్టం ఉంటుంది అని నమ్ముతున్నా. ఈ జర్నీలో నాకు సపోర్ట్ చేసిన టెక్నీషియన్స్, ఆర్టిస్టులు, నిర్మాతకి థ్యాంక్స్. నిర్మాత చిరంజీవి పమిడి మాట్లా డుతూ..'మా బ్యానర్‌లో కాలింగ్ సహస్ర తర్వాత వస్తోన్న రెండో చిత్రమిది. ఆ చిత్రానికి మేం ఊహించిన రిజల్ట్ రాలేదు. ఈ చిత్రానికి మాత్రం మంచి ఆదరణ దక్కుతుందని నమ్ముతున్నా. మా హీరో హర్ష చాలా బాగా పెర్ఫార్మ్ చేశాడు. హీరోయిన్ కూడా అంతే బాగా నటించారు. రెండేళ్ల క్రితం ఈ జర్నీ స్టార్ట్ చేశాం. ఇప్పుడు ట్రెండ్‌కు తగ్గట్టుగా మూవీ తీయాలనుకున్నాం. మంచి అవుట్‌పుట్ వచ్చింది అన్నారు.

# 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్' 21న విడుదల



5 చిత్రాలలో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద 740 మిలియన్లకు పైగా వసూలు చేసిన 'ఇన్సిడియస్' ఫ్రాంచైజ్, ఒక కొత్త కుటుంబంతో మరియు 'ది ఫర్దర్' సామర్థ్యాన్ని పునర్నిర్వచించే ఒక భయానక రూపంతో తిరిగి వస్తోంది. 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్'లో, అమేలియా ఈవ్ జెమ్మా పాత్రలో నటించింది. తాను పెరిగిన ఇంట్లోనే తన కూతురిని పెంచుతున్న ఒక యువ తల్లి, ఇన్సిడియస్ విశ్వానికి కేంద్రమైన, దారితప్పిన ఆత్మల నరకలోకమైన ది ఫర్దర్‌ఖిలోకి తాను ప్రయాణించగలనని కనుగొంటుంది. 'ఇన్సిడియస్: అవుట్ ఆఫ్ ది ఫర్దర్' చిత్రం ఆగష్టు 21, 2026న ఆంగ్లం, హిందీ, తమిళం మరియు తెలుగు భాషలలో పాన్ ఇండియాలో విడుదల కానుంది.హారర్ జానర్‌పై చేజ్‌కు ఉన్న ప్రేమ చాలా సంవత్సరాలుగా మరియు అనేక రూపాలలో విస్తరించి ఉంది. "నాకు థియేటర్ అంటే ఇష్టం, అది సంవత్సరాల తరబడి హాంటెడ్ హౌస్ ఆకర్షణలను రూపొందించడంలోకి దారితీసింది," అని ఆయన గుర్తుచేసుకున్నారు. "హైస్కూల్ నుండి నా 20 ఏళ్ల ప్రారంభం వరకు, ఒక ఛారిటీ ఈవెంట్ కోసం నా స్నేహితులతో కలిసి దీన్ని చేసేవాడిని, మరియు అది పెద్ద విజయం సాధించింది.

# తెర


కింగ్ నాగార్జున ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటి గీతాంజలి. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన ఈ క్లాసిక్ లవ్‌స్టోరీ ఇప్పుడు మరోసారి థియేటర్లలో తన మ్యాజిక్‌ను చూపించడానికి రెడీ అవుతోంది. ఆగస్టు

## 'గీతాంజలి' 28న రీరిలీజ్



28న నాగార్జున బర్త్‌డే సందర్భంగా గీతాంజలి తెలుగు, తమిళ భాషల్లో 4కే ఫార్మాట్‌లో ప్రపంచవ్యాప్తంగా రీరిలీజ్ కానుంది. రక్షాబంధన్ స్పెషల్ కూడా కావడంతో ఈ రీరిలీజ్ మరింత ప్రత్యేకంగా మారింది. శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్‌పై బూర్లె శివ ప్రసాద్ ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను లేటెస్ట్ టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.గీతాంజలి అంటే ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తొచ్చేది అందమైన ప్రేమకథ, మనసును తాకే సంగీతం, అద్భుతమైన విజువల్స్, గుర్తుండిపోయే పెర్ఫార్మెన్స్. నాగార్జునను ఎంతో చార్మింగ్‌గా, ఎమోషనల్‌గా చూపించిన ఈ సినిమా ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. ఈసారి 4కే ఫార్మాట్‌లో 'గీతాంజలి'ని చూడటం ఈ రీరిలీజ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది. మరింత క్లారిటీ, డీటెయిలింగ్‌తో విజువల్స్‌ను ప్రేక్షకులు కొత్త అనుభూతితో ఎక్స్‌పీరియన్స్ చేయబోతున్నారు. అప్పట్లో థియేటర్లలో 'గీతాంజలి'ని చూసిన వారికి ఇది మరోసారి ఆ రోజులను గుర్తుచేసే నాస్టాల్జిక్ జర్నీ కానుంది. ఇక ఈ సినిమాను థియేటర్లలో చూడని నేటి జనరేషన్‌కు మాత్రం ఒక ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేసే అవకాశం దక్కనుంది. ఆగస్టు 28న 4కేలో గీతాంజలి మరోసారి థియేటర్లలో మ్యాజిక్ క్రియేట్ చేయనుంది.

## శునకమా! నా ప్రాణమా!



'నీవు లేని లోటు పెద్ద నిశ్శబ్దాన్ని మిగిల్చిం'దంటూ ఇటీవలే భుజం గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న తారక్ తన శునకం మృతిని తట్టుకోలేకపోయారు. రెండు, మూడు నెలల్లో పూర్తిగా కోలుకుంటారని వైద్యుల వెల్లడినటుడు జూనియర్ ఎన్టీఆర్ తాను ఎంతగానో ఇష్టపడే పెంపుడు శునకం 'బఘీరా' మరణించడంతో ఆయన తీవ్ర భావోద్వేగానికి గుర య్యారు. నాలుగేళ్ల తమ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన ఇన్స్టాగ్రామ్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. 'బఘీరా'తో తాను గడిపిన మధుర క్షణాలకు సంబంధిం చిన ఫొటోలను పంచుకున్నారు. బెర్నీస్ మౌంటెన్ డాగ్ జాతికి చెందిన బఘీరాను ఎన్టీఆర్ ఆప్యాయంగా హత్తుకున్న చిత్రాలు ప్రధానంగా దర్శనమిస్తున్నాయి. బఘీరా జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటిన ఫొటోను కూడా ఆయన షేర్ చేశారు.'బఘీరా! నా ప్రపంచంలో నువ్వొక తోడు. నీవు లేని లోటు మాటల్లో చెప్పలేనంత పెద్ద నిశ్శబ్దాన్ని మిగిలావటూ జూనియర్ ఎన్టీఆర్ తన ఆవేదనను ఆ పోస్టులో పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఇటీవలే భుజం గాయం నుంచి కోలుకుంటున్న సంగతి తెలిసిందే. 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో భాగంగా జులై27న ఆయన భుజానికి గాయమైంది. దీనికి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఆయనకు ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ జరిగింది. ఇప్పుడు కోలుకుంటున్నారు.

## 'ది రెడ్ బ్యాగ్' ఆకట్టుకునేలా సినిమా: నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి..



మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హారికృష్ణ సోమిశెట్టి నిర్మించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే ఈ మూవీని రవి కుమార్ సీరపు తెరకెక్కించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఆగస్ట్ 21న భారీ ఎత్తున విడుదల చేయబోతోంది. ఈ క్రమంలో..నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ.. .. 'మా రెడ్ బ్యాగ్' చిత్రానికి మంచి హైప్ ఏర్పడింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్‌కి మంచి ఆదరణ దక్కింది. గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా యూట్యూబ్‌లో ట్రెండ్ అయ్యాయి. మా కంటెంట్‌కి అన్ని వైపుల నుంచి ప్రశంసలు దక్కాయి. చివరి వరకు ఉత్కంఠ భరితంగానే సాగుతుంది. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం.యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి.

## 'అమీర్ లోగ్' సినిమాలోని ప్రతీ కారెక్టర్‌కి ప్రాముఖ్యత ఉంది: వేధా జలంధర్



**మీ జర్నీ గురించి చెప్పండి?..**
నేను 2019లోనే కెరీర్ ప్రారంభించాను. నేను చేసిన ఓ రెండు సినిమాలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లాయి. కానీ అవి రిలీజ్ కాలేదు. ఆ తర్వాత నేను యాక్టింగ్ కోసం థియేటర్ కూడా నేర్చుకున్నాను.

**మీ పాత్ర ఎలా ఉంటుంది?..**
అమీర్ లోగ్ సినిమాలో నా పాత్ర పక్కింటి అమ్మాయిలా ఉంటుంది. మహిళలకు స్ఫూర్తినిచ్చేలా నా కారెక్టర్ ఉంటుంది. మా అమ్మే నాకు స్ఫూర్తి.

**అమీర్‌లోగ్‌లో అవకాశం ఎలా వచ్చింది?..**
తిమ్మరాజుపల్లి టీవీ చేసినట్టుగా మా దర్శకుడు రమణ గారికి తెలీదు. బషీర్ మాస్టర్ మాకు ఈ మూవీ ఆడిషన్స్ గురించి చెప్పారు. నేను ఆడిషన్‌కి వెళ్లాను. అక్కడ నేను బాగా పర్ఫామ్ చేయడంతో రమణవెంటనే ఓకే చెప్పారు.

**ఇప్పటి వరకు అమీర్ లోగ్'చూసిన వారు మీకు ఇచ్చిన కాంప్లిమెంట్స్ ఏంటి?..**
ఈ సినిమాలోని పాత్ర కూడా అలానే ఉంటుంది. ముక్కు సూటిగా ఉండటం, ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం అనేది మా అమ్మ నుంచే నేర్చుకున్నాను. ఈ కారెక్టర్‌లో కూడా ఇలానే ఉంటాను.

**అమీర్ లోగ్‌చిత్రంలో బిర్యానీ గురించే ఎక్కువగా ఉంటుంది?..**
అమీర్ లోగ్ సినిమాలో బిర్యానీది మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. కథలో ఆ ఎలిమెంట్ బాగా కుదిరింది.

**సింక్ సౌండ్‌తో వర్క్ చేయడం గురించి చెప్పండి?..**
నేను ఇది వరకే సింక్ సౌండ్‌తో ఓ ఫీచర్ ఫిల్మ్‌కి చేశాను. మనం ఎంత ప్రొఫెషనల్‌గా ఉన్నా.. చుట్టు పక్కల ఉన్న సౌండ్స్ కూడా రికార్డ్ అవుతుంటాయి. సెట్‌లో చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఈ చిత్రానికి అందరూ అద్భుతంగా సహకరించారు. బస్తీ వాళ్లు కూడా మాకు ఎంతో సపోర్ట్ చేశారు.

**మ్యూజిక్ గురించి చెప్పండి?..**
స్మరణ్ గారి మ్యూజిక్ వల్ల మా చిత్రం పది మెట్లు పైకి ఎక్కినట్టు చెప్పుకోవచ్చు. ఆయన మాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు.

**భాష, యాస వల్ల ఏమైనా సమస్య వస్తుందా? అందరికీ అర్థం అవుతుందా?..**
భాష, యాసతో మా సినిమాకి ఎలాంటి సమస్య రాదు. ఎమోషన్ అనేది అందరికీ కామన్. ఎక్కడైనా ఎమోషన్ అనేది ఒకేలా ఉంటుంది. మా చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా, అన్ని ప్రాంతాల వారిని మెప్పించేలా ఉంటుంది.

## సంగీత్ శోభన్ స్పెషల్ పోస్టర్ విడుదల



ఈ నెల 23న టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేయబోతున్న మేకర్స్ మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీస్ తో యూత్ ఆడియెన్స్ లో తనకుంటూ ఓ స్పెషల్ ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, వరుస హిట్స్ అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని, టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ కాంబోలో ఓ క్రేజీ మూవీ తెరకెక్కుతోంది. సరికొత్త ట్రెండీ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఈ సినిమాలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.3 గా నిర్మాణమవుతున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు హీరో సంగీత్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మారుతి అనే పాత్రలో సంగీత్ శోభన్ నటిస్తున్నారు. బర్త్ డే పోస్టర్ చూస్తే బుట్టలో ఆకుకూరలు తీసుకొస్తూ మిడిల్ క్లాస్ అబ్బాయి లుక్ లో సంగీత్ శోభన్ కనిపిస్తున్నారు. ఇలాంటి పొరుగింటి అబ్బాయి క్యారెక్టర్స్ సంగీత శోభన్ కు టైలర్ మేడ్‌లా ఉంటూ ఆకట్టుకుంటాయి. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ ను ఈ నెల 23న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఇష్టపడేలా ఈ సినిమా తెరపైకి రాబోతోంది.

## సింక్‌ఫీల్డ్ కప్: వాచియర్‌ను ఓడించి
# అగ్రస్థానానికి ప్రజ్ఞా



**సెయింట్ లూయిస్:** సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత్ యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద దూసుకుపోతున్నాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో బుధవారం ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్-లాగ్రావ్‌పై కేవలం 28 ఎత్తుల్లోనేఓడించి, అమెరికన్ గ్రాండ్ మాస్టర్ వెస్లీ సోతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఈ విజయంతో ప్రజ్ఞానంద ఎనిమిది పాయింట్లకు గాను ఐదు పాయింట్లను సాధించి ఈ ఏడాది చివర్లో జరగనున్న గ్రాండ్ ఫైనల్‌లో స్థానం ఖారారు చేసుకున్నాడు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి చివరి రౌండ్‌పైనే ఉంది. ప్రజ్ఞానంద తెల్ల పావులతో అనిష్ గిరితో తలపడనున్నాడు. అలాగే ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ కూడా అద్భుత ఫామ్‌లోకి వచ్చాడు. డచ్ ప్లేయర్ జోర్డన్ వాన్ ఫోరెస్ట్‌పై విజయం సాధించి వరుసగా మూడో గేమ్ గెలిచాడు. దీంతో సిందరోవ్ 4.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో మరో కీలక పోరులో సిందరోవ్, వెస్లీ సోను ఎదుర్కోనున్నాడు. మరోవైపు జర్మనికి చెందని విన్సెంట్ కీమర్ టాప్ సీడ్ అమెరికన్ ఫాబియానో కరువానాను ఓడించి 4.5 పాయింట్లతో సిందరోవ్‌తో కలిసి మూడో స్థానాన్ని పంచుకున్నాడు. కీమర్ వాన్ ఫోరెస్ట్‌తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన లెవోన్ అరోనియన్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి డ్రా చేసుకున్నారు.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో
# భారత్ స్టార్ లక్ష్య, ఉన్నతి నిష్క్రమణ
### డబుల్స్‌లో అర్జున్-హరిహరన్ ఓటమి






**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026 నుండి భారత్ స్టార షట్లర్ లక్ష్యసేన్, ఉన్నతి హుడా అనూహ్యంగా నిష్క్రమించారు. ఢిల్లీలో బుధవారం పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్‌లో అమెరికాకు చెందిన గారెట్ టాన్‌పై తొలి గేమ్‌ను గెలుచుకున్న లక్ష్య రెండో గేమ్‌లో వెనుకబడ్డాడు. టాన్ పుంజుకుని రెండో గేమ్‌ను దక్కించుకోవడంతో మ్యాచ్ నిర్ణాయక మూడో గేమ్‌కు చేరుకుంది. ఈ గేమ్‌లో లక్ష్య పోరాడినా టాన్ ప్రారంభం నుండే దూకుడును ప్రదర్శించాడు. ఒక దశలో 11-4 ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే లక్ష్యసేన్ చివరిన వరుస పాయింట్లు సాధించడంతో స్కోర్ 17-16కు చేరింది. కీలక సమయంలో గారెట్ వరుస పాయింట్లు తెచ్చుకోవడంతో 21-17తో మూడో గేమ్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఓటమితో ఈ టోర్నీలో లక్ష్యసేన్ ప్రయాణం ముగిసింది. అలాగే మహిళల మూడుగేమ్‌ల పోరులో, 18 ఏళ్ల ఉన్నతి హుడా కెనడాకు చెందిన 13వ సీడ్ మిషెల్ లీ చేతిలో ఓడిపోవడంతో ఛాంపియన్‌షిప్ ప్రచారం ముగిసింది. ఉన్నత ర్యాంకులో ఉన్న కెనడియన్ క్రీడాకారిణిపై ఆధిపత్యం చెలాయిస్తూ, ఉన్నతి తొలి గేమ్‌ను 21-11 తేడాతో సునాయాసంగా గెలుచుకుంది. రెండో గేమ్‌లో లీ బలంగా పుంజుకుని, 21-9 తేడాతో ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను సమం చేయడంతో నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడో గేమ్ పోరులో చివరి నిమిషాల్లో ఉన్నతిపై లీ స్వల్ప ఆధిక్యం సాధించి గేమ్‌ను 23-21 తేడాతో ముగించింది. ఇక పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఎంఆర్ అర్జున్-హరిహరన్, దక్షిణ కొరియాకు చెందిన ఎంహెచ్ కాంగ్-డి కి చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి పాలయ్యారు. తొలి రౌండ్‌లో భారత ద్వయం, కొరియా జోడీ చేతిలో 17-21, 14-21 తేడాతో ఓడిపోయింది.




## టీమిండియా ఘన విజయం
### 165 రన్స్ తేడాతో శ్రీలంక ఓటమి


**కొలంబో:** శ్రీలంక పర్యటనను టీమిండియా ఘనంగా ప్రారంభించింది. గాలె వేదికగా బుధవారం ముగిసిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. యువ స్పిన్నర్ మానవ్ సుతార్(6/55, 4/76)10 వికెట్ల ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. 84/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను కొనసాగించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ధనంజయ డిసిల్వా(151 బంతుల్లో 7 ఫోర్లతో 59), సోనాల్ దినుషా (129 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీలతో రాణించగా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(6/55) ఆరు వికెట్లు తీయగా, ప్రసిధ్ కృష్ణ(2/16) రెండు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి రోజు ఆటలో డిసిల్వా, సోనాల్ దినుషా భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించినా, జడేజా ఈ జోడీని విడదీసి ఐదో వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడినా, మానవ్ సుతార్ దెబ్బతీసాడు. వరుస బంతుల్లో సోనాల్ దినుషా, ప్రబాత్ జయసూర్యను పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాతి ఓవర్లలో లాహిరు కుమార, కేశర నువాంతలను ఔట్ చేసి భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.


## కెప్టెన్ హార్దిక్ సహా
# 8 మందికి గుడ్‌బై
### ముంబై ఇండియన్స్ సంచలన నిర్ణయం

**న్యూఢిల్లీ:** ముంబయి ఇండియన్స్ జట్టులో భారీ మార్పులు జరుగుతున్నాయి. 2020లో చివరిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలిచిన ముంబయి ఇండియన్స్ ఆ తర్వాతి ఆరు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 2026 సీజన్‌లో ముంబై తొమ్మిదో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే సీజన్‌కు ముందు జట్టును పునర్నిర్మించే ఆలోచనలో ఫ్రాంచైజీ ఉందనే అంచనాలు పెరిగాయి. ఇందులో భాగంగా ప్రక్షాళన చేపట్టి 2027 ఐపీఎల్ నాటికి జట్టును పటిష్ట స్థితికి తీసుకెళ్లాలని యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే రిటెన్షన్‌పై కీలక నిర్ణయాలు తీసుకోనుందనే అంచనాలు ఉన్నాయి. అందులో కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు ఉండటం చర్చకు దారితీస్తోంది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ జాబితా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

అయినా కోర్ ఆటగాళ్లలో కొందరిని కొనసాగించే అవకాశం ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మతో పాటు, రియాన్ రికెల్టన్, విల్ జాక్స్, నామన్ ధీర్, కార్బిన్ బోష్, మిచెల్ సాంట్నర్, అల్లా గజన్‌ఫర్ పేర్లు రిటెన్షన్ రేసులో ఉన్నట్లు సమాచారం. హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపైనే ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. హార్దిక్‌తో పాటు, క్వింటన్ డి కాక్, ట్రెంట్ బౌల్ట్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్, రాబిన్ మింజ్, దానిష్ మాలేవార్ పేర్లు కూడా విడుదలయ్యే ఆటగాళ్ల జాబితాలో వినిపిస్తున్నాయి. 2024 నుంచి ముంబై కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హార్దిక్ వచ్చే సీజన్‌లో మరో ఫ్రాంచైజీకి వెళ్లే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. ఆయనను ట్రేడ్ చేయడం లేదా నేరుగా విడుదల చేయడం జరిగే అవకాశాలను ప్రస్తావిస్తున్నారు. హార్దిక్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ ముందంజలో ఉండొచ్చని సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ కూడా ఆసక్తి చూపే జట్లుగా పేర్కొంటున్నారు. అయితే తుది నిర్ణయం ఫ్రాంచైజీల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టమవుతుంది. ఈ మార్పులతో వేలానికి ముందు ముంబై పర్స్ విలువ పెంచుకోవాలని చూస్తున్నట్లు అంచనా. తద్వారా అవసరమైన స్థానాల్లో కొత్త ఆటగాళ్లను తీసుకునే అవకాశం ఉంటుంది. ముంబయి ఇండియన్స్ రిటెన్షన్ లిస్ట్ ఇంకా అధికారికంగా రాలేదు. అయినా హార్దిక్ పాండ్యా సహా 8 మంది విడుదలయ్యే అవకాశాలపై వస్తున్న అంచనాలతో ముంబై జట్టు రూపమే గణనీయంగా మారే అవకాశం ఉంది.





## సిన్సినాటి ఓపెన్‌లో దూసుకెళుతున్న సబాలెంకా, ఆండ్రీవా, గౌఫ్

**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 అరీనా సబలెంకా, ఐదవ సీడ్ మీరా ఆండ్రీవా, నాల్గవ సీడ్ కోకో గాఫ్ సిన్సినాటి ఓపెన్‌లో ఘన విజయాలతో దూసుకెళుతున్నారు. సబలెంకా కేవలం 54 నిమిషాల్లో వాంగ్ జిన్యును 6-1, 6-3 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు, ఆండ్రీవా 32వ సీడ్ జానిస్ టెన్ నుండి గట్టి పోటీని ఎదుర్కొని, ఒక గంట 42 నిమిషాల పోరులో 6-1, 7-6(5) తేడాతో విజయం సాధించింది. 19 ఏళ్ల ఆ క్రీడాకారిణి తన నాలుగో మ్యాచ్ పాయింట్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకుని, సిన్సినాటిలో రెండోసారి నాలుగో రౌండ్‌కు చేరుకుంది. అలాగే నాలుగో సీడ్, 2023 సిన్సినాటి ఛాంపియన్ కోకో గాఫ్ కూడా తన తోటి అమెరికన్ క్రీడాకారిణి ఆన్ లీని 6-1, 7-6(3) తేడాతో ఓడించి ముందంజ వేసింది.

# వాణిజ్యం

## ఇండిగో టికెట్ల బుకింగ్ వ్యవస్థలో సడెన్ బ్రేక్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశీయ విమానయాన మార్కెట్లో అతిపెద్ద సంస్థ ఇండిగో వెబ్‌సైట్‌లో బుధవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో పలువురు ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకోలేకపోయారు. ఢిల్లీ నుంచి పలు నగరాలకు వెళ్లేందుకు ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు ఈ సమస్య ఎదురైంది. వేర్వేరు తేదీల్లో విమానాల కోసం వెతికినా




అందుబాటులో ఉన్న సర్వీసుల వివరాలు కనిపించలేదని ప్రయాణికులు తెలిపారు. మరో ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లోనూ ఇండిగో టికెట్ బుక్ చేసుకునే సమయంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు సందేశం వచ్చింది. వెబ్‌సైట్ సమస్యపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. టికెట్లు బుక్ చేసుకోవడంతోపాటు ఆన్‌లైన్ చెక్‌ఇన్ పూర్తి చేయడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విమానాల వివరాలు కనిపించకపోవడంతో తదుపరి ప్రక్రియకు వెళ్లలేకపోయామన్నారు. ఈ సాంకేతిక సమస్యకు కారణమేంటన్న దానిపై ఇండిగో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సమస్య ఎంతమందిని ప్రభావితం చేసిందన్న వివరాలు కూడా వెల్లడించలేదు. దేశీయ విమానయాన మార్కెట్లో ఇండిగోకు 65 శాతానికిపైగా వాటా ఉంది. గత డిసెంబరులోనూ సంస్థ భారీ స్థాయిలో కార్యకలాపాల సమస్యను ఎదుర్కొంది. పైలట్ల రోస్టర్ నిర్వహణలో లోపాల కారణంగా సుమారు 4,500 విమానాలు రద్దయ్యాయి. దాంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజా ఘటనతో విమాన ప్రయాణాలకు సంబంధించిన డిజిటల్ సేవలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



## వరుస నష్టాల్లో బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు

**ముంబయి, ఆగస్టు 19:** అధిక స్థాయిలో కొనసాగుతున్న ముడి చమురు ధరలు, పెరిగిన గ్లోబల్ బాండ్ ఈల్డ్స్, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో కీలక బెంచ్‌మార్క్ సూచీలు బుధవారం వరుసగా నష్టాలను చవిచూశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా దిగువకు ముగిశాయి. రక్షణ, ఇంధన రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా అత్యధిక రంగ సూచీలు నష్టాల్లో ముగియగా, ఐటీ షేర్లు మాత్రం బేరసారాల కొనుగోళ్లతో లాభపడ్డాయి.అమెరికాఇరాన్ వివాదం, హోర్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో సరఫరాపై ఆందోళనలు కొనసాగడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 92 డాలర్లకు చేరువలోనే ఉంది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 325.78 పాయింట్లు నష్టపోయి 76,909.68 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 సూచీ 76.60 పాయింట్లు కోల్పోయి 24,078.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టపోయింది. మొత్తం 1.49 శాతం దిగజారింది. నిఫ్టీ వరుసగా ఏడో సెషన్‌లో నష్టపోయి మొత్తం 2.05 శాతం క్షీణించింది.నిఫ్టీ నష్టాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.71 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.41 శాతం క్షీణతతో ప్రధాన కారణాలుగా నిలిచాయి.విస్తృత మార్కెట్‌లో బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 శాతం పడిపోయాయి. బీఎస్‌ఈలో మొత్తం 4,734 షేర్లలో 1,807 షేర్లు లాభపడగా, 2,483 షేర్లు నష్టపోయాయి. మరో 244 షేర్లు మార్పులేకుండా ముగిశాయి.కమోడిటీ మార్కెట్‌లో అక్టోబర్ 2026 సెటిల్‌మెంట్ బ్రెంట్ క్రూడ్ ధర 97 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 91.99 డాలర్లకు చేరింది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి స్వల్పంగా బలహీనపడి డాలర్‌తో పోలిస్తే 95.7550 వద్ద ట్రేడైంది. గత సెషన్‌లో ఇది 95.7450 వద్ద ముగిసింది.ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.02 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,290 వద్దకు చేరాయి.వ్యక్తిగత షేర్లలో రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 3.50 శాతం, ప్రిజమ్ జాన్సన్ 5.10 శాతం, ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ 1.05 శాతం, సీగల్ ఇండియా 2.06 శాతం, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 0.98 శాతం లాభపడ్డాయి. మరోవైపు రెఫెక్స్ ఇండస్ట్రీస్ 0.93 శాతం, ఇండిజీన్ 0.14 శాతం, ఇంటర్‌ఆర్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ 1.33 శాతం నష్టపోయాయి.

## ఈ యేడాదిలో ఒక్కసారే రెపోరేట్ల సవరణఛాన్స్
### ఆర్బీఐ డిప్యూటి గవర్నర్ పూనమ్ గుప్తా




**ముంబై, ఆగస్టు 19:** అంతర్జాతీయ అనిశ్చితులు, పెరుగుతున్న చమురు ధరల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఇకపై వడ్డీ రేట్ల కోతకు అవకాశం కనిపించడం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్, ఎంపీసీ సభ్యురాలు పూనమ్ గుప్తా పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఒకసారి వడ్డీ రేటు పెంపునకు అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.బుధవారం విడుదలైన ఎంపీసీ సమావేశం మినిట్స్‌లో పూనమ్ గుప్తా తన అభిప్రాయాలను వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం గరిష్ఠంగా 5.9 శాతానికి చేరే అవకాశం ఉన్నందున, ఈ ఏడాది కాలంలో వడ్డీ రేటు పెంపునకు పరిస్థితులు అనుకూలించవచ్చని ఆమె తెలిపారు.ప్రస్తుతం మరింత ద్రవ్య విధాన సడలింపునకు అవకాశం లేదని పేర్కొన్న ఆమె, మెరుగుపడుతున్న రుతుపవన పరిస్థితులు, దేశీయ ఆర్థిక కార్యకలాపాల్లో స్థిరత్వం కారణంగా భారత వృద్ధి అంచనాలు బలపడ్డాయని చెప్పారు. జూన్‌లో నమోదైన వర్షాభావ లోటు జూలైలో తగ్గిందని, దీంతో పంటల సాగు వేగం పుంజుకుందని తెలిపారు. జలాశయాల్లో నీటి మట్టాలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. పలు ఆర్థిక సూచీలు దేశీయ ఆర్థిక వ్యవస్థలో చురుకుదనం, స్థిరత్వాన్ని కొనసాగిస్తున్నాయని, ఇవి వృద్ధి వేగానికి మద్దతునిస్తున్నాయని పూనమ్ గుప్తా వివరించారు.జూన్‌లో స్వల్ప విరామం తర్వాత జూలైలో అమెరికాఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రతరం అయినప్పటికీ, చమురు, ఇతర ఇంధన ఉత్పత్తుల ధరలు, లభ్యతపై అంచనాలు మెరుగుపడ్డాయని ఆమె తెలిపారు.2026-27లో భారత వాస్తవ జీడీపీ వృద్ధి 6.7 శాతంగా, వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.0 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. గత అంచనాలతో పోలిస్తే వృద్ధి అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచగా, ద్రవ్యోల్బణ అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది.ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఏడాది సగటు ముడి చమురు ధర అంచనాలో స్వల్ప మార్పు చేయాల్సిన అవసరం ఉందని పూనమ్ గుప్తా అన్నారు. ప్రస్తుత చమురు ఫ్యూచర్స్ ధరలను బట్టి చూస్తే, 2026-27లో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు సుమారు 90 డాలర్లు ఉండొచ్చని అంచనా వేశారు.ఇదిలా ఉండగా, ఏప్రిల్‌లో ప్రకటించిన ద్రవ్య విధానంలో ఏడాది సగటు చమురు ధరను బ్యారెల్‌కు 85 డాలర్లుగా అంచనా వేయగా, జూన్ పాలసీలో ఆ అంచనాను 95 డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే.



## ధేను బిల్డ్‌కాన్‌లో రూ.1,000 కోట్ల రుణాల మళ్లింపు
### సర్క్యులర్ ఫండింగ్‌పై సెబీ మధ్యంతర ఉత్తర్వులు

**ముంబయి,ఆగస్టు 19:** ధేను బిల్డ్‌కాన్‌ఇన్‌ఫ్రాకు సంబంధించి నిధులమళ్లింపు వ్యవస్థను సెబీ గుర్తించింది. మొదట సేకరించిన కొంత మొత్తాన్ని పలు కంపెనీల ద్వారా పదేపదే తిప్పి, రూ.1,000కోట్ల కొత్తరుణాలు వచ్చినట్లుగా చూపించి, అందులో సుమారు రూ.840 కోట్లను షేర్లుగా మార్చినట్లు నియంత్రణ సంస్థ ఆరోపించింది. దీనిని సెబీ మోసపూరిత ఆర్థిక నెట్‌వర్క్ గా అభివర్ణించింది.బుధవారం జారీ చేసిన మధ్యంతర, ఎక్స్‌పార్టీ ఉత్తర్వుల్లో సెబీ ఈ వివరాలను వెల్లడించింది.ధేనుసంస్థ, బ్యాంకు ఖాతాలు, భవిష్యత్తులో జరగాల్సిన ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపుపై చర్చలు జరిగినట్లు సందేశాలు సూచిస్తున్నాయి. నవంబర్ నాటికి రుణ ఒప్పందాలు, స్టాంప్ పేపర్లు, కేవైసీ, బ్యాంకు ధ్రువీకరణ అంశాలపై చర్చలు జరిగినట్లు గుర్తించింది. 46 లావాదేవీల ద్వారా రూ.1,000 కోట్లుడిసెంబర్ 21,2024న ధేను తనరుణపరిమితిని రూ.1,000 కోట్లకు పెంచింది. అనంతరం డిసెంబర్ 24 నుంచి 31 మధ్య 46 లావాదేవీల ద్వారా ఏడు రుణదాతల నుంచి రూ.1,000 కోట్లు అందుకున్నట్లు చూపించారు.ఈ లావాదేవీలను వెనుకకు అనుసరించిన సెబీ 28 రకాల నిధుల మళ్లింపు మార్గాలను గుర్తించింది. ధేను రూ.1,000 కోట్ల రుణాలు పొందినట్లు చూపించినప్పటికీ, ఆ సమయంలో సంస్థ బ్యాంకు ఖాతాల్లో గరిష్ఠ నిల్వ రూ.25.81 కోట్లుగా ఉన్నట్లు గుర్తించింది.అదే సమయంలో ధేను నుంచి సుమారు రూ.996.1 కోట్లు ఐదు సంస్థలకు వెళ్లినట్లు సెబీ తెలిపింది. వాటిలో జెనెసిస్ డెవలపర్స్ అండ్ హోల్డింగ్స్, హిల్‌రిడ్జ్ ఇన్వెస్ట్‌మెంట్స్, అభిజిత్ ట్రేడింగ్, ఇంటెలెక్చువల్ బిల్డర్స్ తదితర సంస్థలు ఉన్నాయి.ఇది కేవలం కంపెనీల మధ్య డబ్బు బదిలీ కాదని సెబీ పేర్కొంది. ఉదాహరణకు టియాన్ సంస్థ సంబంధిత సంవత్సరాల్లో కేవలం కొన్ని లక్షల రూపాయల ఆదాయాన్ని చూపినప్పటికీ, ధేనుకు రూ.160 కోట్ల రుణం ఇచ్చినట్లు పేర్కొంది.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయుటకు QR స్కాన్ చేయండి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) రిక్రూట్‌మెంట్

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

ఖాళీల సంఖ్య :
సాధారణ : 7680 + బ్యాక్ లాగ్ : 287

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/CR/2026-27/17** లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **11.08.2026** నుండి **31.08.2026** వరకు.

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు - **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings**లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 11.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.